అక్షర విజేత
Email: vijethatelugudaily@gmail.com
రిపోర్టర్స్ కావలెను
కరీంనగర్ జిల్లాలో : కరీంనగర్ కలెక్టరేట్, కరీంనగర్ క్రైం, కరీంనగర్ సిటీ, శాతవాహన యూనివర్సిటీ, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, గంగాధర, చొప్పదండి, ఇల్లందకుంట, జమ్మికుంట టౌన్, జమ్మికుంట రూరల్, సైదాపూర్,
సిరిసిల్ల జిల్లాలో : సిరిసిల్ల, సిరిసిల్ల టౌన్, సిరిసిల్ల రూరల్, సిరిసిల్ల కలెక్టరేట్, సిరిసిల్ల క్రైం, తంగళ్ళపల్లి, గంభీర్‌రావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, బోయిన్‌పల్లి.
పెద్దపల్లి జిల్లాలో : పెద్దపల్లి క్రైం, ఎలిగేడు, కమాన్‌పూర్, యైటిన్‌క్లయిన్‌కాలనీ, మంథని టౌన్, మంథని రూరల్, గోదావరిఖని, గోదావరిఖని టౌన్, గోదావరిఖని క్రైం, గోదావరిఖని రూరల్,
జగిత్యాల జిల్లాలో : జగిత్యాల రూరల్, జగిత్యాల క్రైం, ధర్మపురి రూరల్, బుగ్గారం, వెల్గటూర్, మెట్‌పల్లి టౌన్, మేడిపల్లి.
బి. అనిల్‌కుమార్, ఎడిటర్
77028 66885

తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక

B. ANIL KUMAR
CHAIRMAN & CHIEF EDITER
7702866885
9059324231
RNI TELTEL/2021/81079
తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక
DAIWIK PUBLICATIONS & BROADCASTING PVT. LTD.
www.aksharavijetha.com., epaper.aksharavijetha.com
email : vijethatelugudaily@gmail.com
కావలెను
విజేత ఛానల్‌లో పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి విలేకరులు, యాంకర్లు, న్యూస్ ఎడిటర్లు, కంటెంట్ రైటర్స్, కెమెరా మెన్, మరియు స్టూడియోలో పనిచేయుటకు స్త్రీ & పురుష సిబ్బంది కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఉంటుంది.
సంప్రదించుటకు : 7702866885, 9059324231

హైదరాబాద్ సంపుటి:06 సంచిక :46 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 12, వెల. 6రూ/ శుక్రవారం- 24 - అక్టోంబర్ - 2025

## వీడిన ఉత్కంఠ.. బీహార్ సీఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్



- బీహార్ మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్
- సీట్ల పంపకాలపై ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య వీడిన ప్రతిష్టంభన
- రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ అధికారిక ప్రకటన
- కూటమిలో ఆర్జేడీకి 143 అసెంబ్లీ స్థానాలు ఖరారు
- డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ముఖేశ్ సహానీ పేరు ప్రకటన
- కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యంతో వివాదానికి తెర

బీహార్ రాజకీయాల్లో గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష 'మహాఘటబంధన్' (మహాకూటమి) తన ముఖ్యమంత్రి మిగతా..2లో

## మా నినాదం మేడిన్ ఇండియా కాదు...

# ఇన్వెంట్ ఇన్ తెలంగాణ

### "విక్టోరియా-తెలంగాణ ఇన్నోవేషన్ కారిడార్"కు నాంది పలకాలి

- తెలంగాణను "గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్ "గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం
- 80 బిలియన్ డాలర్ల నుంచి 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యం
- పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆస్ట్రేలియా కంపెనీలను కోరారు
- అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది
- బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని దిగ్గజ లైఫ్ సైన్సెస్ పరిశ్రమలను ఆహ్వానించారు



: లైఫ్ సైన్సెస్‌లో 2030 నాటికి కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టు బడులను రాష్ట్రానికి తీసుకొచ్చి.. 5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొంది స్తున్నట్లుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు.ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్‌బయోటెక్', విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో మెల్ బోర్న్‌లో నిర్వహిస్తున్న 'ఆస్‌బ యోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో మిగతా..2లో

## మహాకూటమి పోస్టర్ల నుంచి రాహుల్ గాంధీ మాయం!



2లో

- మహాకూటమి ప్రెస్ మీట్ పోస్టర్లలో మాయమైన రాహుల్ గాంధీ ఫొటో
- సీఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను ప్రకటించేందుకు రంగం సిద్ధం
- కాంగ్రెస్ పార్టీకి గౌరవం లేదంటూ బీజేపీ నేతల ఎద్దేవా
- యాదవ, ముస్లిం ఓట్లను ఏకం చేసే వ్యూహంతోనే ఈ నిర్ణయం
- ఇప్పటికీ కొలిక్కిరాని సీట్ల పంపకాలపై కూటమిలో చర్చలు

## ఏపీలో భారీ వర్షాలు... దుబాయ్ నుంచే అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

- యూఏఈ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో భారీ వర్షాలపై దుబాయ్ నుంచి అధికారులతో సమీక్ష
- నెల్లూరు, ప్రకాశం, కడప సహా ఐదు జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం
- ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశం
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచన
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు



రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటనలో ఉన్నప్పటికీ, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని మిగతా..2లో



## పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ

- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భేటీ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చ
- హాజరైన హరీశ్‌రావు సహా పలువురు మాజీ మంత్రులు, ముఖ్య నేతలు

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికను బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి వ్యూహాలకు పదును పెడుతున్నారు.

## పుతిన్‌తో చర్చలు బాగుంటాయి... కానీ, ఫలితం మాత్రం ఉండదు: డొనాల్డ్ ట్రంప్ అసహనం

- రష్యాకు చెందిన రెండు అతిపెద్ద ఆయిల్ కంపెనీలపై అమెరికా కొత్త ఆంక్షలు
- శాంతి చర్చల్లో పురోగతి లేకపోవడమే ప్రధాన కారణం
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జరగాల్సిన భేటీని రద్దు చేసుకున్న ట్రంప్



ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు శాంతి చర్చల విషయంలో ముందుకురాని రష్యాపై అమెరికా తన వైఖరిని కఠినతరం చేసింది. రష్యా ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమైన రెండు అతిపెద్ద చమురు కంపెనీలపై కొత్త ఆంక్షలను విధిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఒత్తిడి పెంచి, ఆయన్ను చర్చల వేదికపైకి తీసుకు రావడమే ఈ చర్యల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేసింది.

## పాకిస్థాన్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై రగడ... ఎందుకీ వ్యతిరేకత?




- గర్భాశయ క్యాన్సర్ నివారణకు పాకిస్థాన్‌లో భారీ వ్యాక్సినేషన్ కార్యక్రమం
- 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ టీకా పంపిణీ
- ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు కూతురికి టీకా వేయించిన ఆరోగ్య మంత్రి
- మంత్రి చర్యతో తగ్గిన వ్యతిరేకత, పెరిగిన టీకాల పంపిణీ

## నవంబర్ 1 నుంచి కొత్త నామినేషన్ రూల్స్.. మారనున్న బ్యాంకు నిబంధనలు ఇవే!



- నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త బ్యాంకింగ్ నామినేషన్ నిబంధనలు
- ఖాతాదారులు నలుగురి వరకు నామినీలను నియమించుకునే అవకాశం
- డిపాజిట్లకు ఏకకాలంలో లేదా ఒకరి తర్వాత ఒకరిగా నామినేషన్ సౌకర్యం
- సేఫ్టీ లాకర్లకు మాత్రం ఒకరి తర్వాత ఒకరు పద్ధతిలోనే నామినేషన్
- నామినీలకు ఎంత వాటా ఇవ్వాలో కూడా నిర్ణయించుకునే వెసులుబాటు

## విక్టోరియా మోడల్‌లో ఏపీ అభివృద్ధి.. సహకారం కోరిన మంత్రి నారా లోకేశ్



- ఆస్ట్రేలియాలోని విక్టోరియా మంత్రి స్టీవ్ డిమోపౌలోస్‌తో మంత్రి లోకేశ్ భేటీ
- ఏపీలో హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి సహకారం అభ్యర్థన
- క్రికెట్, హాకీల్లో ఉమ్మడి శిబిరాలు, మ్యాచ్‌ల నిర్వహణకు ప్రతిపాదన
- తీర ప్రాంత పరిరక్షణకు విక్టోరియా టెక్నాలజీపై ఆసక్తి
- యువతకు గ్రీన్ జాబ్స్‌లో నైపుణ్యాభివృద్ధికి చేయూతనివ్వాలని విజ్ఞప్తి
- అరకు, పులికాట్‌లలో అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి సాయం కోరిన లోకేశ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలంటూ ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. పర్యాటకం, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక రంగాల్లో విక్టోరియా సాధించిన ప్రగతిని, సాంకేతిక నైపుణ్యాన్ని ఏపీకి అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆయన మెల్‌బోర్న్‌లో విక్టోరియా రాష్ట్ర పర్యావరణ, టూరిజం, స్పోర్ట్స్ శాఖల మంత్రి స్టీవ్ డిమోపౌలోస్‌తో మిగతా..2లో

# ఏపీ ఆరోగ్య విద్యలో కొత్త శకం..

### టాస్మానియా వర్సిటీతో మంత్రి లోకేశ్ కీలక చర్చలు

- ఫార్మసీ, పారామెడికల్ కోర్సుల అభివృద్ధికి టాస్మానియా వర్సిటీతో చర్చలు
- గ్రామీణ ఆరోగ్యం, తాగునీటిపై ఉమ్మడి పరిశోధనలకు ప్రతిపాదన
- ఏపీ విద్యార్థులకు ఆస్ట్రేలియాలో ప్లేస్‌మెంట్ కోసం ప్రత్యేక స్కిల్ ప్రోగ్రామ్స్
- విశాఖలో గ్లోబల్ సెంటర్ ఏర్పాటు చేయాలని బుపా సంస్థకు లోకేశ్ ఆహ్వానం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన బుపా యాజమాన్యం



ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మసీ, పారామెడికల్ విద్యారంగాలను అంత ర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన ఆస్ట్రేలియా పర్యటనలో కీలక అడుగులు

## బాలకృష్ణపై జగన్ సంచలన ఆరోపణలు.. అసెంబ్లీకి తాగి వచ్చారంటూ ఫైర్!



2లో

- అసెంబ్లీలో బాలయ్య వ్యాఖ్యలపై స్పందించిన జగన్
- బాలకృష్ణ తాగి మాట్లాడారంటూ సంచలన ఆరోపణలు
- ఆయన మానసిక ఆరోగ్యంపై అనుమానాలున్నాయని వ్యాఖ్య
- తాగి మాట్లాడే వ్యక్తిని ఎలా అనుమతిస్తారని ప్రశ్న
- అనుమతించిన స్పీకర్‌కు బుద్ధి లేదంటూ తీవ్ర విమర్శలు

## పాకిస్థాన్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై రగడ... ఎందుకీ వ్యతిరేకత?

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం చేపట్టిన చరిత్రాత్మక వ్యాక్సినేషన్ కార్యక్రమానికి తప్పుడు ప్రచారాలు పెద్ద అడ్డంకిగా మారాయి. వ్యాక్సిన్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, అపోహలను తొలగించేందుకు ఆ దేశ ఆరోగ్య శాఖ మంత్రి సయ్యద్ ముస్తఫా కమల్ అసాధారణ చర్య తీసుకున్నారు. స్వయంగా తన కుమార్తెను మీడియా ముందుకు తీసుకొచ్చి, బహిరంగంగా హెచ్‌పీవీ టీకా వేయించి ప్రజల్లో నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. పాకిస్థాన్‌లో గర్భాశయ క్యాన్సర్ కారణంగా ప్రతిరోజూ 8 మంది మహిళలు మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధికి ప్రధాన కారణమైన హ్యూమన్ పాపిలోమావైరస్ (హెచ్‌పీవీ)ని నిరోధించేందుకు, పాక్ ప్రభుత్వం సెప్టెంబర్ 15న దేశవ్యాప్తంగా మెగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదటి దశలో 9 నుంచి 14 ఏళ్లలోపు 1.3 కోట్ల మంది బాలికలకు టీకా వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, కార్యక్రమం మొదలైన కొద్ది రోజులకే సోషల్ మీడియాలో నకిలీ వీడియోలు, వదంతులు వెల్లువెత్తాయి. ఈ వ్యాక్సిన్ వంధ్యత్వానికి కారణమవుతుందని, ఇది విదేశీ కుట్రలో భాగమని దుష్ప్రచారం ఊపందుకుంది. దీంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు టీకా వేయించేందుకు నిరాకరించారు. కొన్ని పాఠశాలలు కూడా ఆరోగ్య కార్యకర్తలను లోపలికి అనుమతించలేదు. ఈ ప్రతికూల పరిస్థితుల మధ్య, ఆరోగ్య మంత్రి ముస్తఫా కమల్ కరాచీలో తన కుమార్తెకు టీకా వేయించారు. "ఈ వ్యాక్సిన్ సురక్షితమైనది, సమర్థవంతమైనది. మా ఆడపిల్లలను రక్షించుకోవడం చాలా ముఖ్యం. ఇలాంటి తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు" అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంత్రి తీసుకున్న ఈ చర్య సత్ఫలితాలనిచ్చింది. ప్రజల్లో నెమ్మదిగా నమ్మకం పెరగడంతో, టీకా తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో మొదట సెప్టెంబర్ 27తో ముగియాల్సిన కార్యక్రమాన్ని అక్టోబర్ 1 వరకు పొడిగించారు. సింధ్ ప్రావిన్స్ ఆరోగ్య మంత్రి డాక్టర్ అజ్రా ఫజల్ మాట్లాడుతూ, "అపోహలు తొలగిపోయాక, ప్రజలు స్వచ్ఛందంగా టీకా కేంద్రాలకు రావడం మొదలుపెట్టారు" అని తెలిపారు. ఇప్పటివరకు లక్ష్యంగా నిర్దేశించుకున్న 1.3 కోట్ల మందిలో 92 లక్షల మంది (78 శాతం) బాలికలకు వ్యాక్సినేషన్ పూర్తయింది. రాబోయే దశల్లో మిగతా ప్రావిన్సులలో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## నవంబర్ 1 నుంచి కొత్త నామినేషన్ రూల్స్..
## మారనున్న బ్యాంకు నిబంధనలు ఇవే!

బ్యాంకు ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. డిపాజిట్ ఖాతాలు, సేఫ్టీ లాకర్లకు సంబంధించిన నామినేషన్ సౌకర్యాలలో కీలక మార్పులు తీసుకువచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం, ఖాతాదారులు ఇకపై ఒకరికి బదులుగా గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా నియమించుకోవచ్చు. ఈ కొత్త విధానం నవంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం 2025లో భాగంగా ఈ కొత్త నిబంధనలను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం బ్యాంకు డిపాజిట్లకు నామినీలను రెండు విధాలుగా నియమించుకునే అవకాశం కల్పించారు. ఖాతాదారులు తమకు నచ్చిన విధంగా నలుగురు నామినీలకు ఒకేసారి లేదా ఒకరి తర్వాత మరొకరికి ప్రయోజనం అందేలా ఎంచుకోవచ్చు. అయితే, బ్యాంకుల్లోని సేఫ్ కస్టడీ వస్తువులకు, సేఫ్టీ లాకర్లకు మాత్రం ఒకరి తర్వాత మరొకరు అనే పద్ధతిలోనే నామినేషన్ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. ఈ కొత్త విధానంలో మరో ముఖ్యమైన సౌలభ్యం కూడా ఉంది. నలుగురు నామినీలను ఎంచుకున్నప్పుడు, ఎవరికి ఎంత వాటా (శాతం) చెందాలో కూడా ఖాతాదారులే ముందుగా నిర్దేశించవచ్చు. అయితే, మొత్తం వాటాలన్నీ కలిపి 100 శాతానికి సమానంగా ఉండాలి. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో క్లెయిమ్ సెటిల్‌మెంట్లు చాలా సులభంగా, పారదర్శకంగా పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటం, కస్టమర్లకు సౌకర్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టంలోని సెక్షన్లు 10, 11, 12, 13.. నవంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ నిబంధనలను అన్ని బ్యాంకుల్లో ఒకే విధంగా అమలు చేయడానికి అవసరమైన 'బ్యాంకింగ్ కంపెనీల (నామినేషన్) నిబంధనలు-2025'ను, సంబంధిత ఫారాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## బాలకృష్ణపై జగన్ సంచలన ఆరోపణలు..
## అసెంబ్లీకి తాగి వచ్చారంటూ ఫైర్!

మెగాస్టార్ చిరంజీవిపై ఏపీ అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యల దుమారం కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై వైసీపీ అధినేత జగన్ ఘాటుగా స్పందించారు. బాలకృష్ణ అసెంబ్లీకి మద్యం సేవించి వచ్చారని, ఆయన మానసిక స్థితి సరిగా లేదని సంచలన ఆరోపణలు చేశారు. బాలకృష్ణ వ్యాఖ్యలు, పవన్ కల్యాణ్ మౌనంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "అసెంబ్లీలో మాట్లాడాల్సింది ఏంటి? ఆయన మాట్లాడింది ఏంటి? అదంతా పనికిమాలిన సంభాషణ. బాలకృష్ణ అసెంబ్లీలో తాగి మాట్లాడారు. తాగి వచ్చిన వ్యక్తిని సభలోకి ఎలా అనుమతిస్తారు? అలా మాట్లాడేందుకు అనుమతించిన స్పీకర్‌కు బుద్ధి లేదు" అని జగన్ తీవ్రంగా విమర్శించారు. అంతటితో ఆగకుండా, "బాలకృష్ణ మానసిక స్థితి ఏంటో ఆ మాటలతోనే అర్థమవుతోంది. తన సైకలాజికల్ ఆరోగ్యం ఎలా ఉందో ఆయనే ప్రశ్నించుకోవాలి" అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సినీ ప్రముఖులను అవమానించారంటూ బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శాసనసభలో చర్చను ప్రారంభించారు. దానిని కొనసాగిస్తూ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ... జగన్, మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. అయితే, బాలకృష్ణ తన ప్రస్తావన తీసుకురావడంపై నటుడు చిరంజీవి అప్పట్లోనే ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో తమకు ఎలాంటి అవమానం జరగలేదని, అప్పటి ముఖ్యమంత్రి జగన్ తనను ఎంతో గౌరవంగా ఆహ్వానించి మాట్లాడారని ఆయన స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## విక్టోరియా మోడల్‌లో ఏపీ అభివృద్ధి..
## సహకారం కోరిన మంత్రి నారా లోకేశ్

మొదటి పేజి తరువాయి

గురువారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో పలు రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య బలమైన భాగస్వామ్యానికి సంబంధించిన కీలక ప్రతిపాదనలను ఆయన ముందుంచారు.

పర్యాటకానికి కొత్త రూపు

వారసత్వ పర్యాటక రంగంలో విక్టోరియా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిందని లోకేశ్ ప్రస్తావించారు. ఇదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు చేయూతనివ్వాలని కోరారు. "ఆంధ్రప్రదేశ్‌లో పాపికొండలు, విశాలమైన విశాఖ బీచ్ వంటి ఎన్నో సుందరమైన ప్రదేశాలు ఉన్నాయి. విక్టోరియాలోని 'గ్రేట్ ఓషన్ రోడ్' తరహాలో పర్యావరణహిత బ్రాండింగ్‌ను ఏపీ తీర ప్రాంతానికి అందించడంలో మీ నైపుణ్యం మాకు అవసరం" అని లోకేశ్ అన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖతో కలిసి హెరిటేజ్ టూరిజం, మార్కెటింగ్, ఎకో-సర్టిఫికేషన్ వంటి అంశాలపై పనిచేయాలని ఆయన ప్రతిపాదించారు. అలాగే, విక్టోరియాలోని ఆల్పిన్ నేషనల్ పార్క్ తరహాలో ఏపీలోని అరకులో ట్రెక్కింగ్, పులికాట్‌లో వాటర్ స్పోర్ట్స్ వంటి అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అడ్వెంచర్ గైడ్లు, రేంజర్లకు విక్టోరియా సంస్థల ద్వారా శిక్షణ, సర్టిఫికేషన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణం, క్రీడారంగాల్లో సహకారం

ఆంధ్రప్రదేశ్‌కు 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉందని గుర్తుచేసిన లోకేశ్, విక్టోరియాలోని పోర్ట్ ఫిలిప్ బే ప్రాజెక్టు తరహాలో అత్యాధునిక వాతావరణ సాంకేతికతను ఉపయోగించి ఏపీ తీరప్రాంతాన్ని పరిరక్షించేందుకు ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి (ఆర్ %డ% డి) కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణ, కార్బన్ న్యూట్రల్ టూరిజం వంటి ప్రాజెక్టులపై కలిసి పనిచేయాలని కోరారు. క్రీడారంగంలోనూ భాగస్వామ్యానికి లోకేశ్ ఆసక్తి చూపారు. ఏపీ, విక్టోరియాల మధ్య క్రికెట్, హాకీ వంటి క్రీడల్లో ఉమ్మడి శిక్షణా శిబిరాలు, స్నేహపూర్వక మ్యాచ్‌లు నిర్వహించాలని ప్రతిపాదించారు. స్పోర్ట్స్ సైన్స్ విభాగంలో ఇరు ప్రాంతాల విద్యార్థుల మధ్య మార్పిడి కార్యక్రమాలకు (స్టూడెంట్ ఎక్స్ఛేంజ్) సహకరించాలని కోరారు. విక్టోరియాలోని మెల్‌బోర్న్ గ్రాండ్ ప్రిక్స్ తరహాలో ఏపీలో ప్రపంచ స్థాయి ఈవెంట్ల నిర్వహణకు సాయం అందించడంతో పాటు, రాష్ట్రంలోని ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిపుణులకు శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విక్టోరియాలో ఆఫ్ షోర్ విండ్, సోలార్ ప్రాజెక్టులు విజయవంతంగా నడుస్తున్నాయని, అదే తరహాలో ఏపీలోని యువతకు గ్రీన్ జాబ్స్‌పై నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి లోకేశ్ కోరారు.

## వీడిన ఉత్కంఠ.. బీహార్ సీఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్

మొదటి పేజి తరువాయి

అభ్యర్థిని అధికారికంగా ప్రకటించింది. ఆర్జేడీ యువనేత తేజస్వి యాదవ్ నాయకత్వంలోనే కూటమి ఎన్నికల బరిలోకి దిగనుందని స్పష్టం చేసింది. పాట్నాలోని మౌర్య హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి భాగస్వామ్య పక్షాల నేతల సమక్షంలో ఈ కీలక ప్రకటన వెలువడింది. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, బీహార్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌ఛార్జ్ అశోక్ గెహ్లాట్.. తేజస్వి యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తూ నిర్ణయాన్ని వెల్లడించారు. ఇదే సమయంలో డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ముఖేశ్ సహానీ పేరును కూడా ఆయన ఖరారు చేశారు. "తేజస్వి యాదవ్ ఒక యువ నాయకుడు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి. ఆయనకు సుదీర్ఘ రాజకీయ భవిష్యత్తు ఉంది. అందుకే, ఆయన నాయకత్వంలోనే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని మేమంతా నిర్ణయించాం" అని అశోక్ గెహ్లాట్ ఈ సందర్భంగా తెలిపారు. సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. 2020 ఎన్నికల్లో కేవలం 19 సీట్లు గెలిచినప్పటికీ, ఈసారి కూడా తమకు 70 సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అయితే, కాంగ్రెస్ గత ప్రదర్శన దృష్ట్యా అన్ని సీట్లు ఇచ్చేందుకు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సుముఖత చూపలేదు. దీంతో కూటమిలో ప్రతిష్టంభన ఏర్పడింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగింది. సమస్య పరిష్కార బాధ్యతను అశోక్ గెహ్లాట్‌కు అప్పగించింది. బుధవారం పాట్నాకు చేరుకున్న ఆయన.. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవి, తేజస్వి యాదవ్‌లతో సమావేశమై చర్చలు జరిపారు. ఈ చర్చల ఫలితంగానే కూటమిలోని అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, అందరం కలిసికట్టుగా ఎన్నికల్లో పోరాడతామని గెహ్లాట్ ప్రకటించారు. తాజా ఒప్పందం ప్రకారం, ఆర్జేడీ 143 స్థానాల్లో పోటీ చేయనుంది. ఈ నిర్ణయంతో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయేను ఎదుర్కొనేందుకు మహాకూటమి ఐక్యంగా సిద్ధమైనట్టయింది. ఈ పరిణామం కూటమి ప్రచారానికి కొత్త ఊపునిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఏపీ ఆరోగ్య విద్యలో కొత్త శకం..



మొదటి పేజి తరువాయి

ఆయన సమావేశమై, రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై చర్చించారు. ఏపీలో నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతోంది. టాస్మానియా యూనివర్సిటీని సందర్శించిన మంత్రి లోకేశ్ కు, యూనివర్సిటీ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ (అకడమిక్) ప్రొఫెసర్ నటాలీ బ్రౌన్, ఫార్మసీ విభాగ అధిపతి ప్రొఫెసర్ గ్లెన్ జాకబ్సన్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మసీ, పారామెడికల్ కోర్సుల పాఠ్య ప్రణాళికలను ప్రపంచస్థాయికి అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఆస్ట్రేలియాలో అమలు చేస్తున్న కఠినమైన అక్రిడిటేషన్ వ్యవస్థల తరహాలో ఏపీలో కూడా కరికులం రూపకల్పన చేయాలని విజ్ఞప్తి చేశారు. శిక్షణలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), టెలిమెడిసిన్ వంటి ఆధునిక డిజిటల్ హెల్త్ టూల్స్‌ను అనుసంధానించాలని సూచించారు. ఏపీలోని వైద్య కళాశాలలు, స్కిల్ యూనివర్సిటీకి టాస్మానియా వర్సిటీకి ఉన్న ఫార్మా, హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ను పరిచయం చేసి, పరిశ్రమలతో భాగస్వామ్యాలు కుదిరేలా చూడాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలోని గిరిజన ప్రాంతాలు, టాస్మానియాలోని మారుమూల కమ్యూనిటీలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఉమ్మడి పరిశోధనలు చేపట్టాలని లోకేశ్ ప్రతిపాదించారు. ఏపీలోని నర్సింగ్, ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకుల కోసం స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ఆస్ట్రేలియాలోని ఉద్యోగ అర్హతలకు అనుగుణంగా ఏపీ విద్యార్థులకు ప్రత్యేక స్కిల్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు అందించాలని, తద్వారా వారి ప్లేస్‌మెంట్ అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. ఈ ప్రతిపాదనలపై ప్రొఫెసర్ నటాలీ బ్రౌన్ సానుకూలంగా స్పందించారు. ప్రపంచంలోని టాప్ 2 శాతం యూనివర్సిటీలలో తమది ఒకటని, ఇప్పటికే తమ వర్సిటీలో 1,500 మందికి పైగా భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఐఐటీలతో కలిసి రెన్యువబుల్ ఎనర్జీ వంటి ప్రాజెక్టులపై పనిచేస్తున్నామని, కేరళ వంటి రాష్ట్రాలతో నర్సింగ్ విద్యకు సంబంధించి ఒప్పందాలు ఉన్నాయని గుర్తుచేశారు. లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలించి, ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.

### విశాఖలో గ్లోబల్ సెంటర్‌కు బుపాకు ఆహ్వానం

పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్, బ్రిటీష్ బహుళజాతి ఆరోగ్య సంరక్షణ, బీమా సంస్థ అయిన బుపా ఆసియా పసిఫిక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) బిజల్ సెజ్ పాల్‌తో కూడా సమావేశమయ్యారు. ఐటీ, డేటా సెంటర్ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో బుపా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని ఆహ్వానించారు. దీనిపై స్పందించిన బిజల్ సెజ్ పాల్, తమ సంస్థ 190 దేశాల్లో 38 మిలియన్ల వినియోగదారులతో పనిచేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను తమ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మా నినాదం మేడిన్ ఇండియా కాదు... ఇన్వెంట్ ఇన్ తెలంగాణ

మొదటి పేజి తరువాయి

ఆయన గురువారం కీలకోపన్యాసం చేశారు. రెండేళ్లలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలు, అవకాశాలు, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. తెలంగాణను "గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్ "గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు. భౌగోళికంగా 11వ స్థానం, జనాభాలో 12వ స్థానంలో ఉన్నప్పటికీ, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తెలంగాణ వాటా 5 శాతం కంటే ఎక్కువగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 2024-2025లో తెలంగాణ జీఎస్‌డీపీ వృద్ధి రేటు 8.2 శాతం కాగా, జాతీయ సగటు కేవలం 7.6 శాతం మాత్రమే ఉందన్నారు. గత 20 నెలల కాలంలో కొత్తగా రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, ఇందులో లైఫ్ సైన్సెస్ రంగం వాటా రూ.63వేల కోట్లు అని చెప్పారు. లైఫ్ సైన్సెస్ ఎగుమతులు గతేడాది ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలోనే రూ.26వేల కోట్ల మార్కును దాటాయన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం ఆర్థిక వ్యవస్థ విలువను ప్రస్తుతం ఉన్న 80 బిలియన్ డాలర్ల నుంచి 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం త్వరలోనే "కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ" ని అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ సీబీఆర్ఈ రూపొందించిన 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ 2025'లో ప్రపంచంలోని అత్యుత్తమ లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో హైదరాబాద్‌కు చోటు దక్కిందన్నారు. బోస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, కేంబ్రిడ్జ్, బీజింగ్, టోక్యో సరసన మన నగరం నిలిచిందన్నారు. ఈ జాబితాలో భారత్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక నగరం హైదరాబాద్ మాత్రమే అని అన్నారు. లైఫ్ సైన్సెస్ ఆఫీస్ లీజింగ్ 2022లో 0.6 మిలియన్ చదరపు అడుగులు ఉండగా.. 2024లో ఏకంగా నాలుగు రెట్లు పెరిగి 2.4 మిలియన్ చదరపు అడుగులకు చేరిందన్నారు. లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్, ఇతర అంతర్జాతీయ దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో రాబోయే "బయో-డిజిటల్" యుగానికి కావాల్సిన అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. మా నినాదం మేడిన్ ఇండియా కాదు... ఇన్వెంట్ ఇన్ తెలంగాణ అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన "ఎకో సిస్టం" తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తుందన్నారు. జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైసెస్ పార్క్, బీ హబ్, భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల, ప్రోత్సాహకర విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక పార్కులు, అనుమతుల కోసం సింగిల్ విండో సిస్టమ్, దేశంలోనే సాటి లేని స్టెమ్ టాలెంట్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం, ఎక్కడైనా సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సెల్ అండ్ జీన్ థెరపీ, బయోలాజిక్స్ అండ్ బయోసిమిలర్స్, ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు, కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, డయాగ్నస్టిక్స్, మెడ్‌టెక్, ఏఐ ఆధారిత డిజిటల్ హెల్త్ , హెల్త్‌టెక్, ఏపీఐ బల్క్ డ్రగ్ ఉత్పత్తి, ఫార్మా ప్యాకేజింగ్, గ్లాస్ ట్యూబింగ్, ట్రాన్స్‌లేషనల్ బయోటెక్ రీసెర్చ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, జీనోమిక్స్ , గ్రీన్ బయో మాన్యుఫ్యాక్చరింగ్,అగ్రి బయోటెక్, యానిమల్ హెల్త్ తదితర రంగాల్లో తెలంగాణలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. వీటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆస్ట్రేలియా కంపెనీలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సదస్సు "విక్టోరియా-తెలంగాణ ఇన్నోవేషన్ కారిడార్"కు నాంది పలకాలని ఆకాంక్షించారు. రాబోయే ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని దిగ్గజ లైఫ్ సైన్సెస్ పరిశ్రమలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో విక్టోరియా రాష్ట్ర మంత్రులు రోస్ స్పెన్స్, డానీ పియర్సన్ ఎంపీ, ఆస్ బయోటెక్ ఛైర్మన్ డా. జేమ్స్ క్యాంప్‌బెల్, తెలంగాణ ఇన్వెస్ట్మెంట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో భారీ వర్షాలు... దుబాయ్ నుంచే అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై ఆయన దుబాయ్ నుంచే ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముఖ్యంగా వర్షాల ప్రభావం అధికంగా ఉన్న నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), ఆర్టీజీ అధికారులతో ఆయన ఫోన్‌లో సమీక్షించారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజల బాగోగులకే తన ప్రథమ ప్రాధాన్యత అని చాటుతూ, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాలకు అవసరమైన సహాయక బృందాలను వెంటనే పంపాలని, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచి, అవసరమైన చోట రంగంలోకి దించాలని సూచించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ,



పోలీస్, జలవనరులు, మున్సిపల్, రోడ్లు-భవనాలు, విద్యుత్ శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాల్లోని ప్రజలను గుర్తించి, వారిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని గట్టిగా సూచించారు. అధికారుల స్పందనను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రికి, ఇప్పటికే దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వారు వివరించారు. కాలువలు, చెరువు గట్లను నిరంతరం పరిశీలించాలని, బలహీనంగా ఉన్న గట్లను ఇసుక బస్తాలతో పటిష్టపరచాలని చంద్రబాబు సూచించారు. వర్షాల అనంతరం అంటువ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యగా ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

### దుబాయ్ నుంచి అబుదాబికి చంద్రబాబు

మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు తన యూఏఈ పర్యటనలో భాగంగా దుబాయ్ నుంచి అబుదాబికి బయలుదేరారు. ఆయన వెంట మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. తన పర్యటనలో భాగంగా అబుదాబిలో జరగనున్న తొమ్మిది కీలక కార్యక్రమాలలో పాల్గొని, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలు నిర్వహించనున్నారు.


## పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ

మొదటి పేజి తరువాయి

ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో పార్టీకి చెందిన కీలక నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ కీలక సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సునీతా లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి వంటి ముఖ్య నేతలతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, ముఖ్యంగా ఇంటింటి ప్రచారం, ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరే నాయకుల అంశాలపై ఈ భేటీలో కూలంకషంగా చర్చించినట్టు సమాచారం. ఉప ఎన్నికలో విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులందరినీ సమాయత్తం చేయాలని ఈ సమావేశంలో కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.

## పుతిన్‌తో చర్చలు బాగుంటాయి...
## కానీ, ఫలితం మాత్రం ఉండదు: డొనాల్డ్ ట్రంప్ అసహనం

మొదటి పేజి తరువాయి



ఈ ప్రకటన వెలువడటానికి ఒక రోజు ముందే, పుతిన్‌తో బుడాపెస్ట్‌లో జరగాల్సిన సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. "పుతిన్‌తో మాట్లాడిన ప్రతిసారీ చర్చలు బాగానే సాగుతాయి, కానీ అవి ఎక్కడికీ దారితీయడం లేదు" అని ట్రంప్ తన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకు సంయమనం పాటిస్తూ వచ్చిన ట్రంప్ సర్కార్, ఒక్కసారిగా ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం ఆయన విదేశాంగ విధానంలో వచ్చిన పెద్ద మార్పుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, "ఈ అర్థంలేని యుద్ధాన్ని ముగించడానికి పుతిన్ నిరాకరిస్తున్నందువల్లే ఈ ఆంక్షలు అవసరమయ్యాయి" అని తెలిపారు. రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్, లుకాయిల్ అనే ఈ రెండు కంపెనీలు రష్యా యుద్ధ యంత్రాంగానికి నిధులు సమకూరుస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు కంపెనీలు రోజుకు 3.1 మిలియన్ బ్యారెళ్ల చమురును ఎగుమతి చేస్తాయి. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ స్వాగతించారు. ఇది అమెరికా నుంచి వచ్చిన మంచి సంకేతం అని, ఇతర దేశాలు కూడా ఇలాగే ఒత్తిడి పెంచితే కాల్పుల విరమణ సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతవారమే బ్రిటన్ కూడా ఇదే తరహా ఆంక్షలను ప్రకటించగా, యూరోపియన్ యూనియన్ సైతం రష్యా నుంచి దిగుమతయ్యే సహజ వాయువుపై నిషేధం విధించింది. ఈ పరిణామాలపై స్పందించిన రష్యా, ఇటువంటి చర్యలు ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయం కలిగిస్తాయని, చర్చల ప్రక్రియను మరింత క్లిష్టతరం చేస్తాయని హెచ్చరించింది. కాగా, గత శుక్రవారం వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమైన జెలెన్‌స్కీ, రష్యా భూభాగంలోకి చొచ్చుకెళ్లి దాడులు చేసేందుకు వీలుగా సుదూర లక్ష్యాలను ఛేదించే టోమాహాక్ క్షిపణులను అందించాలని కోరగా, ట్రంప్ నిరాకరించారు. అయితే, ఆంక్షల విషయంలో మాదిరిగానే భవిష్యత్తులో క్షిపణులపై కూడా ట్రంప్ తన మనసు మార్చుకోవచ్చని జెలెన్‌స్కీ సూచనప్రాయంగా తెలిపారు. మరోవైపు, ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

## మహాకూటమి పోస్టర్ల నుంచి రాహుల్ గాంధీ మాయం!

బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష మహాకూటమిలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కూటమి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ పోస్టర్ల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటో మాయమవడం రాజకీయంగా కలకలం రేపుతోంది. పాట్నాలోని మౌర్య హోటల్‌లో నేడు జరగనున్న ఈ మీడియా సమావేశం పోస్టర్‌లో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఫొటోను ప్రముఖంగా ప్రదర్శించారు. మిగతా భాగస్వామ్య పక్షాల నేతల చిన్న ఫొటోలు ఉన్నా, రాహుల్ గాంధీ ఫొటో మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఈ పరిణామంపై బీజేపీ వెంటనే విమర్శలు ఎక్కుపెట్టింది. "నిన్నటి వరకు రాహుల్ గాంధీయే కూటమి ముఖచిత్రం అన్నారు. కానీ ఇప్పుడు చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం గౌరవం లేదని స్పష్టమవుతోంది. ఈ కూటమికి ఒక లక్ష్యం గానీ, ఒక దార్శనికత గానీ లేవు. గందరగోళం, విభజన, పదవుల కోసం ఆశ తప్ప ఏమీ లేదు. ఇంకా అభ్యర్థులనే ఖరారు చేయలేని పరిస్థితిలో ఉన్నారు" అని బీజేపీ నేత షెహజాద్ పూనావాలా ఎద్దేవా చేశారు. మరో బీజేపీ నేత ప్రదీప్ భండారి స్పందిస్తూ "తేజస్వి యాదవ్, ఆయన మద్దతుదారులు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అవమానించారు. మహాకూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య మహాభారతం కొనసాగుతోంది" అని ఆరోపించారు. మరోవైపు, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను ప్రకటించేందుకు కూటమిలోని అన్ని పార్టీలు అంగీకరించినట్లు ఆర్జేడీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. "చలో బీహార్, బద్లేం బీహార్" (పదండి బీహార్, మారుద్దాం బీహార్) అనే నినాదంతో ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. కేంద్రం, బీహార్ ప్రభుత్వాలు మహిళలకు రూ. 10,000 నగదు బదిలీ పథకాలను ప్రకటించడంతో, వాటి ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ 'కులం కార్డు'ను ప్రయోగించక తప్పలేదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎన్నికలకు ముందు తేజస్విని సీఎం అభ్యర్థిగా బలంగా ప్రొజెక్ట్ చేయడం ద్వారా యాదవ (14 శాతం), ముస్లిం (18 శాతం) ఓట్లను పూర్తిగా ఏకం చేయవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ 32 శాతం ఓటు బ్యాంకుతో ఎన్నికల బరిలో కూటమికి గట్టి పునాది పడుతుందని అంచనా వేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు నేడే చివరి రోజు అయినప్పటికీ, మహాకూటమిలో దాదాపు డజను సీట్లపై ఇంకా వివాదం కొనసాగుతోంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బుధవారం పాట్నా చేరుకున్నారు. ఆయన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్‌తో సమావేశమయ్యారు. అనంతరం, 243 సీట్లున్న అసెంబ్లీలో 5-10 స్థానాల్లో 'స్నేహపూర్వక పోటీ' ఉండటం పెద్ద సమస్య కాదని గెహ్లాట్ వ్యాఖ్యానించారు.

## బంగాళాఖాతంలో ఇప్పటికే ఒక అల్పపీడనం... మరో అల్పపీడనం

ఆంధ్రప్రదేశ్‌పై అల్పపీడనాల ప్రభావం కొనసాగుతోంది. బంగాళాఖాతంలో ఒక అల్పపీడనం ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండగా, రేపు మరో కొత్త అల్పపీడనం ఏర్పడనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ రెండు వాతావరణ వ్యవస్థల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రస్తుతం ఉత్తర తమిళనాడు, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న అల్పపీడనం క్రమంగా బలహీనపడుతోంది. ఇది రానున్న 24 గంటల్లో దక్షిణ అంతర్గత కర్ణాటక వైపు కదులుతూ మరింత బలహీనపడనుంది. అయినప్పటికీ, దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వివరించారు. తీరం వెంబడి గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలకు దూరంగా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా, బంగాళాఖాతంలో మరో వాతావరణ మార్పు చోటుచేసుకోనుంది. దక్షిణ అండమాన్ సముద్రం, దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని కారణంగా శుక్రవారం (రేపు) ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కొత్తగా మరో అల్పపీడనం ఏర్పడనుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది ఏర్పడిన తర్వాత 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడే అవకాశం ఉందని అంచనా వేసింది.

# దీపావళి సందర్భంగా కవితక్కను కలిసిన జాగృతి నాయకురాలు



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితని జాగృతి నాయకురాలు పడాల మనోజ గౌడ్ కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పడాల మనోజ్ గౌడ్ మాట్లాడుతూ, కవిత నాయకత్వంలో జాగృతి సంస్థ సామాజిక సేవ, సాంస్కృతిక పునరుద్ధరణ దిశగా చేస్తున్న కృషి ప్రేరణాత్మకంగా ఉంది, రాష్ట్ర యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు.

# మానవత్వం చాటుకున్న ఆయుబ్ అన్సారి

## ఆకస్మత్తుగా ఎద్దు చనిపోతే తక్షణమే 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన అయ్యూబ్ అన్సారీ





**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కోట్ పల్లి మండల పర్దీప్ లోని కరీంపూర్ గ్రామ రైతు కావలి మొగులయ్య ఎద్దు ఆకస్మత్తుగ చనిపోతే తక్షణమే 50 వేల రూపాయల ఆర్థిక సహాయం ఆయుబ్ అన్సారీ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయుబ్ అన్సారి మాట్లాడుతూ, గ్రామ రైతులకు ఎల్లప్పుడు కష్ట సమయాల్లో ముందుండి ఆదుకుంట్నాని అన్నారు. కరీంపూర్ గ్రామ ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నానని, కరీం పూర్ గ్రామ ప్రజలందరూ తమ కుటుంబీకులని అన్నారు. భవిష్యత్తులో ఎవ్వరికి ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఈ కార్యక్రమములో గ్రామ కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ మహెబూబ్, కాంగ్రేస్ యువ నాయకులు పట్నం యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి రక్తసిక్తమైన బీజాపూర్ జాతీయ రహదారి

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృత్యువాత







**అక్షర విజేత, చేవెళ్ల :** హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి మరోసారి రక్తసిక్తమైంది. ప్రతినిత్యం ఈ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులవుతున్నారు. అయినా రోడ్డు విస్తరణ చేయడం లేదు. ఈ రోజు తెల్లవారు జామున హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ స్టేజి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. వికారాబాద్ జిల్లా యాలాల మండలం పగిడాల గ్రామానికి చెందిన సల్మాన్(25) వడ్ల రవి(26) పరిగి లో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువులను పరమార్శించి తిరిగి స్కూటీపై హైదరాబాద్ కు వెళ్తున్నారు. మార్గమధ్యలో చేవెళ్ల మండలం మల్కాపూర్ స్టేజి వద్ద గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్త గాయాలైన సల్మాన్, వడ్ల రవి అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ఒకరు డ్రైవర్ గా మరొకరు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. ఈ మేరకు ప్రస్తుతానికి కేసు దర్యాప్తులో ఉందని సీఐ శ్రీధర్ భూపాల్ తెలిపారు.

# కంటోన్మెంట్‌లో పాలాభిషేకాల హడావిడి పై బీఆర్ఎస్ నేత విమర్శలు



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** కంటోన్మెంట్ లో పాలాభిషేకలా సందడి నడుస్తోందని బీఆర్ఎస్ నేత రెండో వార్డు నాయకుడు టీఎన్ శ్రీనివాస్ ఏద్దేవ చేశారు. గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏలివేటర్ క్యారిడర్ రావడానికి కారణం బీఆర్ఎస్, కేటీఆర్ అని స్పష్టం చేశారు. 24 ఎకరాల కంటోన్మెంట్ భూమి బాధలాయింపు తో వచ్చిన నిధులు తప్పా ప్రత్యేక నిధులు ఎవరు తీసుకు వచ్చారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణం కోసం స్పెషల్ ఫండ్ కేటాయించి నిర్మాణం చేశారని గుర్తు చేశారు. 303 కోట్ల నిధులు పై సంబరాలు చేసుకోవడం సరికాదని చురకలు పెట్టారు.

# దీపావళి తరువాత పెరుగుతున్న వాయు కాలుష్యం ఊపిరాడని మహానగరాలు

(సి.హెచ్.ప్రతాప్)



దీపావళి పండుగ, వెలుగుల, సంతోషాల పండుగ. కానీ, ఈ వేడుక ముగిసిన వెంటనే, మన నగరాలు, ముఖ్యంగా మహానగరాలు, దట్టమైన వాయు కాలుష్యపు పొరల్లో చిక్కుకుపోతున్నాయి. పటాకుల పొగ, చలికాలపు వాతావరణం కలగలిసి, గాలి నాణ్యతను ప్రమాదకర స్థాయికి దిగజారుస్తున్నాయి. ఈ పరిణామం కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు, కోట్లాది మంది ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పుగా పరిణమించింది. వాయు కాలుష్యం పెరగడానికి ప్రధాన కారణాలను పరిశీలిస్తే, పండుగ ప్రభావం తక్షణ, తీవ్రమైన కారణంగా కనిపిస్తుంది. పండుగ రోజున, రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున కాల్చే బాణసంచా మరియు పటాకులు గాలిలోకి టన్నుల కొద్దీ విషపూరితమైన రసాయన, ఘన కణాలను విడుదల చేస్తాయి. ఈ కణాలలో సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, కార్బన్ మోనాక్సైడ్, సీసం, రాగి వంటి ప్రమాదకర లోహాలు ఉంటాయి. వీటిలో ముఖ్యంగా పి ఎం 2.5 మరియు పి ఎం 10 కణాలు అత్యంత ప్రమాదకరమైనవి, ఇవి ఊపిరితిత్తుల లోపలికి చొచ్చుకుపోతాయి. ఈ పండుగ కాలుష్యానికి శీతాకాలపు వాతావరణ మార్పులు తోడవుతాయి. చలికాలం ప్రారంభంలో, గాలి వేగం తగ్గుతుంది మరియు ఉష్ణోగ్రత విలోమం అనే వాతావరణ పరిస్థితి ఏర్పడుతుంది. అంటే, చల్లని గాలి భూమికి దగ్గరగా ఉండి, వేడి గాలి పైన ఉంటుంది. దీనివల్ల పొగ, కాలుష్య కణాలు పైకి పోకుండా, భూమికి దగ్గరగా ఉన్న గాలి పొరలోనే చిక్కుకుపోతాయి. ఈ కారణంగా, దీపావళి మరుసటి రోజు ఉదయం నగరమంతా దట్టమైన పొగ మంచు అలుముకుంటుంది. ఈ పరిస్థితి యొక్క తీవ్రతను గణాంకాల ద్వారా గమనించవచ్చు. సాధారణంగా దీపావళి ముందు రోజున ఢిల్లీ, ముంబై, కోల్‌కతా వంటి ప్రధాన నగరాల్లో 150-200 మధ్య ఉండే గాలి నాణ్యత సూచీ పండుగ మరుసటి రోజు 350-450 స్థాయికి చేరుకుంటుంది. ఉదాహరణకు, ఈ దీపావళి తర్వాత ఢిల్లీ, గురుగ్రామ్ వంటి నగరాల్లో ఆ%ు%ఈ విలువ 450 కంటే ఎక్కువగా నమోదైంది, ఇది తీవ్ర ప్రమాదకర స్థాయి ని సూచిస్తుంది. ఈ స్థాయిలో గాలి నాణ్యత ఉండటం వలన, ఆరోగ్యవంతమైన వ్యక్తులు కూడా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ తీవ్రమైన వాయు కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు , గుండె జబ్బులు ఉన్నవారికి ఇది ప్రాణాంతకం కావచ్చు. విషపూరిత పొగ పీల్చడం వలన కళ్లు మండటం, ముక్కు, గొంతులో దురద, తలనొప్పి వంటి తక్షణ సమస్యలు వస్తాయి. పి ఎం 2.5 కణాలు రక్తంలో కలిసిపోయి, శ్వాసకోశ సమస్యలు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తాయి. పిల్లలు, వృద్ధులు, మరియు గర్భిణీ స్త్రీలు మరింత ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. ఈ విపత్తు నుండి ఉపశమనం పొందాలంటే సమష్టిగా, నిర్మాణాత్మకంగా పరిష్కార మార్గాలు అన్వేషించాలి. కాలుష్యాన్ని అరికట్టేందుకు, పండుగల సమయంలో మాత్రమే కాకుండా, సాధారణ రోజుల్లో కూడా కొన్ని కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం దీపావళి పండుగకు మాత్రమే కాకుండా, ఇతర సందర్భాలలో కూడా (వివాహాలు, రాలీలు,ఇతర ఉత్సవాలు) పటాకులను కాల్చడాన్ని తప్పనిసరిగా నిషేధించాలి లేదా కఠినంగా నియంత్రించాలి. ముఖ్యంగా, దీపావళికి హరిత పటాకులను మాత్రమే వాడటాన్ని తప్పనిసరి చేయాలి. ఈ హరిత పటాకులను తయారీని, విక్రయాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించడానికి విస్తృత ప్రచారం చేయాలి. వ్యవసాయ వ్యర్థాలను కాల్చడాన్ని పూర్తిగా అరికట్టడానికి రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు, ప్రోత్సాహకాలను అందించాలి. పండుగ తర్వాత, ప్రజలు సాధ్యమైనంత వరకు బయటకు వెళ్లడం తగ్గించాలి, ఇంట్లో ఎయిర్ ప్యూరిఫైయర్‌లను వాడాలి మరియు తప్పనిసరి అయితే ఎన్95 మాస్క్‌లను ధరించాలి. వాయు కాలుష్యం ఒక సామాజిక, ఆరోగ్య అత్యవసర పరిస్థితి. కేవలం ప్రభుత్వ చర్యల ద్వారానే కాకుండా, ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే, ఈ ఆరోగ్యానికి పెనుశాపం బారి నుండి మనం మన భావి తరాలను రక్షించుకోగలం. వెలుగుల పండుగ మన జీవితాల్లో చీకటిని నింపకూడదంటే, మనం పర్యావరణం పట్ల, తోటి మనుషుల ఆరోగ్యం పట్ల మరింత జవాబుదారీగా ఉండాలి.

# మా సహనాన్ని పిరికితనంగా భావిస్తే ఖబడ్దార్



బండి సంజయ్ హెచ్చరిక



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** హిందువుల సహనానికి కూడా హద్దు ఉందని, ఆ సహనాన్ని పిరికితనంగా భావించే వారు ఖబడ్దార్‌గా ఉండాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. మేడ్చల్ జిల్లా పోచారం కాల్పుల ఘటన నేపథ్యంలో ఆయన ప్రభుత్వం, పోలీసులు, ముఖ్యంగా గోవధ చట్టం అమలుపై మండిపడ్డారు.మా దైవాన్ని, మా ధర్మాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తుంటే గోవులను వధించేవారు మంచివారిగా, గోరక్షకుడిపై మాత్రం దుష్ప్రచారం చేయడం ఎంత న్యాయం? అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం ప్రభుత్వమే పోలీసులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. పోచారం కాల్పుల కేసులో పోలీసులు చెప్పింది అబద్ధమే, గోవధ చట్టాన్ని అమలు చేయడంలో విఫలమవుతూ, ఆ పని చేసిన సోనూసింగ్‌పై అభాండాలు మోపడం దుర్మార్గమని అన్నారు. గతంలో యాగాలకు ముందు గోవులకు పూజ చేసిన కేసీఆర్ గోవధ చట్టాన్ని మాత్రం అమలు చేయలేదని విమర్శించారు. అందుకే కేసీఆర్‌కు పాపం తగిలి ఫామ్ హౌస్‌లో పడ్డాడు. ఇప్పుడు అదే బాటలో నడుస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇంకా హీనమైన గతి వస్తుందని ఘాటుగా వ్యాఖ్యానించారు. సోనూసింగ్‌ను సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రిలో రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్, బీజేపీ ఉప నాయకుడు పాయల శంకర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. సోనూసింగ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అతని వైద్య ఖర్చును పార్టీ భరిస్తుందని, అన్ని విధాలా అండగా ఉంటామని బండి సంజయ్ తెలిపారు.

**ఎంఐఎం నేత చేతిలో రివాల్వర్ ఎలా చేరింది?**

గోవులను రక్షించేందుకు ప్రయత్నించిన ప్రశాంత్ సింగ్‌పై కాల్పులు జరిపిన ఎంఐఎం నేత ఇబ్రహీం చేతిలో రివాల్వర్ ఎలా చేరిందో తక్షణమే దర్యాప్తు జరపాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. గోవధ చట్టాన్ని అమలు చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని, చట్టం అమలు చేయాల్సిన వారు గోరక్షకులపై తప్పుడు ఆరోపణలు మోపడం దారుణమని విమర్శించారు. డీజీపీ వెంటనే క్షమాపణ చెప్పి, చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని బండి సంజయ్ కోరారు. గోవులను చట్టానికి విరుద్ధంగా కబేళాలకు తరలిస్తున్నారని, వాటిని రక్షించేందుకు ధర్మపరమైన కర్తవ్యంగా పనిచేస్తున్న సోనూసింగ్‌పై ఎంఐఎం గూండాలు కాల్పులు జరపడం అత్యంత ఖండనీయమని అన్నారు. గతంలో కూడా గోరక్షకులపై దాడులు జరిగినా, ప్రభుత్వం మరియు పోలీసులు మౌనం వహించడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని బండి సంజయ్ విమర్శించారు. చట్ట పరిధిలో ఉండి గోమాతలను రక్షిస్తున్న భజరంగ్ దళ్ కార్యకర్తలపై దాడులు చేయడం నేరం మాత్రమే కాదు, హిందూ ధర్మంపై దాడని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు.

# 2026 ఖరీఫ్ నాటికి సారునీరు అందేలా సీతారామ పాలేరు కెనాల్ పనులు పూర్తి చేయాలి











## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.

## సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు 16వ ప్యాకేజీ పాలేరు లింకు కెనాల్ టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్.

**అక్షర విజేత ఖమ్మం:-** 2026 ఖరీఫ్ సీజన్ నాటికి సారునీరు అందించే విధంగా ప్రణాళికతో సీతారామ పాలేరు కెనాల్ టన్నెల్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, దమ్మాయిగూడెం లలో జరుగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు 16వ ప్యాకేజీ లోని పాలేరు లింకు కెనాల్ టన్నెల్ పనులను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ**

2026 ఖరీఫ్ నాటికి గోదావరి, మున్నేరు జలాలను మన ప్రాంత రైతులు వినియోగించుకునే విధంగా చేపట్టిన ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తూ పనులు వేగవంతంగా అయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 8.2 కిలోమీటర్ల సొరంగం తవ్వకం పనులకు గాను ప్రతిరోజు 24 మీటర్ల మేర పనులు చేపట్టి ఇప్పటి వరకు నాలుగు కిలోమీటర్ల పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన టన్నెల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా పోచారం వద్ద పెండింగ్ ఉన్న భూ సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్ఇ యం.వెంకటేశ్వర్లు, డిఇ రమేష్రెడ్డి,తిరుమలాయపాలెం మండల తహసీల్దారు విల్సన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పలు శుభకార్యాలలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్









**అక్షర విజేత కామేపల్లి :** పవిత్ర కార్తీకమాసంలోవివాహాది శుభకార్యక్రమాలుప్రారంభమయ్యాయి. కామేపల్లిమండలంగోవిందరాల బంజర గ్రామానికి చెందిన ఆడెపు బిక్షపతి - నాగమణి దంపతుల కూతురు పుష్పాలంకరణ వేడుకతో పాటు కుమారుడు పంచ కట్టు ఫంక్షన్ మరియు కామేపల్లికి చెందిన షేక్ పాషా - రెహనా దంపతుల కూతురు చి. రిమిష మరియు కుమారుడుచి. యాసిన్ ల హాఖీక వేడుక మరియు ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడు గ్రామానికి చెందిన గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు కుర్రి లింగయ్య -ఉప్పమ్మ ల మనవరాలు చి. లోహితకు పుష్పాలంకరణ వేడుక మరియు మనవడు చి. మనోజ్ కు పంచ కట్టు వేడుక మరియు గార్ల మండలం బుద్ధారం గ్రామానికి చెందిన భయ్య భరత్ -సరిత దంపతులకూతురు చి. త్రిదర ఓణీల ఫంక్షన్ మరియుకుమారుడు చి. భాను ప్రకాష్ యాదవ్ పంచ కట్టు వేడుక ల కార్యక్రమాలు స్థానిక ఫంక్షన్ హాల్స్ గురువారం నాడు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్ పాల్గొని చిరంజీవు లను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ వేడుక సందర్భంగాకొంతమందియాదవులు గొర్రెల పెంపకందారులసమస్యలను ప్రస్తావించగాత్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో రాజకీయాలు వర్గాలకు అతీతంగా యాదవులు పోటీ చేసిన చోట తప్పకుండా యాదవులువేసిగెలిపించుకోవాలని, తదనంతరం యాదవుల సమస్యలపై మన ఖమ్మం జిల్లా మంత్రివర్యులు ద్వారా రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసే అవకాశం ఉందని, పాడి పశువుల లాగా ప్రతి గొర్రెకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల పెంపకం దారులకు నేత కార్మికులకు గీత కార్మికులకు మత్స్యకార్మికులకు ఇస్తున్న విధంగా ఎక్స్ గ్రేషియా మంజూరు చేయాలని,మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా గొర్రెల పెంపకం దారులకు రెండు లక్షలరూపాయలు మంజూరు చేయాలని, ఎన్సిడిసి స్కీమును పునరుద్ధరించాలని తదితరయాదవుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరగనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతోటి అచ్చయ్య ముత్తబోయిన రామ్మూర్తి, మాజీ ఎంపీటీసీ సునీత లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు కవిరాజు మైనార్టీ అధ్యక్షులు ఇమామ్, మంద రాములు బాబు సింగ్, బిచ్చు, నరేష్ వెంకట్ రాములు, షేక్ సైదాబీ, జిక్కుల అప్పారావు, పాటిబండ్ల ప్రసాదు, కేశగాని శ్రీను, పాపయ్య జల్లి రాములు, మంచాల వెంకన్న రామదాసు, నరసింహారావు అర్జున్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# గోమాత రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు అవసరం

**బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.**

**గోరక్షకులపై దాడులకు నిరసనగా కలెక్టర్‌కు వినతి.**

**అక్షర విజేత ఖమ్మం:-** గోమాత సంరక్షణ కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైనచర్యలుతీసుకోవాలని, గోరక్షకులపై జరుగుతున్న దాడుల విషయంలో చట్టపరమైన చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడ్చెల్ జిల్లా ఘట్కేసర్ వద్ద గో రక్షకుడు సోను (ప్రశాంత్)పై ఎంఐఎం గుండాలు తుపాకీ కాల్పులు జరిపిన ఘటనకు వ్యతిరేకంగా గోరక్షకులపై జరిగిన దాడికి నిరసనగా గురువారం ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ గోమాత మన సాంప్రదాయానికి, జీవన విధానానికి ప్రతీక అని పేర్కొన్నారు. గోరక్షకులు సమాజ సేవలో నిమగ్నమై ఉంటే, వారిపై జరుగుతున్న దాడులు గో సంస్కృతిని దెబ్బతీసే విధంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రభుత్వం తక్షణమే స్పందించి, గోరక్షకుల భద్రతకు చట్ట పరిరక్షణ కల్పించాలి. గోరక్షకులపై దాడులు తక్షణమే ఆగాలి," అని ఆయన డిమాండ్ చేశారు. గోవుల అక్రమ రవాణా, హత్యలు, వ్యాపారాలు సమాజంలో శాంతి-వ్యవస్థకు ముప్పుగా మారుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో, జిల్లా స్థాయిలో తక్షణమే గో సంరక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని, గోరక్షకుల భద్రతపై ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా పరిధిలో ఉన్న రవాణా మార్గాలు, మార్కెట్లపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, చట్టాలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనివిజ్ఞప్తిచేశారు. అదేవిధంగా గోశాలల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా గోశాలలకు మేత, నీరు, వైద్య సేవలు వంటి ప్రాథమిక సదుపాయాలను తప్పనిసరిగా అందించాలని కోరారు. "గోమాతను రక్షించడం కేవలం ధార్మిక బాధ్యత కాదు, అది మన సంస్కృతీ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సామాజిక కర్తవ్యం. కాబట్టి, ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి," అని ఆయన స్పష్టం చేశారు. ఐతే దాడుల సంఘటనలపై పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు వైద్య సహాయం, రక్షణ ఇవ్వాలని కూడా



బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ నేతల వినతిని స్వీకరించిన జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, గో సంరక్షణకు సంబంధించిన అంశాలను సమీక్షించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లగట్టు ప్రవీణ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు బండారు నరేష్, నున్న రవికుమార్, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావుతదితరులుపాల్గొన్నారు.

# టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే రోహిత్ రావు







**అక్షర విజేత మెదక్ :** మెదక్ జిల్లాలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ టీఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఎస్ వెలుగు పాఠశాలలో గురువారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆకస్మికంగా పర్యటించారు. పాఠశాల విద్యార్థుల అభ్యాస స్థాయి,వసతి సౌకర్యాలు, భోజన వసతులు,పరిశుభ్రత వంటి అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్య, శిక్షణ,భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈసందర్భంగా మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు పాఠశాల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థుల అభ్యాసంలో మరింత నాణ్యతను తీసుకురావడానికి టీచర్లు, వార్డెన్లు కలసి పని చేయాలని సూచించారు. విద్యార్థుల మానసిక అభివృద్ధికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా సమాన ప్రాధాన్యంతో నిర్వహించాలన్నారు. ఆయన మాట్లాడుతూ " పిల్లలు సమాజంలో ఉన్నత స్థానాలు సంపాదించాలంటే పాఠశాల వాతావరణం ప్రేరణాత్మకంగా ఉండాలి. విద్యార్థుల్లో మార్పు రావాలంటే మొదట ఉపాధ్యాయులలో మార్పు రావాలి. అందరూ నిబద్ధతతో, బాధ్యతతో పనిచేయాలి" అని అన్నారు. ఎమ్మెల్యే రోహిత్ రావు విద్యార్థుల డిసిప్లిన్, క్లాస్‌రూమ్ శుభ్రత, మెనూ క్వాలిటీ,హాస్టల్ సౌకర్యాలను కూడా తనిఖీ చేశారు. విద్యార్థుల అభిప్రాయాలను నేరుగా విన్న ఆయన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై పాఠశాల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి అధికారులు తరచుగా పర్యటించాలని,విద్యార్థుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. పాఠశాల ప్రగతికి తల్లిదండ్రులు, సిబ్బంది, అధికారులు కలిసి సహకరించాలన్నారు. ఎమ్మెల్యే రోహిత్ రావు పర్యటనతో విద్యార్థులు ఉత్సాహంతో మునిగిపోయారు. ఎమ్మెల్యే స్వయంగా తమతో మాట్లాడటం,వారి అభ్యాసంపై ఆసక్తి చూపించడం వారికి ప్రేరణనిచ్చింది. పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది, అధికారులు ఈసందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ నిరంతర అభివృద్ధి

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ వెల్లడి**

**నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్**





**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ఆర్థిక ఇబ్బందులు నెలకొని ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం వాటిని అధిగమిస్తూ ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి పనులను నిరంతర ప్రక్రియగా చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసన మండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని వివిధ డివిజన్లలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తదితరులతో కలిసి అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేశారు. గౌతమ్ నగర్ లో రూ. 3.46 కోట్ల వ్యయంతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్, సీసీ డ్రైన్స్, ఆర్.సీ.సీ స్లాబ్ కల్వర్ట్ ల నిర్మాణాలకు, ఎల్లమ్మగుట్ట అమ్మ వెంచర్ లో రూ. కోటి 19 లక్షల చేపట్టనున్న సీసీ రోడ్లు, బిటీ రోడ్ల నిర్మాణ పనులకు, న్యాల్ కల్ రోడ్డులో రూ. 3.43 కోట్ల రూపాయలతో వరద నీటి కాలువలు, బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, మాలపల్లిలో రూ. 37 లక్షలతో ఉర్దూ మీడియం కళాశాల మరమ్మతు పనులకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తూ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా విస్తరణ వంటి అభివృద్ధి పనులను చేయిస్తున్నామని అన్నారు. జిల్లాను పారిశ్రామికంగా, వ్యవసాయం, విద్యా, వైద్య రంగాలలో అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కలిసికట్టుగా కృషి చేస్తున్నామని తెలిపారు. నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని గుర్తు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, ప్రజల అవసరాలను గుర్తిస్తూ తమ ప్రభుత్వం అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. నిజామాబాద్ నగరంలో మంజూరైన పనులే ఇందుకు నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమాలలో నుడా చైర్మన్ కేశవేణు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**సుప్రీంకోర్టు సిజెఐ జస్టిస్ గవాయ్ పైన జరిగిన దాడి చేసిన నిందితున్ని శిక్షించాలి.**

**కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా కమిటీ సెమినార్.**





**అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-** బీసీ రిజర్వేషన్స్ 42 శాతం ఇవ్వాలని, రాజ్యాంగంలో 9వ షెడ్యూల్ సవరణ చేయాలని, సుప్రీంకోర్టు సిజెఐ జస్టిస్ గవాయ్ పైన జరిగిన దాడి నిరసిస్తూ కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా కమిటీ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్ కు కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కరత్ అధ్యక్షత వహించారు. వక్త గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి.చంద్రకుమార్ పాల్గొని మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కవాయిపై జరిగిన దాడి భారత రాజ్యాంగం, భారత పార్లమెంటు, మొత్తం భారతదేశ%శీ% పైనే దాడిగా దేశ ప్రజానీకా%శీ% పౌర సమాజానికి హితో చెప్పారు. దాడీ వెనకాల ఎలాంటి శక్తులు ఉన్న వెనకడుగు వేయకుండా నిందితుల్ని కఠినంగా శిక్షిస్తేనే భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉంటాయని డిమాండ్ చేశారు. హక్కుల కోసం ఐక్యంగా నిలబడలని, నిందితున్ని శిక్షించే దాకా పోరాడలని పిలుపు నిచ్చారు. చెప్పుతో దాడి చేసిన సనాతన సన్నాసిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సెమినార్ ద్వారా చెప్పారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో, ఆధునిక టెక్నాలజీ కాలంలో ప్రపంచం డెవలప్మెంట్ అవుతుంటే, సనాతన ధర్మం ప్రకారం అగ్రకుల మేధావులు, సాక్షాత్తు సుప్రీంకోర్టు అడ్వకేట్ దాడి చేస్తే సరియైనదే అని చెప్పుకోవాలా, అనే ప్రశ్న దేశవంతటా, ప్రపంచమంత ప్రశ్నగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్స్ ఇవ్వాలని 9వ షెడ్యూల్ రాజ్యాంగ సవరణ చేసి వెనుకబడ్డ బీసీ ఉపకులాల అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా కమిషన్ వేసి న్యాయం చేయాలని కాడిగళ్ల భాస్కర్ కెవిపిఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు అన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మెజార్టీ ఉపకులాలైన బీసీలు విద్యకు వైద్యానికి ఉద్యోగాలకు ఉపాధి అవకాశాలకు చాలా దూరంగా ఉన్నారని నేటికీ రేషన్ కార్డు, ఇల్లు వాకిలి లేకుండా సంచార జీవులుగా ఉంటూ కనీసం ఆధార్ కార్డు లేని కుటుంబాలుగా ఉన్నాయన్నారు. ఈ దేశంలో ఎస్సీల జనాభా తగ్గట్టుగా 15 శాతం, ఎస్టీల జనాభా తగినట్టుగా 10శాతం, దేశంలో ఐదు శాతం లేని అగ్రకులాలు 10 శాతం రిజర్వేషన్లు తీసుకుంటే, ఈ దేశ మూలవాసులు సామాజిక, ఆర్థిక, రాజకీయ దోపిడికి గురవుతూ దుర్భర జీవితాలు గడుపుతున్న బీసీలకు వారి జనాభా తగినట్టు రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బీసీలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ.సామేల్, ఎం.ప్రకాష్ కారత్, కె.అరుణ్ కుమార్ అడ్వకేట్, పి.జగన్, ఆలేటి ఆటం, ఎ.వెంకటేష్, ఎన్.పురుషోత్తం, యం.ఆనంద్, ఏ.వీరేశం, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు ఏ.తరంగ్, బోడ.వంశీ, నరసింహ, లెక్చరర్స్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఏవైఎస్ మండల అధ్యక్షుడు రాజేందర్ ఎంపిక

**స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్**



**అక్షర విజేత, గణపురం :** గణపురంమండల కేంద్రానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకుఎంపికైనట్లు స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవోస్ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు. గణపురం మండల అంబేద్కర్ యువజన సంఘం లో మండల అధ్యక్షులుగా శనిగరపు రాజేందర్ గత 10 సంవత్సరాలుగా భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు సిద్ధాంతాలు ఆశలను కొనసాగిస్తూ, కార్యక్రమాలను చేయడమే కాకుండా మృతుల కుటుంబాలకు సహాయ సహకారాలు అందించుతూ దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అవమానాలను, మహిళలపై జరిగే హత్యలు, అత్యాచారాలపై ఖండిస్తూ వారికి అండగా నిలబడ్డారని అన్నారు. వారు చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందించడం జరిగిందని డాక్టర్ రమేష్ చెప్పారు. అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైన శనిగరపు రాజేందర్ కు నవంబర్ 5న సిటీ కల్చరల్ సెంటర్ ఆడిటోరియం ఆర్టీసీ క్రాస్ రోడ్ ముషీరాబాద్ హైదరాబాదులోఈ అవార్డు అందించడం జరుగుతుందని డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు. అంబేద్కర్ నేషనల్ అవార్డును ఎంపిక చేసిన వారికిసహకరించిన వారికి రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

# రామాలయంలోకార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం

**ఆకాశదీపం ప్రారంభించిన ఆలయ కమిటీ**



**అక్షర విజేత,గణపురం :** గణపురం మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో కార్తీకమాసంలో భాగంగా మొదటి రోజు ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పూజా కార్యక్రమంలో భాగంగా బుధవారం గణపురం మండల కేంద్రానికి చెందిన మచ్చిక కోమల శంకర్ గౌడ్



కుమారులు ఆలయ అభివృద్ధికి 10.016 రూపాయలను ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కి అందజేయడం జరిగింది. అదేవిధంగా ఆలయంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆకాశదీపోత్సవం ప్రారంభించడం జరిగింది ఈ పూజా కార్యక్రమంలో కట్కూరి సరోజన రాజయ్య దంపతులు వారి కుమారులు కట్కూరి దీప్తి అన్వేష్ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజానంతరం వారు కార్తీక మాస నెల రోజులు పాటు ఆలయంలో ఆకాశ దీపానికి గాను నూనెను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, గోరంట్ల రాజయ్య, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి,బూర రాజగోపాల్, మోటపోతుల రాజన్న గౌడ్,పాండవుల భద్రయ్య, దయ్యాల భద్రయ్య, ఉయ్యాల బిక్షపతి పాల్గొన్నారు.

# ఎల్ వో సి పత్రాలు అందచేసిన తుమ్మల యుగంధర్



**అక్షర విజేత ఖమ్మం:-** ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన 46 వ డివిజన్ కు చెందిన గోనెల వీరమ్మ ఆరోగ్య పరిస్థితి నీ గమనించిన 46 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాణాల లక్ష్మణ్, ఆమె యొక్క ఆరోగ్య పరిస్థితి ని యువ నాయకుడు తుమ్మల యుగంధర్ దృష్టికి తీసుకు రాగా వెంటనే స్పందించిన యుగంధర్ స్వయంగా ఆయన ఒక డాక్టర్ కావటం మూలంగా ఆమె యొక్క ఆరోగ్య పరిస్థితి తీవ్రతను అంచనా వేసి కేవలం మూడు రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం నుండి 1,,25,000/రు లక్ష పాతిక వేల రూపాయలు మంజూరు చేయించి ఆ యొక్క ఎల్ వో సి పత్రాన్ని లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందచేసయడం జరిగింది. గతం లో కూడా మా 46 వ డివిజన్ పరిధిలో అనేక మందికి అత్యవసర పరిస్థితులలో లక్షల రూపాయల వ్యయంతో అందించే వైద్య సేవల పత్రాలను తుమ్మల యుగంధర్ అందచేసివారిప్రాణాలనుకాపాడటంజరిగిందని, వారు నిండు నూరేళ్ళు చల్లగా వర్ధిల్లాలని డివిజన్ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# ఘనంగా డాక్టర్ సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు





**అక్షర విజేత సూర్యాపేట ప్రతినిధి :** ప్రముఖ వైద్యులు, జ్యోతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత, జనరల్ సర్జన్ బిజ్జ సునీల్ కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం గుగులోతు లింగా నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట రూరల్ కాసరబాద రోడ్డులోని అపూర్వ బదిరుల పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జ్యోతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు పండు పంపిణీ చేసి, శ్రీ సాయి బ్లడ్ బ్యాంకులో లింగా నాయక్, సురేష్, వినోద్, వినయ్, నాగరాజు, హరీష్, ఉపేందర్, శంకర్ తో పాటు పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లింగా నాయక్ మాట్లాడుతూ డాక్టర్ సునీల్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాటోత్ సురేష్, జాటోతు భాను, జాటోతు నరసింహ, చింటూ, వినోద్ కుమార్, అశోక్, నవీన్, ధరావత్ వినయ్, నాగరాజు, మనోహర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయి మీద జరిగిన దాడిని నిరసిస్తూ



**అక్షర విజేత సూర్యాపేట ప్రతినిధి :** హైదరాబాద్ దళితుల ఆత్మగౌరవ మహా ప్రదర్శన విజయవంతం చేయండి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ ఆత్మగౌరవ అస్తిత్వ పోరాటాల యోధుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపుమేరక స్థానిక సూర్యాపేట జిల్లా కేంద్రం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవనం జమ్మిగడ్డ సూర్యపేటలి నందు సూర్యాపేట నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశ జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి సూర్యపేట జిల్లా ఇన్చార్జి బక్షలకూరి వెంకటేశ్వర్లు మాదిగ మరియు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ హాజరై మాట్లాడుతూ అక్టోబర్ 7న సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ పై జరిగిన దాడిని రాజ్యాంగంపై మరియు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణిస్తూ దాడికి నిరసనగా నవంబర్ 1న హైదరాబాద్ నగరంలో లక్షలాది మందితో దళితుల ఆత్మగౌరవ మహాప్రదర్శనను మహాజననేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో తలపెట్టడం జరిగింది .ఈ ప్రదర్శనకు ప్రతి జాతీయ, రాష్ట్ర ,జిల్లా, మండల, నాయకులు తన సొంత గ్రామం నుంచి 100 మంది పైగా కార్యకర్తలను తరలించాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయి పై చెప్పు విసిరిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ ,ఎర్ర వీరస్వామి మాదిగ, పాల్వాయి బాలయ్య మాదిగ, దైద శ్రీనివాస్ మాదిగ, కళా నేత గంట బిక్షపతి మాదిగ, చెరుకుపల్లి సతీష్ మాదిగ, మేడి కృష్ణ మాదిగ, యాతాకుల లింగన్న మాదిగ, గంగాధర్ లక్ష్మీకాంత్ మాదిగ, మోహన్ మాదిగ ,మొండి కత్తి మనోజ్ కుమార్ మాదిగ ,నరాల రాజు మాదిగ, తదితరులు పాల్గొన్నారు

# తంగడపల్లిలో ఘనంగా సదర్ పండుగ వేడుకలు

**సదర్ పండుగ చూడు దున్నపోతుల ఆట చూడు**





**అక్షర విజేత, చేవెళ్ల :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ పండుగను ఘనంగా నిర్వహించారు. కావాలి మణీత్, యాదవ్ గొంగుపల్లి శ్రీపాల్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు,నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పండుగ సందర్భంగా దున్నపోతుల ఆటలు, సాంప్రదాయ పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. సదర్ పండుగ చూడు. దున్నపోతుల ఆట చూడు. అంటూ చిన్నా పెద్దా అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోంగుపల్లి శ్రీ పాల్ మాట్లాడుతూ సదర్ పండుగ మన యాదవ సమాజ ఆత్మ గౌరవానికి ప్రతీక. ఈ పండుగలో ప్రతి ఒక్కరూ ఐక్యతతో పాల్గొని ఆనందించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుష సత్తయ్య గౌడ్, షాబాద్ రాములు కావలి కృష్ణయ్య, కావలి మణీత్ గోంగుపల్లి శ్రీపాల్ యాదవ్ సాయికుమార్, రమేష్ గౌడ్, రవితేజ, కావలి కృష్ణ, షాబాద్ అనిల్, షాబాద్ కిట్టు, గొంగుపల్లి శ్రీకాంత్, గ్రామ పెద్దలు, మహిళలు, యువతతో పాటు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం



**అక్షర విజేత ఎర్రుపాలెం :** మధిర డివిజన్ పరిధిలోని ఎర్రుపాలెం మండలం వెంకటాపురం సబ్ స్టేషన్ లకు అనుసంధానంగా సోలార్ విద్యుత్తు సరఫరా చేసే క్రమంలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సోలార్ విద్యుత్ ఫ్లవర్ ప్లాంటు ఏర్పాటుకుశ్రీకారం చుట్టనున్నారు. మండల పరిధిలోని రాజుపాలెం గ్రామం రెవెన్యూ పరిధిలో ప్రస్తుతం ఉన్న వెంకటాపురం సబ్ స్టేషన్కు సమీపంలో ఏర్పాటు చేయుటకు అనువుగా ఉందని దానిలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయుటకు ఉత్పత్తి అయ్యే విద్యుత్తును సరఫరా చేసేందుకు ఏర్పాటు చేయబోయే విద్యుత్ లైన్ ను ఖమ్మం సర్కిల్ ఎస్ ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి ఆధ్వర్యంలో శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇది మహిళ స్వయం సహాయక గ్రూపులకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే విధంగా ఏర్పాటు చేసి ఎస్ జి హెచ్ గ్రూప్ నిర్మాణంలో జరుగుతుందన్నారు. ఈ ప్లాంట్ ద్వారా సౌర విద్యుత్తు ఉత్పత్తి గావించి దానిని వెంకటాపురం సబ్ స్టేషన్ కు అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ డి ఈ బండి శ్రీనివాసరావు,మధిర సబ్ డివిజన్ ఏడిఈ అనురాధ, సర్కిల్ ఆఫీస్ కమర్షియల్ ఏ డి ఈ నాగమల్లేశ్వరరావు, ట్రాన్స్ఫార్మర్ ఏఈ బోజ్యా, ఎర్రుపాలెం సెక్షన్ ఏ ఈ జి అనూష, స్థానికమండల ఎంపీడీవో బి సురేందర్,ఏపిఎం హరి నారాయణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**





**అక్షర విజేత,చిన్నంబావి. :** చిన్నంబావి మండల పరిధిలోని దగడపల్లి గ్రామంలో రైతు వేదికలో గురువారం వ్యవసాయ శాఖ అధికారి సాయి రెడ్డి ఆధ్వర్యంలో వరి కొనుగోలు శిక్షణ తరగతుల కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తెచ్చిన వరి ధాన్యం తేమ శాతం వివరాలను రిజిస్టర్లలో తప్పకుండా నమోదు చేయాలని ఖరీఫ్ 2025-26 సీజన్ లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఖరీఫ్ పంట సీజన్లో వరి కొనుగోలు ప్రక్రియ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరగాలన్న ఉద్దేశంతో వ్యవసాయ రెవెన్యూ శాఖల యంత్రాంగం ముందస్తు ఏర్పాటు చేస్తుందని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురాభి, రెవిన్యూ వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. గురువారం దగడపల్లి రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలలో వరి కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు పలు సూచనలు చేశారు. రైతులు కేంద్రాలకు వచ్చేటప్పుడు తడవుగా ఉండే పరిస్థితుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా టార్పాలిన్ షీట్లు, నీడ కోసం షెడ్లు, త్రాగునీటి సౌకర్యం గన్నీ బ్యాగులు వంటి అన్ని అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. వరి కేంద్రములో కాంటా అయిన వెంటనే మిల్లులకు తరలించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశం అని తెలిపారు. అలాగే సన్న మరియు దొడ్డు రకాల వరి ధాన్యాన్ని గుర్తించడంలో సిబ్బందికి సమీష్టమైన అవగాహన అవసరమని చెప్పారు.వరి ధాన్యాన్ని గుర్తించడంలో సిబ్బందికి సమీష్టమైన అవగాహన ఉంటేనే సన్న ఓడ్ల రైతులకు బోనస్ లు ఇవ్వడానికి అవకాశం ఉందని తెలియజేశారు. ధాన్యం కొలత గ్రేడింగ్ మిల్లు తరలింపు తదితర అంశాలలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తేనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుందిని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు సాయి రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్, పిఎసిఎస్ సీఈవోనాగరాజు, ఇంచార్జి యం పి డి ఓ రామస్వామి,కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలు, రైతులు, సమైక్య ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ప్రయోజనాల కోసమే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**డిసిసిబి డైరెక్టర్ పట్లోళ్ల అంజిరెడ్డి**




**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి :** రైతుల ప్రయోజనాల కోసమే వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుపుతున్నామని మేక వనంపల్లి పిఏసిఎస్ చైర్మన్ డిసిసిబి డైరెక్టర్ పట్లోళ్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మోమిన్ పేట మండల పరిధిలోని మేకవనం పల్లి సహకార సంఘంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహకార సంఘాల ద్వారా రైతుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలుపరుస్తున్న సహకార సంఘ సిబ్బందికి పాలకవర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతులు తాము పండించిన పంటలను దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తీసుకువచ్చి లబ్ధి పొందాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ వినయ్ కుమార్, టేకులపల్లి రాజు, బోయిని శేఖర్, సోమిరెడ్డి ,సుదర్శన్ రెడ్డి, సహకార సంఘం సీఈవో ఎండి జహంగీర్, బాలకృష్ణయ్య ,అసిస్టెంట్ యాదయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్అమరవీరుల వారోత్సవాలుపాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్

**గణపురం ఎస్ఐ రేఖ అశోక్**








**అక్షర విజేత, గణపురం :** గణపురం మండలం పోలీస్ స్టేషన్ నందు పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ప్రాథమికపాఠశాలలోనివిద్యార్థినీ,విద్యార్థులకు ఓపెన్ హౌస్ గణపురం ఎస్సై రేఖ అశోక్ ఆధ్వర్యంలోనిర్వహించడం జరిగింది.ఇందులో ప్రధానంగా పిటిషన్ మేనేజ్మెంట్ గురించి, ఎఫ్ ఐఆర్ రిజిస్ట్రేషన్,డయల్ 100, డ్రగ్స్ నిర్మూలన, సైబర్ క్రైమ్ ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా పోలీస్ స్టేషన్ నందు ఉన్న సెట్ ఏ విధంగా పని చేస్తుంది అని విద్యార్థినీ విద్యార్థులకు ప్రాక్టికల్ గా చూపించడం జరిగింది.

## అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా బొడ్డు మురళికృష్ణ



**అక్షర విజేత, గంపలగూడెం :** గంపలగూడెం పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు,దేవి శ్రేష్ఠ గోల్డ్ %డ%డైమండ్స్ వ్యాపార నిర్వాహకులుబొడ్డు మురళీకృష్ణ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షునిగా నియామకం అయ్యారు.రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు సూచనల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోంట్ల రామమోహన్ గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి మరింత కృషి చేస్తానని అన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఆర్యవైశ్యునికి భరోసా కల్పిస్తానని తెలిపారు. మురళీకృష్ణ ఇప్పటికే వాసవి క్లబ్ అంతర్జాతీయ కోఆర్డినేటర్ గా పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాలలోని వాసవి సభ్యులకు మరియు పేదలకు వివిధ రకాలుగా తోడ్పాటు అందిస్తూ సామాజిక,సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. బొడ్డు మురళీకృష్ణ నియామకం పట్ల జిల్లా మరియు మండలంలోని ఆర్యవైశ్య,వాసవి ప్రముఖులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## వ్యవసాయ యాంత్రికరణ పనిముట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ







**అక్షర విజేత నర్సింహులపేట :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉండాలనే సంకల్పంతో వ్యవసాయ యాంత్రీకరణ, అధిక ఉత్పత్తి సాధించడానికి తోడ్పాటు అందించడానికి వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్ పనిముట్లు సబ్సిడీపై అందించడానికి,నర్సింహులపేట మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రైతుల నుండి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది, ఎస్సీ, ఎస్టి రైతులకు మరియు జనరల్ మహిళ రైతులకు 50 శాతం సబ్సిడీ మరియు ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ వ్యవసాయ పనిముట్లపై లభిస్తుంది. లభించే వ్యవసాయ పనిముట్ల వివరాలు బ్యాటరీ స్పేయర్ 15, తైవాన్ పంపులు 19, ట్రాక్టర్ రోటవేటర్ 8, ట్రాక్టర్ పనిముట్లు( కల్టివేటర్) 9, పవర్ టిల్లర్ 1, స్ట్రా బేలర్ ( గడ్డి కట్టే యంత్రం) 1, బ్రష్ కట్టర్స్, పవర్ వీడర్లు మొదలగు వాటికి ఆసక్తి గల రైతులు దరఖాస్తులను తేదీ 25-10-2025 సాయంత్రం ఐదు గంటల లోపు మండల వ్యవసాయ శాఖ అధికారికి, లేదా మీ యొక్క వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తులు మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి జి. వినయ్ కుమార్ గురువారం రోజున పత్రిక ప్రకటనలో తెలియజేశారు, దరఖాస్తుదారులు, సమర్పించవలసిన పత్రాలు

1) 2, పాస్ స్పోర్ట్ సైజ్ ఫోటోలు
2) ఆధార్ కార్డు జిరాక్స్ కాఫీ
3) పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్ కాపీ
4) బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీ
5) ట్రాక్టర్ ఆర్. సి జిరాక్స్ కాఫీలు సమర్పించవలసిందిగా కోరడమైనది.

## విద్యార్థుల తో పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం



**అక్షర విజేత మరిపెడ :** పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మరిపెడ పోలీస్ స్టేషన్ నందు స్కూల్ విద్యార్థులకు "ఓపెన్ హౌస్" ప్రోగ్రాం నిర్వహించరు. విద్యార్థుల తో పోలీస్ స్టేషన్ లో పోలీసులు నిర్వహించే విధుల గురించి సీఐ రాజకుమార్ క్లుప్తంగా వివరించారు. మరిపెడ పోలీస్ స్టేషన్ లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఫ్లాగ్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీస్ స్టేషన్ లో ఫంక్షన్ చట్టాలు అమలు పరుస్తున్న తీరును, కేసునమోదు, నేరస్తులను నిర్ధారించడం, ప్రజల జాగ్రత్తల పట్ల తీసుకుంటున్నా చర్యలను వివరించారు. మహిళలకు చిన్న పిల్లలకు ఉన్నటువంటి చట్టాల గురించి మరియు ట్రాఫిక్ నిబంధనల గురించి డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాలకు విద్యార్థులు అలవాటు పడితే జీవితం ఎలా నాశనం అవుతుందో ప్రత్యేకంగా వివరించారు. సమాజంలో పోలీసులు పొందుపరుస్తున్నా ముఖ్య విధుల గురించి తదితర అంశాల గురించి సైబర్ నేరాల పట్ల పోలీసులు ఉపయోగిస్తున్నా నూతన టెక్నాలజీని సీఈఆర్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ రికవరీ కమ్యూనికేషన్ విహెచ్ ఎఫ్ సెట్ తదితర అంశాల గురించి విద్యార్థులకు సీఐ రాజ్ కుమార్ పోలీస్ సిబ్బంది అవగాహన కనిపించారు.

## అంతిమ క్రియ లో పాల్గొన పార్లమెంట్ సభ్యులు, గోడం నగేష్



**అక్షర విజేత: అదిలాబాద్ జిల్లా బ్యూరో :** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రానికి చెందిన పోలవార్ దిలీప్ మరియు పోలవార్ ప్రమోద్, వారి మాతృమూర్తి పరమపదించిన విషయం తెలుసుకుని, ఆమె యొక్క అంతిమ క్రియలో పాల్గొని, నివాళులు అర్పించిన, పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ , ఈ కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ డీ కొట్టడంతో ఇద్దరు చిన్నారుల మృతి

**తండ్రి, కొడుకులకు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలు.**




**అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-** ద్విచక్ర వాహనంను డాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన తల్లాటి స్వామి తన యూనికాన్ మోటార్ సైకిల్ పైన గురువారం ఉదయం 8 గంటల సమయంలో తన కుమారులు అయిన అభిరామ్, వయస్సు 8 సంవత్సరాలు, సాత్విక్ రామ్, వయస్సు 5 సంవత్సరాలు, తన అన్న కుమారుడు హర్థిక్ రామ్, వయస్సు 8 సంవత్సరాలు ను యాచారం బస్ స్టాప్ దగ్గర ఎక్కించుకుని మాల్ వైపు వెళ్తుండగా, మార్గమధ్యంలో తుమ్మలోనిగూడ గ్రామ గేటు దగ్గరకు వెళ్ళగానే అదే సమయంలో మాల్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ దానిని నడిపే డ్రైవరు అట్టి ట్రాక్టర్ ను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి, అట్టి మోటార్ సైకిల్ ను వెనకాల వైపు ఢీకొనగా అభిరామ్, హర్థిక్ రామ్ లకు తలకు, ఇతర శరీర భాగాలలో భలమైన రక్తగాయాలు అయ్యి చనిపోయినారు. తల్లాటి స్వామి, సాత్విక్ రామ్ లకి చేతులకు, ఇతర శరీర భాగాలలో భాలమైన రక్త గాయాలు కావటంతో వెంటనే వారిని దగ్గరలోని హాస్పిటల్ కి తరలించినారు. ఆక్సిడెంట్ లో చనిపోయిన అభిరామ్, హర్థిక్ రామ్ ల మృతదేహాలను శవ పంచనామా నిమిత్తం ఇబ్రాహీంపట్నం గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించటం జరిగింది. తల్లాటి స్వామి యొక్క అన్న అయిన "హరిబాబు" ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాచారం పోలీస్ లు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తే కేసులు తప్పవు..






**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** ట్రాఫిక్ నియమాలు ఉల్లంగించి, సెల్ ఫోన్ వినియోగించి వాహనాలు నడుపిన వారికి జరిమానా విధించినట్లు తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ సర్దార్ నాయక్ తెలిపారు. ఉన్నతాధికారులు ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, ఏసీపీ శంకర్ రాజు సూచన మేరకు తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా 149 కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. అందులో రాంగ్ రూట్ లో డ్రైవ్ చేసిన వారు, సెల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవ్, మద్యం సేవించి వాహనాలు నడిపినవారు ఉన్నారని స్పష్టం చేశారు. రాంగ్ రూట్ లో డ్రైవ్ చేసిన వారికి చట్టపరంగా కోర్టు లో హాజరు పరిచ్చినట్లు వివరించారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో ట్రాఫిక్ సీఐ వి. సర్దార్ నాయక్, అడిషనల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి జాన్,ఎస్ఐలు మారుతి, యుగంధర్, రెడ్డి నాయక్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసిఫ్ ను పరామర్శించిన రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్



**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ నగర శివారులోని సారంగాపూర్ ప్రాంతంలో పాత నేరస్థుడు రియాజ్ చేతిలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహమ్మద్ ఆసిఫ్ ఖాన్ ను రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసిఫ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీ.సీ.ఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ ను హత్య చేసిన పాత నేరస్థుడు రియాజ్ ను పోలీసులు పట్టుకోవడంలో ఆసిఫ్ చూపిన తెగువ, కనబర్చిన ధైర్య సాహసం ప్రశంసనీయమని చైర్మన్ తారిక్ అన్సారీ అభినందించారు. రియాజ్ దాక్కున్న ప్రదేశాన్ని పోలీసులకు తెలియజేయడంతో పాటు, అతడిని పట్టుకునే క్రమంలో ఆసిఫ్ పోలీసులకు ధైర్యంగా సహకరించారని అన్నారు. రియాజ్ కత్తితో దాడి చేయడంతో ఆసిఫ్ ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడని గుర్తు చేశారు. యువత ఆసిఫ్ ను ఆదర్శంగా తీసుకోవాలని, నేరాలపై పోరాటంలో భాగస్వాములు కావాలని చైర్మన్ పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడటానికి పోలీసులు, బాధ్యత గల పౌరులు కలిసి పని చేయడం అవసరమని అన్నారు. కాగా, ఆసిఫ్ ఖాన్ ను హైదరాబాద్ లోని కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించడంతో పాటు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న పోలీసు శాఖను చైర్మన్ తారిక్ అన్సారీ అభినందించారు.

## జిల్లా వ్యాప్తంగా 599 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

**రూ.14,15,917 నగదు స్వాధీనం**

**పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడి**




**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** దీపావళి పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఈనెల 19 నుంచి 22 వరకు పేకాట ఆడుతున్న 599 మందిని పట్టుకొని అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో మొత్తం 138 కేసులు నమోదు చేసి రూ. 14,15,917 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ డివిజన్ లో పరిధిలో 42 కేసులు నమోదు చేసి 180 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 5,13,402 నగదు స్వాధీనం చేసున్నట్లు తెలిపారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో 44 కేసులు నమోదు చేసి 232 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 5,51,785 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బోధన్ డివిజన్ పరిధిలో 52 కేసులు నమోదు చేసి 187మందిని అరెస్ట్ చేసి రూ. 3,50,730 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని సిపి హెచ్చరించారు.

## మండల రెవెన్యూ కార్యాలయం కోసం స్థల పరిశీలన

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**





**అక్షర విజేత, చిన్నంబావి :** చిన్నంబావి మండల కేంద్రమైన ఇప్పటివరకు సొంత తహసిల్దార్ కార్యాలయం లేకపోవడంతో చిన్నంబావి మండల కేంద్రంలో కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రం కి సమీపంలో ఉన్న 19గుంటల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి తాసిల్దార్ కార్యాలయం ఏర్పాటుకు కావలసిన సదుపాయాలు, ఉన్నాయా లేవా అని తహసిల్దార్ శ్రీనివాస్ ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సాగునీటి కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మిస్తున్న అడ్డుకట్టల సమస్యను స్థానిక రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే తొలగించాలని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు వెంటనే కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కళ్యాణ్ రావు, జిల్లా వ్యవసాయధికారి ఆంజనేయులు గౌడ్, సివిల్ సప్లై అధికారి, కాశీ విశ్వనాథ్, డీసీ ఓ రాణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ రాములు,ఇతర అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అక్షర విజేత

శుక్రవారం-24-అక్టోబర్- 2025

## కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ సలహాదారు, పిసిసి అధ్యక్షులు







### పార్టీ తరపున రెండు లక్షల సాయం అందించిన షబ్బీర్ అలీ

### బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం, ఒకరికి ఉద్యోగం , ఇంటిస్థలం

**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నగరంలోని బాధిత కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పరామర్శించి ప్రభుత్వం తరపున కోటి రూపాయల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలంతోపాటు ఇతర సహాయ సహకారాలు అందిస్తామని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బాధిత కుటుంబీకులకు హామీ ఇచ్చారు. గురువారం నిజామాబాద్‌లో రౌడీషీటర్ దాడిలో వీరమరణం పొందిన కానిస్టేబుల్ ప్రమోద్ ఇంటికి చేరుకుని బాధిత కటుంబీకులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా వారు ప్రమోద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ తరపున రెండు లక్షల రూపాయలు అందించిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్ కుటుంబీకులకు అందజేశారు. అలాగే ప్రభుత్వం తరపున కోటి రూపాయలు పరిహారం కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం నిజామాబాద్ పట్టణంలో 300 గజాల ఇంటి స్థలం అందిస్తామని వారికి భరోసానిచ్చారు. అయినా తాము ఎంతయినా ఆర్థికంగా సహాయం చేయగలమే గాని వారి కుటుంబానికి మానసికంగా జరిగిన గాయాన్ని ఎవరు పూడ్చలేనిదని, బాధిత కుటుంబీకులకు తీరని లోటు అని ఆవేదన వ్యక్తంచేశారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నఈ నిర్ణయం పోలీసు వర్గాల్లో కొంతమేర ఉపశమనం కలిగించిందని అన్నారు. ప్రమోద్ చేసిన సేవలు మరువలేనివని, ఆయన త్యాగం పోలీసు శాఖ గౌరవాన్ని పెంచి ప్రజల్లో పోలీసుల పట్ల గౌరవం పెరిగిందని అన్నారు. పోలీస్ శాఖ సిబ్బంది భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు నివారించేందుకు పోలీసులకు ప్రభుత్వం నైతిక బలం అందిస్తుందని, ప్రమోద్ కుటుంబానికి అందించే ఈ సాయం ఆయన చేసిన సేవలకు ప్రభుత్వ గౌరవ సూచకమని, ఇది పోలీసు శాఖలో ప్రతి సభ్యుడికి ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రమోద్ త్యాగం పోలీసు వ్యవస్థలో కర్తవ్యనిష్ఠకు ప్రతీకగా నిలిచిపోతుందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో భారీ మెజార్టీ కోసం గట్టి ప్రయత్నం చేయాలి

### గులాబీ అధినేత కేసిఆర్ పార్టీ నేతలకు దిశా నిర్దేశంలి





**అక్షర విజేత గజ్వేల్ :** జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో అనివార్యమైన ఉప ఎన్నికలో మాగంటి సునీత గోపీనాథ్ గెలుపును జూబ్లీహిల్స్ ప్రజలు ఇప్పటికే ఖాయం చేశారని, పార్టీ నేతలు ప్రజలవద్దకు వెళ్లి వారితో మమేకమై కాంగ్రెస్ దుష్ట పాలన పట్ల మరింత అవగాహన కల్పించి భారీ మెజారిటీ కోసం గట్టి ప్రయత్నం చేయాల్సి ఉన్నదని పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీ పాలనతో ఇప్పటికే రాష్ట్రం గుల్ల గుల్ల అయ్యిందని, ఇక జూబ్లీహిల్స్‌లో తన అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఓ రౌడీషీటర్‌ను నిలబెట్టి హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజ్ఞులైన జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన రౌడీ షీటర్ ఫ్యామిలీ నుంచి వచ్చిన అభ్యర్థిని చిత్తుగా ఓడించి, జూబ్లీహిల్స్ గౌరవాన్ని హైదరాబాద్ లో శాంతి భద్రతలను కాపాడుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో,బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజారిటీతో గెలుపు లక్ష్యంగా, పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన, ఎర్రవెల్లి నివాస ప్రాంగణంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పోటీలో ఉన్న అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ సహా,ఉప ఎన్నిక కోఆర్డినేటర్లుగా ఉన్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎమ్మెల్సీ మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, జి జగదీశ్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పాల్గొన్నారు. ఈ సమావేశం సందర్భంగా పార్టీ అభ్యర్థి గెలుపు దిశగా ఇప్పటికే ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఇప్పటిదాకా కొనసాగుతున్న ప్రచారం సంబంధిత అంశాల మీద అధినేత కు ఇంచార్జీలు రిపోర్ట్ చేశారు.పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజారిటీతో గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహాలు ఎత్తుగడలు, కార్యాచరణకు సంబంధించి,అధినేత కేసీఆర్ సమావేశంలో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్రంలో దిగజారిన అభివృద్ధి గురించి,రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తలెత్తిన ప్రమాదకర పరిస్థితులను గురించి వారికి ఇంటింటికీ తిరిగి వివరించాలని పార్టీ నేతలకు అధినేత కేసీఆర్ ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనాకాలంలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, మానవీయ కోణంలో అమలుచేసిన సంక్షేమ పథకాలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎందుకు మాయమయ్యాయనే విషయాన్ని ప్రజలతో కలిసి చర్చించాలని అధినేత కేసీఆర్ సూచించారు.ఈ కార్యక్రమం లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల, క్లస్టర్ల ఇంచార్జులు పాల్గొన్నారు. వారిలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు,మాజీ ఎమ్మెల్యేలు, మాజీ చైర్మన్లు,పార్టీ సీనియర్ నేతలు,ముఖ్య నేతలు, స్థానిక కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు, తదితర పార్టీ కీలక నేతలు పాల్గొన్నారు.

## తల్లి బిడ్డలకు సరైన పోషకాహారంతోనే ఆరోగ్యవంతంగా ఉంటారు







### ఆరోగ్యవంతమైన రాష్ట్ర నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి

**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ఆరోగ్యమే మహాభాగ్యం అని అందుకు తల్లి బిడ్డలకు సరైన పోషకాహారం అందిస్తేనే వారు ఆరోగ్యవంతంగా ఉంటారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి అన్నారు. గురువారం పోషణ మాసం కార్యక్రమంలో గుండారం గ్రామంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ ఎమ్మెల్మే భూపతిరెడ్డి మాట్లాడుతూ తల్లి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు, తల్లులు, చిన్నారులకు గుడ్లు, పాలు, బాలామృతం, స్నాక్స్ వంటి నాణ్యమైన ఆహార పదార్థాలను అందజేస్తోందని చెప్పారు. సరైన పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్ర నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 33 అంగన్వాడి భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాత భవనాలకు మరమ్మత్తులు, లైటింగ్, బాత్రూములు, వంటగదుల సదుపాయాలు కల్పించే దిశగా ప్రతిపాదనలు పంపించామని, త్వరలో అన్ని అంగన్వాడి కేంద్రాల్లో ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మినీ అంగన్వాడి సెంటర్లలో పనిచేస్తున్న టీచర్లను అప్గ్రేడ్ చేసి సమాన వేతనాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నర్సరీ తరగతులను ప్రారంభించబోతోందని, నర్సరీ నుండి నాలుగవ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలతో అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. తరువాత పోషకాహార పదార్థాలు తయారు చేసిన అంగన్వాడి టీచర్లకు బహుమతులు ప్రధానం చేశారు. గర్భిణీల శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని పండ్లు, దుస్తులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్ , ఐసీడీఎస్ పీడీ రసుల్ బీ, ఏఎంసీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, సొసైటీ చైర్మన్లు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా మహిళా ప్రాంగణం ఎం పి హెచ్

## డబ్ల్యు విద్యార్థినుల క్యాపింగ్ మహోత్సవం







### ఏ.ఎన్.ఎం విద్యతో ఎన్నో ఉపాధి అవకాశాలు - బి కళావతి బాయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి, ఖమ్మం జిల్లా.

### మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెల్లడం హర్షనీయం- ఎం నరేందర్ మెడికల్ సూపరింటెండెంట్, జిల్లా సర్వజన ఆసుపత్రి , ఖమ్మం.

**అక్షర విజేత ఖమ్మం :** స్థానిక మహిళా ప్రాంగణంలో ఈరోజు ఎం పి హెచ్ డబ్ల్యు విద్యార్థుల క్యాపింగ్ మహోత్సవం వైభవంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారిని బి కళావతి భాయి మరియు జిల్లా సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ నరేందర్ పాల్గొన్నారు.ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బి కళావతి బాయి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థినులకు మహిళా ప్రాంగణం అందిస్తున్నసేవలుఅభినందనీయమని, ఇక్కడ నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రతి ఏటా స్టేట్ ర్యాంకులు సాధించటం మన జిల్లాకు గర్వకారణంగా ఉందని, ఈ ఏఎన్ఎం శిక్షణతో ప్రతి ఒక్కరికి మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని, వాటిని అందిపుచ్చుకోవాలనిఆకాంక్షించారు. విద్యార్థినుల కు నర్సింగ్ వృత్తి ఎంత పవిత్రమైనదో చెప్పారు. మరియొక ముఖ్య అతిథిఎం నరేందర్,మెడికల్సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇక్కడ అభ్యసిస్తున్న విద్యార్థులకు భవిష్యత్తులో ఏదేని కాంట్రాక్ట్ / ఔట్సోర్సింగ్ ఉద్యోగ అవకాశాలు ఉంటే తప్పకుండా వారి పేరును పరిగణలోకి తీసుకుంటామని, ఈ చదువుకునే రెండు సంవత్సరాలు కష్టపడి చదువుకుంటే రాబోయే భవిష్యత్తు సంవత్సరాలు జీవితంలో స్థిరపడి సుఖంగా జీవించవచ్చని, కాబట్టి విద్యార్థులు కష్టపడి చదవాలని ఉద్బోధించారు.మరియొక అతిథిగా విచ్చేసిన డి.పి.హెచ్.ఎన్ శేష పద్మ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి యొక్కపవిత్రతను,లక్ష్యాలను వివరించి పేద ప్రజలు వచ్చే సర్వజన ఆస్పత్రిలో మంచి సేవలు చేయాలని పిల్లలకు హితవు చెప్పారు. ఇప్పుడు రానున్న కాలంలో ఏఎన్ఎం విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని కాబట్టి అందరూ వాటిని ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు. తర్వాత క్యాపింగ్ మహోత్సవం కార్యక్రమాలు ఈ అతిధుల సమక్షంలో వైభవం గా జరిగాయి.తర్వాత జరిగిన సాంస్కృతి కకార్యక్రమాలు అలరించాయి. జిల్లామహిళా ప్రాంగణాధికారిని వేల్పుల విజేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది సీనియర్ నాయకులు నందగిరి శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది శ్రీమతి నాగ సరస్వతి, స్పందన, మల్లిక, విజయ్ కుమార్, సుధీర్, సుకన్య, లాలయ్య, మౌనిక,దుర్గారావు, శాంతమ్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పిచ్చేశ్వరరావు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన రూరల్ ఎమ్మెల్యే







**అక్షర విజేత,నిజామాబాద్ ప్రతినిధి :** డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పిచ్చేశ్వరరావు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి గురువారం ఆయన నివాసానికి వెళ్లి పిచ్చేశ్వరరావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి పిచ్చేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మాండవ వెంకటేశ్వరరావు, మాజీ ఐసీడీఎస్ చైర్మన్ తారాచంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాగా రెడ్డి, వాసు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**అక్షర విజేత సూర్యాపేట ప్రతినిధి :** జేఏసీడిపో మేనేజర్ సిఐ సమక్షంలో డిపో జేఏసీ ఆధ్వర్యంలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిపో మేనేజర్ అందజేయడం జరిగింది. జేబ్స్ డ్యూటీల వల్ల కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రేపటినుండి మూడు రోజుల డ్యూటీలను రద్దు చేసి యధావిధిగా స్పెషల్ ఆఫ్ డ్యూటీలుగా కొనసాగించాలని వారిని కోరగా రెండు వారాలలో పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడం జరిగింది జేబీఎస్ డ్యూటీ ల సమస్య పరిష్కారం అయిన తర్వాత రెండు వారాలలో నూతన డ్యూటీ చార్ట్ సీనియార్టీ ప్రకారం వేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. సర్వీస్ ల రన్నింగ్ టైం మరియు అధికంగా కేటాయించిన రెస్ట్ టైం లను కూడా తగ్గిస్తామని ఎలక్ట్రికల్ బస్సుల ఛార్జింగ్ టైం కూడా తగ్గిస్తామని, ఏడీసీలను రొటేషన్ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. డ్యూటీ చార్ట్ వద్ద మరియు బుకింగ్ చేయు సందర్భాలలో కొంతమంది అధికారులు కార్మికులతో మాట్లాడు సందర్భాలలో కార్మికుల మనోభావాలను కించపరిచే విధంగా ఉన్నాయని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అలాంటి విషయాలు ఉంటే చెప్పండి అని వాటిని పరిష్కరిస్తాం అని, సీరియస్ గా మంద లిస్తామని, ప్రయాణికుల ఫిర్యాదుల పట్ల కూడా సానుకూలంగా వ్యవహరిస్తామని కూడా చెప్పడం జరిగింది.. ఏ సమస్యనా మా దృష్టికి తీసుకురావచ్చని అందరు కూడా డిపో అభివృద్ధికి డిపో టీం గా కృషి చేద్దామని ఎవరికీ ఎక్కడ కూడా బేధాభిప్రాయాలు లేవని సానుకూల ప్రశాంత వాతావరణంలో డిపో అభిరుద్ధికి అందరూ కృషి చేద్దామని వారు కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎస్ ఎస్ గౌడ్, బత్తుల సుధాకర్, ఎం.లచ్చయ్య, పీఎం రావు,డి. ఆర్. కుమార్, బి.శ్రీక%శీ%ట్లం,ఎ. వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి! అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్






**అక్షరవిజేత మామడ :** నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం, మంజూరైన నిధులు, పనుల పురోగతి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.సమావేశం లో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, డీఈఈ గంగాధర్, మండల ప్రత్యేక అధికారి రాజనర్సయ్య, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీవో ఉపేందర్, ఏఈ హరీష్ ఉన్నారు.

## రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ కృషితో ఇందిరమ్మ ఇండ్లకు మోక్షం

### వడ్డెబోయిన నరసింహారావు



**అక్షర విజేత ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లకు 400 చదరపు అడుగుల స్థలం ఉండాలని నిబంధన పెట్టినప్పటికీ ఖమ్మం నగరంలోని వివిధ డివిజన్లో కడుబీదవారైన చాలా తక్కువ స్థలం కలిగి ఉన్న ఇందిరమ్మఇండ్లుమంజూరైనటువంటి లబ్ధిదారులుతుమ్మలయుగంధర్ ని కలిసి విన్నవించుకున్న వెంటనే ఈ సమస్యను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు దృష్టికి తీసుకొనిపోగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి,గృహా నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి తెలియపరచిన వెంటనే ఈ ఒక్క సమస్యను పరిష్కరించారు. ఈ జటిలమైన సమస్యను పరిష్కరించేందుకు కృషిచేసిన తుమ్మల యుగంధర్ కి వడ్డెబోయిన సారథ్యంలో ఖమ్మం నగర ప్రజలందరు తరపున ముఖ్యంగా 25వ డివిజన్లో ఉన్న లబ్ధిదారులు, మరియు కాంగ్రెస్ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పీపుల్స్ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే సంబరాలు

ఉత్సాహంగా ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు















**అక్షర విజేత, తాండూరు :** తాండూరు పట్టణంలోని డిగ్రీ పీపుల్స్ కళాశాలలో ఆధ్వర్యంలో ఫ్రెండ్షిప్ డే వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించారు. గురువారం తాండూర్ పట్టణంలోని డిగ్రీ పీపుల్స్ కళాశాల సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఫ్రెషర్స్ వేడుకల సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పి, చంద్రకళ విద్యార్థులు క్రమశిక్షణతో చక్కగా చదువుకోవాలన్నారు. విద్యార్థులు ఏర్పరుచుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీపుల్స్ డిగ్రీ కళాశాల విద్యను అందిస్తోందని తెలిపారు.విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి కాలేజీకి, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి,చంద్రకళ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏడుపాయల్లో కార్తీక ఆకాశదీపం

దర్శించుకున్న భక్తులు





**అక్షరవిజేత,పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వనదుర్గా భవాని మాత అమ్మవారి ఆలయ సన్నిధిలో పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకొని గురువారం సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించారు. పవిత్ర కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా ఏడుపాయల అమ్మవారి ధ్వజస్తంభం ముందు ఆకాశ దీపాన్ని పెట్టడం ప్రతి ఏటా ఆనవాయితీగా వస్తుంది. వివిధ రకాల పూలతో ఆకాశదీపాన్ని వైభవంగా అలంకరించారు. కార్తిక మాసం ప్రారంభం సందర్భంగా ఆలయ అర్చకులు ఆర్ శంకర్ శర్మ, పార్థివ శర్మ, మురళీధర్ శర్మ ల ఆధ్వర్యంలో వనదుర్గాదేవి అమ్మవారికి కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆకాశ దీపాన్ని వేదబ్రాహ్మణ పండితులు, అర్చకుల ప్రత్యేక పూజల మధ్య వెలిగించారు.భక్తులు ఆకాశదీప దివ్య దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై వరి ధాన్యం కుప్పలు! వాహనదారుల తిప్పలు.!!



**అక్షర విజేత, శివంపేట :** శివంపేట మండలంలోని పలు గ్రామాల ప్రధాన రహదారులపై వర్షాకాలంలో వేసిన వరి ధాన్యాన్ని రైతులు గ్రామాలలోని ప్రధాన రహదారులపై ఆరబెట్టడం జరుగుతుంది. పాలు పొలాలలో కల్లాలు ఏర్పాటుపై సబ్సిడీ సబ్సిడీ ఇచ్చినా కానీ ఏ రైతులు కూడా తమ పొలాల వద్ద కల్లాలను ఏర్పాటు చేసుకోకపోవడం విడ్డూరం. కొంతమంది రైతులు మాత్రమే తమ పొలాల వద్ద కల్లాలను ప్రభుత్వం ద్వారా సహాయం పొంది ఏర్పాటు చేసుకున్నారు. వరి ధాన్యం కుప్పలతో వాహనదారులు ధాన్యం కుప్పలతో వాహనదారులు,పాదచారులు రాత్రి సమయాలలో వరి ధాన్యంపై పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నదా అధికారులు తక్షణమే స్పందించి రోడ్లపై వరి ధాన్యాన్ని ఆరబెట్టకుండా చూడాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

# కప్రా మండలానికి నూతన తాసిల్దార్ బైరెడ్డి రాజేష్



**అక్షర విజేత,కాప్రా :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కప్రా మండల్ తాసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన బైరెడ్డి రాజేష్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ మర్యాదగాపూర్వకంగా కలిసిన సమాచార హక్కు సాధన సమితి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్. ఈ సందర్భంగా కాప్రా మండల పరిధిలోని ప్రభుత్వ భూముల రక్షణకై చొరవ చూపాలని ఇందుకు అనుగుణంగా గత తాసిల్దార్ మండల పరిధిలోని ప్రభుత్వ భూముల రక్షణలో భాగంగా వివిధ సర్వే నంబర్లలో ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి కంచె వేసినా భూములన్నిటిని కూడా యధావిధిగా రక్షించాలని కోరగా ప్రస్తుత తాసిల్దార్ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ భూములు కాపాడే విషయంలో వెనకడుగు వేయనంటూ తెలియజేస్తూ, సమాచారం అందిన వెంటనే కచ్చితంగా స్పందిస్తామని, భూ కబ్జాదారుల పై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. నేటి కార్యక్రమంలో నర్సింహా చారీ, నగేష్ పాల్గొన్నారు.

# ప్రథమ స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాలు ఏర్పాటు చేయాలి







వడ్డెరుల హక్కుల సాధనకై భారీ బహిరంగ సభలు జరపాలి.

రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జరిపిటి జయపాల్ ఎత్తారి అత్తయ్య.

**అక్షర విజేత ఖమ్మం:-** వడ్డెర సంఘం లక్ష సాధనకై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం ఖమ్మం బైపాస్ రోడ్ శ్రీ జయ విలాసిని రియల్ ఎస్టేట్ ఆఫీస్ కి రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జరిపిటి జయపాల్ ఎత్తారి అంతయ్య రావడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరుల హక్కుల సాధనకై భారీ బహిరంగ సభలు జరపాలని అలాగే ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్ లో ప్రథమ స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాలు ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘం నాయకులకు విజ్ఞప్తి చేశారు . వడ్డెర్లందరూ ఐకమత్యంగా ఉండి కాంట్రాక్టులు మైనింగ్ పనులు వడ్డెర్లకు 15 పర్సెంట్ ఇవ్వాలని వడ్డెర సంఘం మైనింగ్ , కాంట్రాక్ట్ నాయకులు రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జంపిటి జయపాల్ ను కోరారు . ఈ కార్యక్రమం లో జె వి డి చైర్మన్ అధినేత కుంచపు రాంబాబు , రాష్ట్ర వడ్డెర సంఘం గన్నుదెబ్బ అధ్యక్షులు ఎత్తరి అంతయ్య , వడ్డెర సంఘం జిల్లా నాయకులు కుంచపు వెంకటేశ్వర్లు , దేవళ్ళ వీరబాబు , వేరుపుల వెంకట్ ప్రసాద్ , కుమార్ , రాము , నరసయ్య , వీరభద్రం , వెంకన్న , గాంధీ , టీవీ రాజు తదితరులు పాల్గొన్నారు .

# పెద్ద శంకరంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

**అక్షర విజేత, పెద్ద శంకరంపేట్:** పెద్ద శంకరంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో, విద్యార్థులలో పోలీస్ వ్యవస్థపై అవగాహన పెంపొందించేందుకు "ఓపెన్ హౌస్ కార్యక్రమం" ఘనంగా నిర్వహించరూ ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత బాలల పాఠశాల, అలాగే ఎస్.టి. డాన్ బాస్కో స్కూల్ విద్యార్థులు తమ ఉపాధ్యాయలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లోని విభిన్న విభాగాలు (వర్టికల్స్), వాటి విధులు బాధ్యతలు, పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డులు, రిజిస్టర్లు, ఎఫ్ఐఆర్ నమోదు విధానం వంటి అంశాలను వివరించారు. విద్యార్థులకు రోడ్డు భద్రత, సైబర్ సెక్యూరిటీ, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, మరియు పౌరులుగా పాటించాల్సిన క్రమశిక్షణ, చట్టపరమైన అవగాహన వంటి అంశాలపై కూడా వివరంగా అవగాహన కల్పించారు.



**ఈ సందర్భంగా పెద్ద శంకరంపేట్ ఎస్సై మాట్లాడుతూ**

పోలీస్ వ్యవస్థ ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తుంది. విద్యార్థులు చిన్న వయస్సులోనే చట్టం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను తెలుసుకుంటే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదుగుతారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ప్రశ్నలు అడిగి పోలీస్ విధులపై ఆసక్తి చూపించారు. విద్యార్థులు పోలీస్ స్టేషన్‌లోని విభాగాలను ప్రత్యక్షంగా సందర్శించి, పోలీస్ పనితీరు గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు.



# దళిత మహిళపై దాడి అమానుషం..!

కమలాపూర్ లో ఎమ్మార్పీఎస్ నేతల ఆందోళన .

ఓస్కుల నాగరాజు, ఓస్కుల అరుణ కుటుంబానికి న్యాయం జరగాలి...

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరు సంపత్ డిమాండ్

**అక్షర విజేత, కమలాపూర్ :** కమలాపూర్ మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 35 బి లో దళితుల భూములను కబ్జా చేసి అక్రమ కట్టడాలు నిర్మాణం చేపడుతున్న పచ్చిమట్ల సుధాకర్, పచ్చిమట్ల సునీత, కొలిపాక శంకర్, శనిగరపు భాగ్యమ్మ, బండ్ల వెంకటేశ్వర్లు, బండ్ల బిక్షపతి, పట్టెం శ్రీనివాస్, తరిగొప్పుల భద్రయ్య, పల్లవేణి లక్ష్మి లపై ఎస్సీ ఎస్టీ పరిరక్షణ చట్టం ప్రకారం అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్ మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 35 బి లో దళిత కుటుంబానికి చెందిన కీర్తిశేషులు. ఓస్కుల రాజీరు వంశస్తులైన హక్కుదారులు నాగరాజు,అరుణ భూమిని కబ్జా చేసి వేరే సర్వే నెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని అక్రమంగా నిర్మాణం చేపడుతూ ఏలాంటి పర్మిషన్లు లేకుండా దౌర్జన్యంతో దళితులపై దాడికి పాల్పడుతున్న వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల భూములను కాపాడాల్సిన రెవెన్యూ పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీఓ చేతన్ రెడ్డికి ఫిర్యాదు చేసినప్పటికీ అక్రమ నిర్మాణాల తొలగింపు పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 27, 28, 34 సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్లు చేసుకొని 35 సర్వే నెంబర్లోకి చొచ్చుకొని వచ్చి దళిత మహిళల అరుణపై చెప్పుతో దాడి చేసి అవమానపరిచిన సదరు మహిళతో పాటు, భూమిని ఆక్రమించుకొని దౌర్జన్యానికి దాడులకు పాల్పడుతున్న వారిపై కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల భూములను పరిరక్షించి దళితుల మానప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 79 సంవత్సరాల స్వాతంత్ర్య ప్రజాస్వామ్యంలో నేటికీ దళితులపై దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన చెందారు. అధికారులు స్పందించి చొరబాటు దారులపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని లేదంటే ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పుల్ల శోభన్ బాబు, కొలుగూరి కుమార్, బిఎస్పీ మండల అధ్యక్షుడు పేర్క శ్రీనివాస్,ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శనిగరపు రవీందర్,చిలువేరు రవి, ఎల్కటి అనిల్, అంకిల సదానందం, మాట్ల కల్యాణ్,జూపాక ఇస్తారీ, జన్ను బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.





# ఏఐ కంటెంట్ లేబులింగ్: అవసరం,విధి విధానాలు, సవాళ్లు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, ఏఐ ద్వారా సృష్టించబడిన కంటెంట్‌ను లేబులింగ్ చేయడం అనేది ప్రపంచవ్యాప్తంగా ముఖ్యమైన చర్చా అంశంగా మారింది. ఈ లేబులింగ్ ప్రక్రియ ద్వారా, కంటెంట్ ఏఐ ద్వారా ఉత్పత్తి చేయబడిందా లేదా మానవులచే సృష్టించబడిందా అనేది స్పష్టంగా గుర్తించడం ఉద్దేశం. ఇది పారదర్శకతను పెంచడమే కాకుండా, మోసాలు, తప్పుడు సమాచారం వ్యాప్తి, డీప్‌ఫేక్‌లు వంటి సమస్యలను తగ్గించడానికి సహాయ పడుతుంది. 2025లో ఈ అంశం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది, ఎందుకంటే ఏఐ సాధనాలు ఇమేజ్‌లు, వీడియోలు, ఆడియోలు, టెక్స్ట్‌లను మానవ సృష్టికి సమానంగా సృష్టించగలవు. మీడియా వార్తలు, వ్యాసాలు, అధ్యయనాలు ఈ లేబులింగ్‌ను విస్తృతంగా చర్చించాయి, దీని అవసరం, విధానాలు, ఎఫెక్టివ్‌నెస్ మరియు సవాళ్లను విశ్లేషించాయి.

**ఏఐ కంటెంట్ లేబులింగ్ ఎందుకు ?**

**ఏఐ కంటెంట్ లేబులింగ్ ఎందుకు అవసరం**

అంటే, ముఖ్యంగా తప్పుడు సమాచారం వ్యాప్తిని నియంత్రించడానికి, వినియోగదారుల విశ్వాసాన్ని కాపాడడానికి. ఏఐ సాధనాలు సులభంగా మోసపూరిత కంటెంట్‌ను సృష్టించగలవు, ఇది ఎన్నికలు, పబ్లిక్ హెల్త్, సామాజిక సమస్యల సమయంలో ప్రమాదకరంగా మారుతుంది. స్టాన్‌ఫోర్డ్ హ్యూమన్-సెంటర్డ్ ఏఐ (హెచ్ఏఐ) అధ్యయనం ప్రకారం, ఏఐ-జనరేటెడ్ పాలసీ సందేశాలకు లేబుల్స్ జోడించినా వాటి ప్రభావం మారదు, కానీ పారదర్శకత కోసం లేబులింగ్ అవసరమని సూచిస్తుంది. మరో అధ్యయనంలో, ఏఐ కంటెంట్ లేబుల్స్ వినియోగదారుల విశ్వసనీయతను కొంత తగ్గిస్తాయి, కానీ పూర్తిగా మార్చవని తెలుస్తుంది. ఇంకా, ఏఐ లేబుల్స్ మార్కెటింగ్‌లో ప్రభావం చూపుతాయి, ఉదాహరణకు లింక్డిన్‌లో ఆథెంటిసిటీని నొక్కి చెబుతాయి. కొత్త సృష్టికర్తలను ప్రోత్సహిస్తాయి. మరోవైపు, లేబులింగ్ మండేట్స్ తప్పుడు సమాచారం, ఐపీ రైట్స్ ఉల్లంఘనలు వంటి సమస్యలను తగ్గించవని కొన్ని వాదనలు చెబుతున్నాయి. కెనడా డేస్ రిపోర్ట్ ప్రకారం, చిన్న లేబుల్స్ వినియోగదారుల విశ్వాసం లేదా షేరింగ్ ప్రవర్తనపై ప్రభావం చూపవు, కానీ పూర్తి-స్క్రీన్ లేబుల్స్ మెరుగైన ఫలితాలు ఇస్తాయి ఎమ్ఐటీ స్టడీ లేబులింగ్ వర్డింగ్ గురించి చర్చిస్తూ, "ఏఐ-జనరేటెడ్" వంటి టర్మ్స్ ఎఫెక్టివ్ గా పనిచేస్తుంది అని సూచిస్తుంది.

**విధి-విధానాలు:**

విధి-విధానాలు విషయానికి వస్తే, 2025లో పలు దేశాలు లేబులింగ్‌కు సంబంధించిన కఠిన నిబంధనలు ప్రతిపాదిస్తున్నాయి. ఇండియాలో, ఐటీ మంత్రిత్వ శాఖ 2025 అక్టోబర్ 22న కొత్త డ్రాఫ్ట్ రూల్స్ ప్రతిపాదించింది, ఇందులో ఏఐ-జనరేటెడ్ మీడియాకు దృశ్యమాన లేబుల్స్ (కనీసం 10 శాతం సర్ఫేస్ ఏరియా కవర్ చేసేవి), మెటాడేటా ట్రేసబిలిటీ, పారదర్శకత అవసరమని పేర్కొన్నది. ఇది ప్రధానంగా డీప్‌ఫేక్‌లు, మిస్‌యూజ్ రిస్క్‌లను తగ్గించడానికి ఉద్దేశించింది. చైనాలో, 2025 సెప్టెంబర్ 1న అమలులోకి వచ్చిన "మెజర్స్ ఫర్ లేబులింగ్ ఏఐ-జనరేటెడ్ కంటెంట్" నియమాలు ఎక్స్‌ప్లిసిట్ మరియు ఇంప్లిసిట్ లేబులింగ్‌ను మ్యాండేట్ చేస్తాయి, విజిబుల్ లేబుల్స్ అలాగే మెటాడేటా అవసరాన్ని గుర్తిస్తుంది. ఇది ప్రపంచంలోనే కఠినమైన నియమాలుగా పరిగణించబడుతుంది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఏఐ ఆక్ట్ ప్రకారం, ఏఐ-జనరేటెడ్ కంటెంట్‌ను గుర్తించాలి, ముఖ్యంగా జర్నలిజం, మీడియా రంగాలలో ట్రాన్స్‌పరెన్సీ అవసరం. యునైటెడ్ స్టేట్స్‌లో, 2025లో ఏఐ రెగ్యులేషన్స్ అప్‌డేట్ అయ్యాయి, రాష్ట్రాలలో లేబులింగ్ బిల్లులు అమలవుతున్నాయి.

**మేడిన్ మీడియా, సోషల్ మీడియా రంగంలో ప్రభావం:**

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కూడా ఇందులో పాల్గొంటున్నాయి. మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్) 2024లో "ఏఐ ఇన్ఫో" లేబుల్స్ ప్రవేశపెట్టింది, కానీ ఆటోమేటిక్ లేబులింగ్ సమస్యలు ఎదుర్కొంది. టిక్‌టాక్ 2023లో ఏఐ లేబుల్స్ అనుమతించింది, నాన్-కంప్లయన్స్‌కు కంటెంట్ రిమూవల్ హెచ్చరికలు ఇస్తుంది. మీడియాలో వచ్చిన వార్తలు, వ్యాసాలు ఈ లేబులింగ్‌ను వివిధ కోణాల నుండి విశ్లేషించాయి. రాయిటర్స్ వార్తలో, ఇండియా ఏఐ కంటెంట్ లేబులింగ్ రూల్స్ గురించి చర్చించింది, డీప్‌ఫేక్‌లను టార్గెట్ చేస్తూ. స్టాన్‌ఫోర్డ్ స్టడీ ఏఐ లేబుల్స్ పర్సువేసివ్‌నెస్‌ను మార్చవని చూపించింది.ఫోర్బ్స్ ఇండియా ఎక్స్‌ప్లెయినర్ ఇండియా రెగ్యులేషన్ వివరాలు చర్చించింది.పీఎన్ఏఎస్ నెక్సస్ అధ్యయనం ఏఐ-లేబుల్డ్ హెడ్‌లైన్స్ పట్ల స్కెప్టిసిజం పెరుగుతుందని తెలిపింది, కానీ దీని ప్రభావం చిన్నదే. కానీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కూడా డీప్‌ఫేక్‌లు సోషల్ మీడియాలో పెరుగుతున్నాయని, లేబులింగ్ అవసరమని చెప్పింది. రెడ్డిట్ చర్చలలో చైనా నియమాలు కఠినమైనవని పేర్కొన్నారు. పీఎమ్‌సీ అధ్యయనం ఏఐజీసీ (ఏఐ-జనరేటెడ్ కంటెంట్) లేబుల్స్ ప్రభావం తక్కువగా ఉందని తెలిపింది. అలాగే ఆర్‌కైవ్ స్టడీ ఆథర్‌షిప్ లేబుల్స్ పర్సువేసివ్‌నెస్‌ను మార్చవని చూపించింది. ఏసీఎమ్ స్టడీ లేబుల్ డిజైన్స్ వినియోగదారుల నమ్మకాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపింది. ఓఎస్ఎఫ్ స్టడీ "మేడ్ విత్ ఏఐ" లేబుల్స్ హ్యూమన్ ప్రావినెన్స్‌ను తగ్గిస్తాయని చెప్పింది.

**విశ్లేషణాత్మకంగా చూస్తే, లేబులింగ్ ప్రయోజనాలు స్పష్టం:**

పారదర్శకత పెంచడం, వినియోగదారులు సమాచారాన్ని సరిగ్గా అంచనా వేయడం, చట్టపరంగా లీగల్ రక్షణ అందించడం ముఖ్యం.అంతర్జాతీయ ట్రేడ్ అండ్ డెవలప్మెంట్ నేపథ్యంలో .దీనిలో ఆశించే ప్రయోజనాలు ఏమిటంటే ఇది బిజినెస్‌లను చట్ట పరమైన లిటిగేషన్ నుండి రక్షిస్తుంది. కానీ దీని లో అనేక సవాళ్లు కూడా ఉన్నాయి. లేబుల్స్ ఎఫెక్టివ్‌నెస్ కాలక్రమేణా తగ్గే అవకాశం కూడా ఉంటుంది. రిపీటెడ్ ఎక్స్‌పోజర్‌తో డిమినిషింగ్ రిటర్న్స్ ఉంటాయి. అంతేకాక, ఏ కంటెంట్‌ను లేబుల్ చేయాలి ? అనే విషయం లో ఇంత వరకు స్పష్టత లేదు. ముఖ్యంగా ఏఐ అసిస్టెంట్ ఫంక్షన్లలో. మెటా ఆటో-లేబులింగ్ సమస్యలు ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

**కొన్ని హెచ్చరికలు:**

మీడియా లిటరసీ ఎడ్యుకేషన్ వంటి అదనపు చర్యలు అవసరమని స్టడీలు సూచిస్తున్నాయి.

ఎక్స్ పోస్ట్‌లలో, ఏఐ కంటెంట్ లేబులింగ్ డిస్కషన్స్ సీ2పీఏ స్టాండర్డ్స్ గురించి చర్చిస్తున్నాయి, వాటర్‌మార్కింగ్ అవసరమని ఈ రంగంలో నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. భవిష్యత్తులో, ఏఐ టెక్నాలజీ అభివృద్ధితో లేబులింగ్ స్టాండర్డ్స్ మరింత రిఫైన్ చేయాల్సి ఉంటుంది.పాలసీమేకర్లు, ప్లాట్‌ఫామ్‌లు సమన్వయం చేయాలి. ఇది మాత్రమే సరిపోదు,ఇందు కోసం మీడియా లిటరసీ, రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌లు కలిసి పనిచేయాల్సి ఉంటుంది. మొత్తంగా, ఏఐ కంటెంట్ లేబులింగ్ డిజిటల్ ఎకోసిస్టమ్‌లో కీలకమైన అడుగు. మీడియా వార్తలు, అధ్యయనాలు దీని అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి, కానీ ఎఫెక్టివ్ ఇంప్లిమెంటేషన్ కోసం మరిన్ని పరిశోధనలు, గ్లోబల్ కోఆపరేషన్ కూడా అవసరం. డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్. 9849328496.

# నిజామాబాద్ నగరాన్ని మరింత శుభ్రమైన సుందరమైన, ఆధునిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం


## అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ నగరాన్ని మరింత శుభ్రమైన, సుందరమైన, ఆధునిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కేశవ్ వేణుతో కలిసి నగరంలోని పలు ప్రాంతాలలో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కేశవ్ వేణు హాజరయ్యారు. ఈ అభివృద్ధి పనుల కోసం అవసరమైన నిధులను నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా కేటాయించడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయ మాట్లాడుతూ "ప్రజల ఆశయాలు నెరవేర్చడం, నగరంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం నా ధ్యేయం. ప్రతి వార్డు, ప్రతి వీధిలో మౌలిక వసతులు అందించడమే నా లక్ష్యం. ఇందూరు నగరంలో డ్రెయిన్ లేకపోవడం, రోడ్లు బాగాలేకపోవడం వంటి సమస్యలు ఉండకూడదని అన్నారు. గౌతమ్ నగర్, ఉర్దూ పాఠశాల సమీపంలో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులతోపాటు అమ్మా వెంచర్ బ్రిడ్జ్ సమీపం, యెల్లమ్మ గుట్టలో సిసి రోడ్డు, రేడియో స్టేషన్ సమీపం, న్యాల్కల్ రోడ్డు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపనలుచేశారు. అలాగే ఉర్దూ గర్ల్స్ జూనియర్ కాలేజ్, మలపల్లిలో కాలేజ్ అభివృద్ధి పనులు, ధర్మపురి హిల్స్ లో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులు, హబీబ్ నగర్, బోధన్ రోడ్డులో స్టార్మ్ వాటర్ డ్రెయిన్, తీన్ కమాన్, నిజాం కాలనీ, అర్సాపల్లి ప్రాంతాలలో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాలలో నగరంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేని అభినందించారు.

# ప్రగతి పరుగులో తగ్గని పేదరికం

**అక్షర విజేత :** 78 సం" రాల స్వతంత్ర భారత్ లో కేంద్ర ప్రభుత్వం అవలంబించిన వ్యవసాయ' ఆర్థిక 'ప్రణాళిక' పారిశ్రామిక పెట్టుబడి 'ఉత్పత్తి ' మార్కెటింగ్ సమాచార ' విదేశీవర్తకం ' సాంకేతిక' పరిజ్ఞాన విధానాల వల్ల ధనికులు మరింత ధనవంతులై పేదవారు మరింత పేదరికంలోకి నెట్టి వేయబడి దేశంలో వివిధ వర్గాల ప్రజల ఆదాయాలు సంపదలు ఆర్థిక వ్యత్యాసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రపంచంలో 5 పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఇండియాను 2030 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానానికి చేరుకుంటుందని ఎస్' అండ్' పీ గ్లోబల్ రేటింగ్ సంస్థ తాజాగా ప్రకటించడం గమనార్హాం. 3.6 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో వున్న భారత దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం2046 నాటికి 8 రెట్లకు పెరుగుతుందని అనేది వినడానికి గొప్పలు చెప్పుకునే పరిస్థితిలో దేశంలో అట్టడుగు స్థాయిలో జీవిస్తున్న పేదల సంఖ్య ఆశించిన స్థాయిలో తగ్గని విచిత్ర స్థితి నెలకొనడం విచారకరం. పేదలు ఉన్న జనాభా భారత్ ఐక్యరాజ్య సమితి ఇటీవల వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం ప్రపంచ దేశాల్లో పేద ప్రజల జనాభా ఎక్కువగా భారతదేశంలోనే ఉన్నారని. ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పేదలు ఉండగా అందులో 23.4 కోట్ల మంది భారతదేశంలోనే ఉన్నారనే విషయాన్ని తమ అధ్యయనంలో వెల్లదించింది. వెలుగు చూసింది. మన ప్రగతి వెలుగుల మాటలతో మగ్గిపోతున్న జీవితాలకు అద్దం పడుతుంది .ప్రజల ఆదాయాలు జీవన ప్రమాణాలు మెరుగుదల అభివృద్ధికి సరైన కొలమాణాలు. జి' డి 'పిలో ఉన్నత స్థాయికి చేరుతున్న ఇండియా తలసరి ఆదాయం పరంగా 140 దేశాల కన్నా దిగువన ఉంది. ఆక్స్ఫామ్ నివేదిక ప్రకారం జనాభాలో ఒక శాతం చేతుల్లో40 శాతం దేశ సంపద కేంద్రీకృతమై ఉంది .ఆర్థిక ప్రగతి తో ప్రజ్వరిల్లుతున్న ఆర్థిక అసమానతలు పేదరికాన్ని రూపుమపడంలో విఫలమైనాయి. సమాజంలో ఉన్నత వర్గాల సంపద ఆదాయం పెరుగుతూ ఉంటే దిగువ శ్రేణిలో వున్న వారి పరిస్థితి నానాటికి దిగజారిపోతుంది.ఆర్థిక వ్యవస్థలో మొత్తం జాతీయ సంపద 71% జనాభాలో పై 10 శాతం కలిగి ఉన్నారు ఇండియాలో 119మంది బిలియనీర్లు వున్నారు. వీరి సంపద పది ఏళ్లలో 10 రెట్లు పెరిగింది. మనదేశంలో రోజుకు 70 మంది కొత్తగా మిలియనీర్లు అవుతున్నారు. దేశములో ఉత్పత్తి చేయబడిన73శాతం దేశములో అత్యంత ధనవంతులైన1శాతంమందికి చేరింది.670మిలియన్ పేదల సంపదలో కేవలం1 శాతం మాత్రమే పెరుగుదల సూచిస్తుంది. 5వ ఆర్థిక శక్తి భారత్ అమెరికా చైనా జపాన్ జర్మనీ తర్వాత భారత్ జిడిపి లో దూసుకుపోతూ5 వఆర్థిక శక్తిగా ఎదుగుతున్నప్పటికి ప్రజల ఆదాయాలు సంపద ఆర్థిక వ్యత్యాసాలు పెరుగుతున్నాయి. హురూన్ ఇండియా వెల్లడి ఇటీవల హునర్ ఇండియా సంస్థ దేశంలోని అత్యంత సంపన్న జాబితా విలువ చేసింది. జూలై31 నాటికి దేశములో కుబేరుల సంఖ్య 1539కి పెరిగింది. వీరి వద్ద పోగైన సంపద రూ" 159లక్షల కోట్లు . వీరి ఆస్తులు ఈ ఏడాది 46% వృద్ధి చెందాయి. దేశంలో 140 కోట్ల జనాభాలో ఆదాయ అసమానతలు సంపద అసమానతలు ఆర్థిక వ్యత్యాసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థుతులు ఇలాగే కొనసాగితే సామాజిక అశాంతికి దారితీసే ప్రమాదం వుందని సామాజిక ఆర్థిక వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. బ్రిటిష్ కాలం నాటి కంటే స్వదేశీ పాలనలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక 'ప్రణాళిక 'పారిశ్రామిక సేవల 'ఉత్పత్తి 'మార్కెటింగ్ ఉపాధి ' రవాణా ' సమాచార విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతున్నాయి. వివిధ అభివృద్ధి నివేదికల ప్రకారం పరిశీలిస్తే దేశములో1శాతం జనాభా చేతుల్లో40.01శాతం సంపద కేంద్రీకృతమై వుంది. వివిధ వర్గాల ఆదాయ సంపద అసమానతలు పెరుగుతున్నాయి. వాస్తవిక ఆదాయం క్రమంగా పెరుగుతున్నపటికి ప్రజల ఆదాయాల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం అనుసరించిన1991 ఆర్థిక సంస్కరణలే. 1991 కిముందు మన దేశ జిడిపి లో3శాతం వద్ద వృద్ధి ఆగిపోయింది. సంస్కరణల తర్వాత మన దేశ జిడిపి 6-8శాతం వృద్ధి రేటు పెరిగింది. ఈ కాలములో అతి తక్కువ శాతం జనాభాలో గరిష్ఠ సంపద పెరిగింది. ఇదే కాలములో ప్రభుత్వం ఆర్థిక అంతరాలు తగ్గించే చర్యలు తీసుకోలేదు. ఆర్థిక వ్యవస్థలో ఉపాధి రహిత ఉత్పత్తి ఉత్పాదకత పెరిగి ఆర్థిక ఆదాయ అసమానతలను తీవ్రతరం చేశాయి. దేశములో జరిగిన గణనీయమైన ప్రగతి వల్ల సుమారు 25 కోట్ల మంది కఠిన పేదరికం నుండి విముక్తి పొందారని నీతి అయోగ్ చర్చా పత్రం లో ప్రకటించడం జరిగింది. 5 శాతంకంటే తక్కువ మంది భారతీయులు పేదరికంలో ఉన్నారనినీతి ఆయోగ్ సి ఇ ఓ పేర్కొన్నారు. ఒక వైపు 81కోట్ల మంది ప్రజలకు ప్రభుత్వమే ఉచితంగా ఆహారధాన్యాల నూపంపిణి చేస్తుంది. ప్రభుత్వానికి వచ్చే రాబడి లెక్కల మీద ఆధారపడి పేదరికాన్ని లెక్కించడం సరైంది కాదు నాణ్యమైన.విధ్య వైద్యం 'ఆరోగ్యం తాగునీరు పౌష్టికాహారం మున్నగు అంశాలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయా? లేదా అంశాల్ని పరిశీలించాలి. అందుబాటులో లేని ప్రజారోగ్యం ప్రభుత్వ ఆసుపత్రులు సిబ్బంది కొరత మౌలిక వసతుల కొరత బెడ్స్ కొరత మందుల కొరతతో కుమారిల్లుతున్నాయి. పేద వర్గాల ప్రజలు కనీస వైద్య సేవలు అందుబాటులో లేక పోవడం వల్ల ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులకు ఆశ్రయించ వలసి వస్తుంది. ఖరీదైన వైద్య ఖర్చులు భరించలేక అప్పుల పాలై ఆర్థిక భారాన్ని మోయలేక ఉన్న ఆస్తులను అమ్ముకొని పేదరికంలోకి నెట్టి వేయబడుతున్నారు. లోపించిన సమతుల ఆహారం దేశములో 15బి 49 ఏళ్ల వయసులోనే స్త్రీలలో57 శాతం పురుషుల్లో 25 శాతం రక్త హీనతతో బాధపడుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే పేర్కొంది. 5ఏళ్ల లోపు పిల్లలు పౌష్టికాహార లోపంతో ఆరోగ్యపరంగా ఎదుగుదల లోపించింది. మానవ వనరుల అభివృద్ధి ఆశించిన మేరకు ప్రగతి లేదు. ఐక్యరాజ్య సమితి జనసంక్షేమానికి 17 సుస్థిరాభి వృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది చాలా లక్ష్యాల సాధనలో భారత్ వెంకుబడి వుంది. పెరుగుతున్న వినియోగ వ్యయానికి తగినట్లు ఆదాయాలు పెరుగడం లేదు.ప్రదర్శన ప్రభావానికి గురైన ప్రజలు ఎక్కువ ఖర్చులు చేస్తూ అప్పుల పాలవుతున్నారు. అనేక కుటుంబాలు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు. వ్యవసాయ రంగములో పెట్టుబడికి తగిన గిట్టుబాటు లేక రైతులు వ్యవసాయ రంగం నుండి నిష్క్రమించి పట్టణాలకు వలసలు పోతున్నారు. కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక మధ్యవర్తుల దళారీల మోసాలకు బలై ఆర్థికంగా కుదేలై ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి. గ్రామీణ ఆర్థికవ్యవస్థ పరిపుష్టికి ఆర్థిక స్వాలంభనకు ఆయువు పట్టైన చేతి వృత్తుల ఉత్పత్తులకుగిరాకీ తగ్గడం వల్ల చేతివృత్తులు కుదేలైనాయి. చేతి వృత్తులు ఆధునికీకరణకు నోచుకోక పోవడం వల్ల వీటిపై ఆధారపడి జీవించే వారు ఇతర రంగాలకు వలస వెళ్లారు. ప్రభుత్వం చేతి వృతుల ఆధునికీకరణకు అధునాతన సాంకేతికతను అందించి



శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే చేతివృత్తుల పై ఆధారపడిన వారి జీవితాలలో ఆర్థిక వెలుగులు తేవడానికి సమగ్ర కార్యాచరణ వ్యూహాలను అమలు చేయాలి. యువత నైపుణ్యాభివృద్ధి జనాభాలో 60 శాతంవున్న యువతలో చదువుకు తగిన నైపుణ్యాలు లేవు. ఉపాధి పొందే స్థితిలో లేకపోవడం వల్ల నిరుద్యోగం వారి పాలిట శాపంగా పరిణమించింది. ప్రభుత్వం విద్యార్థి దశ నుండే విద్యార్థులకు ఎర్న్ వైల్ లెర్న్ విద్యావిధానాన్ని అమలు చెయ్యాలి. చదువుకునే రోజుల్లోనే విద్యార్థుల్లో పని పట్ల శ్రద్ధ ఆసక్తి పెంచి స్వశక్తితో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకునే పరిస్థితులు సృష్టించి యువత ఉపాధిని సృష్టించే శక్తిగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించే వ్యవస్థను నిర్మాణం చెయ్యాలి. దేశములో లభించే సహజ వనరుల అభిలషణీయ వినియోగానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి. పర్యావరణ హిత పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడే పరిశ్రమల స్థాపనకు పూనుకోవాలి. పేదరికం నిరుద్యోగం ఆర్థిక అసమానతలు లింగ వివక్ష వేతన వివక్ష ప్రాంతీయ అసమానతల కట్టడి విధ్య వైద్య పోషకాహార సౌకర్యాల కల్పనలో బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించి సకాలములో వ్యయం చేసి నైపుణ్యాల వృద్ధి యువత మహిళా సాధికారిత సంక్షేమ కార్యక్రమాలకు గ్రామీణ ఉపాధి కల్పన పథకాల సమర్థ అమలు. ప్రజల జీవన ప్రమాణాలను తలసరి ఆదాయాల పెరుగుదలతో మెరుగైన మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యతలు ప్రజ్వరిల్లితేనే 2030 నాటికి భారత్ ప్రగతి వెలుగుల్లో ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ఆశిద్దాం

నేదునూరి కనకయ్య రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక కరీంనగర్ 9440245771

# మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ లో తనిఖీలు

## తనిఖీలో పాల్గొన్న నాగారం మున్సిపల్ కమిషనర్ మరియు మిక్కిలినేని మాను చౌదరి ఐఏఎస్..





**అక్షర విజేత, కీసర బోగారం :** మేడ్చల్ జిల్లా కీసర మండలం బోగారంలో తెలంగాణ బీసీ కమిషనర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్, సందర్శనలో పాల్గొన్న నాగారం మున్సిపల్ వెస్ట్‌సైడ్ భోగారంను ఈరోజు మిక్కిలినేని మనూ చౌదరి, ఐ.ఏ.ఎస్. సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మమేకమై వారి విద్యా ప్రగతి, శిక్షణా కార్యక్రమాలు, భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులు క్రమశిక్షణ, కృషి, ధైర్యంతో చదువుకుని సమాజంలో మార్పు తేవగల శక్తిగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ, నాగారం మున్సిపల్ కమిషనర్, ప్రిన్సిపాల్ మరియు బోధన సిబ్బంది పాల్గొన్నారు. సంస్థ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.చివరగా, విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, సమాన విద్యా అవకాశాలు అందించడంలో ప్రభుత్వ సంకల్పాన్ని మిక్కిలినేని మనూ చౌదరి పునరుద్ఘాటించారు.

# పొన్కల్ లో ఫైలేరియా టీ.ఏ.ఎస్ సర్వే



**అక్షరవిజేత మామడ :** జాతీయ లింఫాటిక్ ఫైలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలం లోని పొన్కల్ గ్రామంలో ""మైక్రో ఫైలేరియా ట్రాన్స్మిషన్ అసెస్మెంట్ సర్వే (టి .ఏ .ఎస్.) ""నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా 105 మందికి రక్త నమూనాలు సేకరించి పరీక్షించడం జరిగింది.ఇందులో డాక్టర్ శ్వేత , ఏఎన్ఎం భారతి , హెల్త్ అసిస్టెంట్ రవి మధుకర్ రెడ్డి ల్యాబ్ టెక్నీషియన్ విజయలక్ష్మి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# తిరుమలగిరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** తిరుమలగిరి పరిధిలోని ఫుట్‌బాల్ ప్లేగ్రౌండ్ సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు సుమారు 50%-%60 సంవత్సరాల వయస్సు గలవాడిగా, లేత ఆకు పచ్చ రంగు టీషర్ట్, నలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనను గమనించిన పోత. శిరీష్ బాబు (తండ్రి: పి. శ్రీనివాస్, వయస్సు 25) 100 నంబర్‌కు కాల్ చేయగా, తిరుమలగిరి పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సబ్ ఇన్స్పెక్టర్ డి. కరుణాకర్ మృతుడు ఇప్పటికే చనిపోయినట్లు నిర్ధారించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 040-27853594, 8712660237, 8712661259 నంబర్లకు సమాచారం అందించవలసిందిగా పోలీసులు కోరారు.

# గ్యార్మీ ఉత్సవాలకు హాజరైన ఎంపీఆర్





**అక్షర విజేత, ఉప్పల్ నాచారం :** మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండల్ నాచారం లోని ఇందిరానగర లో జరిగిన గ్యార్మీ ఉత్సవాలకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. నాచారం డివిజన్‌లోని ఇందిరనగర్ లో బుధవారం రాత్రి అంజద్,కుదుస్ ఆధ్వర్యంలో గ్యార్మీ ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు ఎంపీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత గౌడ్ ,వాసునూరిప్రకాష్ రెడ్డి గారు ,జీ కృష్ణ రెడ్డి ,మెతుకుశ్రీనివాస్ రెడ్డి ,నూతనకంటి రాజు ,మహేష్ యాదవ్ ,కృష్ణయాదవ్ ,మామిడాలసంతోష్ రెడ్డి ,నెమలిసునీల్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి ,రమేష్ గౌడ్ ,శ్రీనివాస్ రెడ్డి ,గోలి శ్రీనివాస్ రెడ్డి ,బాలరాజ్,అబ్రహాం ,నాచారంకాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు

## విద్యార్థులకు వ్యాసరచన పోటీల నిర్వహణ

## పోలీస్ కమిషనర్ వెల్లడి





**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా డ్రగ్స్ నిర్వహణ నివారణలో పోలీసుల పాత్ర – విధ్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరనే అంశాలపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మెరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవములలో భాగంగా (పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా) నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలలోని ఆసక్తి గల 6వ తరగతి నుండి డిగ్రీ లోపు గల విధ్యార్థిని, విధ్యార్థులు కు పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా "వ్యాస రచన పోటీలు" తెలుగు ఉర్దూ, ఇంగ్లీషులో భాషలలో ఉదయం నుండి సాయంత్రం 5 గంటలవరకు నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు "వ్యాస రచన పోటీలు" తెలుగు ఉర్దూ, ఇంగ్లీషులో భాషలలో ఉదయం నుండి సాయంత్రం 5 గంటలవరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగాపాల్గొన్నారని వారు తెలిపారు.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనరునుకలిసిన .సిపిఐ పార్టీ నాయకులు



**అక్షర విజేత గజ్వేల్ :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో పరిధిలో గల అసంపూర్తి లో ఉన్న రోడ్లు వర్షాలకు విపరీతంగా గుంతల మయమై నడవరాకుండా ఉండి ప్రజలకు ఇబ్బంది కరంగా మారిన రోడ్లను,బాగు చేయాలని, అలాగె వెంటనే సీసీరోడ్లను నిర్మి%శీ%చాలి. గజ్వేల్ఎడ్యుకేషన్ హబ్ డివైడర్ పైన నూతన భగత్ సింగ్ విగ్రహాము ఏర్పాటుకు పరిమిషన్ ఇవ్వాలనిక మిషనర్ ని కలిసి మాట్లాడడం జరిగింది.అలాగే ఆర్ఎన్ఆర్ కాలనీలొ వర్షాలకు వీధిలైట్లు రావడం లేదు. వీధిలైట్లను బాగు చేయాలని అలాగే అసంపూర్తిలో ఉన్న మురికి కాలువలను డ్రైనేజీ రోడ్లపై పేరుకుపోయిన చెత్తను పిచ్చి మొక్కలను తొలగించాలని కోరడం జరిగినది.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బట్టు దయానంద రెడ్డి సిపిఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ,గజ్వేల్ పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం,మండల సహాయ కార్యదర్శి కొండకింది పోచయ్య సిపిఐ పార్టీ నాయకులు వెంకట చారి.ఎండి సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీకమాసం సందర్భంగా గురు పీఠంలో ప్రత్యేక పూజలు!!



**అక్షర విజేత, శివంపేట :** శివంపేట్ మండలం గూడూరు గ్రామంలోని శ్రీ గురు పీఠం లో కార్తీక గురువారం పురస్కరించుకొని శ్రీ గురు పీఠం లోని దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం మరియు శ్రీ షిరిఢీ సాయి బాబా దేవాలయంలో నిత్యానుష్టాలు, అష్టోత్తర అర్చనలు, మధ్యాహ్నం హారతి తర్వాత శ్రీ గురు పీఠం చాటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్దగోని జిన్నారం శివ కుమార్ గౌడ్, శివంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ సమిష్టిగా అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. భక్త మహాశయులందరూ భారీ సంఖ్యలో పాల్గొని శ్రీ దత్తాత్రేయ స్వామి మరియు శ్రీ శిరిడి సాయిబాబా దేవతలను దర్శించి ఆశీస్సులు పొందడం జరిగింది.

# బస్తీలు బాగుపడాలంటే కాషాయ జెండా ఎగరాలి





**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విజయం సాధిస్తారని రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్రావు ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహమత్ నగర్ డివిజన్లో ఆయన రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీల పాలనలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని ఆయన మండిపడ్డారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని బస్తీలు బాగు పడాలంటే కాషాయ జెండా ఎగరాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. స్థానిక దేవాలయంలో పూజలు చేసిన ఆయన, కాలే పూజారి ఆశీర్వాదం తీసుకున్న అనంతరం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక బస్తీలో కలియతిరిగి బిజెపి అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటికి ప్రచారం చేసిన ఆయన స్థానిక గల్లీలలో రోడ్డు షో లో పాల్గొన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నిండాలంటే బిజెపి పార్టీ గెలవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకుడు లక్ష్మణ్, బంగారు శృతి, మహమ్మద్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డ్ నూతన సీఈఓకి నర్మద మల్లికార్జున్ శుభాకాంక్షలు



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ నూతన సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన అరవింద్ త్రివేదిని కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. తరువాత సీఈఓ తో జరిగిన సమావేశంలో నర్మద కంటోన్మెంట్ పరిధిలోని రోడ్ల దుస్థితి, డ్రైనేజ్ వ్యవస్థలో ఉన్న లోపాలు, స్ట్రీట్‌లైట్స్ సమస్యలు మరియు మౌలిక సదుపాయాల లోపాల గురించి వివరించారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన సీఈఓ అరవింద్ త్రివేది, వీలైనంత త్వరగా అన్ని పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని నర్మద మల్లికార్జున్ కి హామీ ఇచ్చారు.

# బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఐక్యత పోరాటం

బర్క కృష్ణ యాదవ్





**అక్షర విజేత షాబాద్ :** వెనుకబడిన వర్గాల హక్కుల సాధనతో పాటు రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవాలన్న దృఢసంకల్పంతో షాబాద్ మండల స్టేడియంలో కుల సంఘాల జేఏసీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారు. బర్క కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఎస్టి , మైనారిటీ వర్గాలు ఐక్యంగా లేచితేనే సమాజంలో నిజమైన ప్రజా రాజ్యం స్థాపించవచ్చని స్పష్టం చేశారు. అణగారిన వర్గాల శక్తిని రాజకీయ రూపంలో మార్చే సమయం ఇదేనని, హక్కులు ఎవ్వరూ ఇవ్వరని పోరాడి సాధించాల్సిందేనని పిలుపునిచ్చారు. అతను బీసీ సేన ద్వారా నిరుపేదల కష్టాలు, విద్యా అవకాశాల లోపాలు, సామాజిక అసమానతలపై నిరంతర పోరాటం కొనసాగిస్తూ, వెనుకబడిన వర్గాల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్నాడు. ప్రజా సమస్యల పరిష్కారానికి మాటలకే పరిమితం కాకుండా చర్యలతో ముందుకు వెళ్లే నాయకుడిగా బర్క కృష్ణ యాదవ్ గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీగా అధ్యక్షుడిగా మల్ల వెంకటేష్, ఉపాధ్యక్షులుగా మిద్దెల రామచంద్ర యాదవ్, గడిల విఠలయ్య, ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల రామచందర్, కార్యదర్శులుగా ఎం.డి. ఇక్బాల్, మాదూరి రవీందర్ చారీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు మలగల్ల మల్లేష్ గౌతమ్, ప్రజా సంఘాల నాయకులు జగ్గంపేట ఆంజనేయులు, బీసీ సేన షాబాద్ మండల అధ్యక్షులు దయాకర్ చారి, మైనారిటీ నాయకులు అబ్బాస్, రమేష్, దామర్లపల్లి మల్లేష్, నాయకులు హనుమంతు, అంజి, శేఖర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరంపార్వతి భాస్కర్





**అక్షర విజేత షాబాద్ :** గ్రామాల్లో నిరుపేదలకు వైద్య సహాయం అందించేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు, ఫార్మసీ అసోసియేషన్ మెంబర్ పార్వతి భాస్కర్ కృషి చేస్తున్నారు. నాగర్ కుంట గ్రామంలో మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ మరియు బాలాజీ మెడికల్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంలోని 60 మందికి పైగా వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. పార్వతి భాస్కర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ పామెన భీమ్ భరత్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్థుల ఆరోగ్య సమస్యలకు అండగా నిలబడతామని, మౌలిక సదుపాయాలను సమగ్రంగా అందించేందుకు ప్రభుత్వ సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కుంట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పార్వతి విజయ్, నాయకులు హైమద్, వైద్య సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అధికారంలోకి వచ్చారు.. హామీలన్నీ మరిచారు..

6 గ్యారంటీ లపై మాట తప్పిన కాంగ్రెస్..

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిందే..

మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్

షాద్ నగర్ చేరుకున్న లోక్ దళ్ పార్టీ రథయాత్ర..

పట్టణ కూడలిపై అంబేద్కర్ కు నివాళి..

షాద్ నగర్ పట్టణంలో రోడ్ షో..



**అక్షర విజేత షాద్నగర్ :** మీరు ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మారు.. అధికారాన్ని మీ చేతికి ఇచ్చారు.. కానీ హామీలను తీర్చాల్సిన మీరు అధికారంతో కాలక్షేపం చేస్తున్నారు.. ప్రజల సమస్యలు ఎప్పుడు తీరుస్తారు.. రిజర్వేషన్లు ఎప్పుడు కల్పిస్తారు.. ఆరు గ్యారెంటీల పరిస్థితి ఏమిటి..? అంటూ మాజీ ఎమ్మెల్సీ, లోక్ దళ్ పార్టీ నేత కపిలవాయి దిలీప్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ చేపట్టిన రథయాత్ర గురువారం సాయంత్రం పట్టణానికి చేరుతుంది. ఈ సందర్భంగా పట్టణ కూడలిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఆయన అనంతరం రోడ్ షో చేపట్టారు. కాంగ్రెస్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**హామీల అమలు ఎప్పుడు..**

**కపిలవాయి దిలీప్ కుమార్..**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తుందో చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ ప్రశ్నించారు. రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కచ్చితంగా కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీసీల కోసం ప్రత్యేకంగా సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలంటే మెంట్ చేశారు. రాష్ట్రంలో 28 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని వారి అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇప్పించాలని అన్నారు. నిరుద్యోగుల సొంతంగా పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని, రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగుల రుణాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల భృతిని తక్షణమే బకాయిలతో సహా చెల్లించాలన్నారు. రైతులకు పరిహారాల చెల్లింపు, మద్దతు ధర, రైతు భీమా వంటి అంశాలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ చెల్లింపు తో పాటు ఆరు గ్యారెంటీ లపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి లబ్ధిదారులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మల్లేష్ ముద్దం తదితరులు పాల్గొన్నారు..

# పనిగంటలు దేశగతిని మారుస్తాయా?



ఒకరేమో వారానికి 70 గంటలు పనిచేయమంటారు. మరొకరు ఇంకో అడుగు ముందుకేసి 90 గంటలు పనిచేయమంటారు. దేశం అభివృద్ధి పథంలో పయనించేందుకు ఉన్న ఒకే ఒక్క మంత్రం ఇదేనంటారు. కానీ, వారానికి 48 గంటలు పనిచేస్తూనే ప్రపంచం నివ్వెరపోయే ప్రగతి సాధించామన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. అంతేకాదు, రోజంతా ఆఫీసుల్లోనే ఉండి రోబోల్లా పనిచేస్తూ పోతే దేశం అభివృద్ధి సంగతి దేవుడెరుగు, తలెత్తే మానసిక, ఆరోగ్య సమస్యల సంగతేంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుందన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేస్తే దేశం గొప్ప పురోగతి సాధిస్తుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి గతంలో ప్రకటించి దేశవ్యాప్త చర్చకు కారణమయ్యారు. తాజాగా, ఎల్అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్ ఒకడుగు ముందుకు వేసి వారానికి 90 గంటలు పనిచేయాలని సెలవిచ్చి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశారు. నిజానికి ఫ్యాక్టరీల చట్టం 1948 ప్రకారం వారానికి 48 గంటలు మించి పనిచేయకూడదు. ఈ చట్టాలను అనుసరిస్తూనే 75 ఏండ్లలో దేశం అనూహ్య ప్రగతి సాధించింది. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు కార్పొరేట్ దిగ్గజాలు భారత శ్రామికులను వారానికి 70 నుంచి 90 గంటలు పనిచేయాలని సూచించడం ఎంతమాత్రం హేతుబద్ధంగా, ఆచరణాత్మకంగా కనిపించడం లేదు. సుబ్రహ్మణ్యన్ చెప్తున్న దాని ప్రకారం వారానికి 90 గంటలు పనిచేయడమంటే రోజుకు 12 గంటలకు పైగా శ్రమపడాల్సి ఉంటుంది. నారాయణమూర్తి 70 గంటల ప్రతిపాదనను ఎంతోమంది విమర్శించారు. ఇప్పుడు సుబ్రహ్మణ్యన్ అంతకుమించి విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. సోషల్ మీడియా ఆయనపై జోక్స్, మీమ్స్‌తో విరుచుకుపడింది. గతంలో ఎలాన్ మస్క్, జాక్ మా కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసి విమర్శల పాలయ్యారు. 48 గంటల పని విధానం దేశంలో కొనసాగుతున్నప్పటికీ నగర, పట్టణ ప్రాంతాల్లోని కంపెనీ ఉద్యోగులు తగిన వేతనం పొందకుండానే పరిమితికి మించి పనిచేస్తున్న మాట వాస్తవం. ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ దేశాన్ని ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి తీసుకెళ్లారు. సాధారణ పనిదినాల అమలు చట్టాలు వర్తించని రీతిలో 88 శాతం మంది భారత ఉద్యోగులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఇండీడ్ అనే గ్లోబల్ సంస్థ సర్వేలో తేలింది. ప్రభుత్వ సెలవు దినాలు, సిక్ లీవ్‌లో ఉన్నప్పుడు కూడా కంపెనీ యాజమాన్యాలు తమతో పనిచేయించుకుంటున్నాయని 85 శాతం మంది ఉద్యోగులు చెప్పినట్టు సర్వే పేర్కొన్నది. విధులు ముగిశాక యాజమాన్యాలు పంపే సందేశాలకు స్పందించకుంటే ప్రమోషన్లు వంటి ప్రయోజనాలను ఎక్కడ కోల్పోతామోనన్న భయం ఉద్యోగులను వెంటాడుతూ ఉంటుంది. కొన్ని రంగాల్లో ఉద్యోగులు ఇప్పటికే పనికి సంబంధించి కంపెనీ ఆదేశాలు పాటించేందుకు రోజంతా అందుబాటులో ఉంటున్నారు. కొందరు అదనపు జీతభత్యాలు పొందకుండానే నిర్దేశిత పని గంటలకు మించి శ్రమపడుతున్నారు. కానీ, పదిహేను అగ్రశ్రేణి గ్లోబల్ టెక్ కంపెనీల ఉద్యోగులు వారానికి 50 గంటల లోపే పనిచేస్తుండటం గమనార్హం. 'ఓవర్‌టైమ్' కారణంగా అత్యధిక మరణాలు సంభవించే దేశాల్లో ఇండియా ముందు వరుసలో ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్త సర్వేలో వెల్లడైంది. సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో ఎల్అండ్‌టీ స్పందించింది. అసాధారణ ఫలితాలు సాధించేందుకు అసాధారణ ప్రయత్నాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడానికి మాత్రమే సుబ్రహ్మణ్యన్ ఆ వ్యాఖ్యలు చేశారని చెప్పుకొచ్చింది. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియాను ముందుకు తీసుకెళ్లడానికి మరింత అంకితభావంతో పనిచేయాలనేదే ఎల్ అండ్ టీ లక్ష్యమని, కంపెనీ ఉద్దేశాన్ని, విస్తృత లక్ష్యాలను చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇక నారాయణమూర్తి వారానికి 70 గంటల పని విధానం ప్రతిపాదనపై ప్రముఖ ఐటీ కంపెనీ జోహో కార్పొరేషన్ సీఈవో శ్రీధర్ వెంబు తీవ్రంగానే స్పందించారు. 'జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, చైనాలు మితిమీరిన శ్రమతో అభివృద్ధి సాధించాయి. ఇవి తమ ప్రజలను శిక్షించే స్థాయిలో పనిభారం మోపాయి. ఆఫీసుల్లో, ఫ్యాక్టరీల్లో రెక్కలుముక్కలు చేసుకుని జనం పనిచేసిన కారణంగా ఈ దేశాల్లో జనాభా బాగా తగ్గిపోతున్నది. ఫలితంగా అక్కడి ప్రభుత్వాలే ప్రజలను ఇంకా ఎక్కువ పిల్లలను కనండి అని వేడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని విరుచుకుపడ్డారు. ఎక్కువ గంటలు కష్టపడి పనిచేస్తూ అభివృద్ధి సాధించిన దేశాల్లోని ప్రజలు వృద్ధాప్యంలో ఒంటరిగా బతకాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. కంపెనీల రథసారథులు కొద్దిమంది ఎక్కువ గంటలు పనిచేస్తే చాలని, ఉద్యోగులంతా ఒళ్లు హూనం చేసుకుని శ్రమిస్తే వ్యతిరేక ఫలితాలు తప్పవని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక ప్రగతిలో ఇండియాకు చైనా ఎన్నటికీ ఆదర్శం కాకూడదని వెంబు చేసిన హెచ్చరిక హేతుబద్ధంగా కనిపిస్తున్నది. మూర్తి, సుబ్రహ్మణ్యన్ చెప్పినట్టు రోజుకు అందరూ సగటున పది గంటలు పనిచేస్తే ఆయుష్షు కూడా తగ్గిపోయే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. అధిక పనిగంటల వల్ల మానసిక, శారీరక ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడు సామాజిక జీవితం అంటూ ఏమీ మిగలదన్నది అత్యధికుల మాట. భారత శీఘ్ర ఆర్థిక ప్రగతికి ఈ ఇద్దరు దక్షిణాది కార్పొరేట్ దిగ్గజాలు ఒకే తీరున సూచించిన పరిష్కార మార్గాలను పరిశీలిస్తే ఇండియాలో 1970, 80లలో ప్రచారంలో ఉన్న ఒక వింత పుక్కిటి పురాణం పాత తరం వారికి గుర్తుకొస్తున్నది. అప్పట్లో జపాన్ అనేక రంగాల్లో అమెరికా, ఐరోపా దేశాలను తలదన్నే రీతిలో ఆర్థికాభివృద్ధి సాధించడం మొదలైంది. దానికి కారణం జపాన్‌లో కార్మికులకు కంపెనీల యాజమాన్యాలపై అసంతృప్తి, ఆగ్రహం వస్తే పని బంద్ చేసి సమ్మెలకు దిగకుండా ఫ్యాక్టరీల్లో ఎక్కువ గంటలు పని చేసేవారనే ప్రచారం దేశవ్యాప్తంగా నడిచింది.

# ఇప్పటికీ మీరే మా నమ్మకం



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అన్న విషయం చాలామందికి తెలియదని ఇటీవలి ఉదంతాలు చెప్తున్నాయి. స్వతహాగానే ఇది రేవంత్‌రెడ్డికి కోపం తెప్పించింది. అదే సమయంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి ఏడాది దాటినా కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రతిక్షణం కేసీఆర్, కేటీఆర్‌ను గుర్తుచేస్తున్నాయి. కేరళలో గత నవంబర్‌లో జరిగిన 'టీఐఈ కేరళ 2024'కు హాజరైన కేటీఆర్‌ను మంత్రిగా పేర్కొంటూ వేదికపై ఆహ్వానించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తానిప్పుడు మంత్రిని కాదని కేటీఆర్ చెప్పినా.. తమకు అలాగే గుర్తున్నారని వారు చెప్పడం గమనార్హం. ఈ రెండు ఘటనలను బట్టి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాల్సింది చాలానే ఉందన్నది నిపుణుల మాట. 'స్టిల్ వియ్ బిలీవ్ ఇన్ యూ సర్'.. ఈ మాట నేను అంటున్నది కాదు. ఇటీవల కేరళ లోని కొచ్చిలో టీఐఈ (ది ఇండస్ ఆంత్రప్రెన్యూర్స్) అనే అంతర్జాతీయస్థాయి సంస్థ ఏర్పాటుచేసిన ప్రముఖుల సమావేశంలో వ్యాఖ్యాత కేటీఆర్‌ను వేదిక పైకి ఆహ్వానిస్తూ తెలంగాణ ఐటీ పరిశ్రమలశాఖ మంత్రిగా సంబోధించారు. 'ఇప్పుడు కాదు' అని కేటీఆర్ సవరించిన సందర్భంలో వ్యాఖ్యాత మరో మాట అన్నారు. 'ఇంకా మేము మిమ్మల్ని మంత్రి గానే భావిస్తున్నాం. విశ్వసిస్తున్నాం' అని ఆ మాటలకు అర్థం. పారిశ్రామిక ఐటీ రంగ నిపుణులపై జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కేటీఆర్ ప్రభావం ఎంత ఉందో తెలుసుకోవడానికి ఆ వ్యాఖ్యాత మాటలే తార్కాణం. స్వరాష్ట్రంలో కేసీఆర్ సారథ్యంలో ఐటీ పురపాలక పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ నేతృత్వంలో హైదరాబాద్ సాధించిన అభివృద్ధిని చూసిన వారు ఎవరైనా నిజాయతీగా ఆ మాట అని తీరాల్సిందే. కేటీఆర్ మంత్రి పదవి పోయి, కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇంకా కేటీఆర్‌ను మంత్రిగా సంబోధించడం, ముఖ్యమంత్రి పేరును మర్చిపోవడం వంటి సంఘటనలు కాకతాళీయమే అయినప్పటికీ ప్రజలపై వారి ముద్ర ఏ స్థాయిలో ఉందన్నది మాత్రం వెల్లడవుతున్నది. హైదరాబాద్ పేరు ప్రతిష్ఠలు ప్రపంచం నలుదిశలా వ్యాపించేలా కేటీఆర్ చేపట్టిన కార్యక్రమమే 'ఫార్ములా ఈ' రేస్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మహానగరాలు పోటీ పడినప్పటికీ ఈ రేసును హైదరాబాద్‌కు రప్పించడంలో కేటీఆర్ వ్యవహార దక్షత ప్రదర్శించి విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం 'ఫార్ములా ఈ' రేస్ వల్ల హైదరాబాద్ ప్రతిష్ఠ పెరిగిందని పేర్కొనడం గమనార్హం. 'ఫార్ములా ఈ' రేస్ వివాదం ముదిరి పాకానపడటం రాష్ట్ర భవిష్యత్తుకు క్షేమకరం కాదని మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. 'ఫార్ములా ఈ' రేస్ పరమార్థం గ్రహించి రేవంత్ ప్రభుత్వం దానిని కొనసాగిస్తే బాగుండేది. పైగా సాధించి తెచ్చిన కేటీఆర్ మీద అభియోగాలు మోపింది. అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నది. కేసీఆర్ మీద కోపం ఉంటే ఎన్నికల్లో, రాజకీయాల్లో తేల్చుకోవాలి. కానీ, ప్రజలకు, ప్రాంతానికి మేలు చేసే పథకాలను, కార్యక్రమాలను, ప్రాజెక్టులను ఏ ప్రభుత్వానివైనా కొనసాగించాలి తప్ప నీరు కార్చడం న్యాయం కాదంటున్న ప్రజల వేదన అరణ్య రోదనగా మిగిలిపోతున్నది. వివాదాలు, భయాలు సృష్టిస్తే పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయి అసలుకే మోసం వస్తుందన్న నిపుణుల హితవచనాలు ప్రభుత్వం చెవికి ఎక్కడం లేదు. ఉద్యమ సమయంలో నాటి సమైక్యవాది లగడపాటి రాజగోపాల్ ఓ సందర్భంలో కరుడుగట్టిన తెలంగాణ ఉద్యమకారులు సైతం కన్నీరు పెట్టుకునే రోజు వస్తుందని శాపనార్థాలు పెట్టారు. రెండు జర్మన్ దేశాలు కలిసినట్టుగా విడిపోయిన తెలుగు రాష్ట్రాలు తిరిగి కలిసే అవకాశం ఉందని కొందరు అంచనాలు వేశారు. కర్నూలుకు చెందిన అప్పటి ఎంపీ హైదరాబాదులో సీమాంధ్రులకు రక్షణ లేదని, తుపాకులు ఇవ్వాలని అడిగాడు. కేంద్రపాలిత ప్రాంతంగా హైదరాబాద్ అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. మొత్తంగా తెలంగాణను ఒక విఫల రాష్ట్రంగా, వికల రాష్ట్రంగా చూపించడానికి, హైదరాబాద్‌ను తెలంగాణకు కాకుండా చేయడానికి స్వరాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలో వ్యతిరేక శక్తులు చేయని ప్రయత్నం అంటూ లేదు. ఓటుకు నోటు ఆ కుతంత్రాల్లో భాగమే. ఇప్పుడు ఆ కుట్రలు వివిధ రూపాల్లో మళ్లీ మొలకెత్తుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేసీఆర్ పరిపాలన దక్షత, కేటీఆర్ కార్యశీలత వల్ల హైదరాబాదులో స్థిరపడ్డ ఇతర రాష్ట్రాల ప్రజలు, స్థానికులు కేసీఆర్ వైపు వచ్చి చేరారు. పిల్లకోడిని గద్దలు తన్నుకుపోకుండా తల్లికోడి కాపాడుకున్నట్టు ప్రత్యర్థుల కుట్రలను ఎక్కడికక్కడ తిప్పికొడుతూ కేసీఆర్ హైదరాబాద్‌ను కాపాడుకున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 సీట్లలో సాధించినవి కేవలం 3 కాగా, 2015 గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకంగా 150 సీట్లకు గాను 99 సాధించింది. హైదరాబాద్ ప్రజలలో వచ్చిన మార్పుకు అది తొలి సంకేతం. గ్రేటర్ చరిత్రలో ఏ పార్టీ ఈ స్థాయిలో ఏకపక్ష విజయం సాధించలేదు. ప్రజలు అందించిన స్ఫూర్తి, సహకారంతో హైదరాబాద్ అభివృద్ధిని పరుగులు పెట్టించడంలో కేటీఆర్ వందకు వంద మార్కులు కొట్టేశారు. 2009లో తొలిసారిగా అసెంబ్లీ బరిలో దిగినప్పుడు కేటీఆర్ ఉద్యమకారుడే కానీ రాజకీయాలకు కొత్త. పైగా ఆ ఎన్నికల నాటికి సిరిసిల్ల నియోజకవర్గం టీఆర్ఎస్(బీఆర్ఎస్)కు వడ్డించిన విస్తరి కాదు. అంతకుముందు అక్కడ గెలిచిన చరిత్రా లేదు. అయినా సిరిసిల్ల బరిలో దిగి నాటి నుంచి వరుసగా ఐదుసార్లు విజయం సాధిస్తూ వస్తున్నారు. 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి ప్రచార బాధ్యతలు నిర్వహిస్తూ సొంత నియోజకవర్గానికి ఒకటికి రెండుసార్లు వెళ్లినా సిరిసిల్ల ప్రజలు అర్థం చేసుకొని అక్కున చేర్చుకొని ఆదరించారు. తెలంగాణ ఉద్యమంలో అందరితోపాటు కేటీఆర్ కేసులు ఎదుర్కొన్నారు. కేటీఆర్‌కు ఉద్యమ నేపథ్యం ఉంది. ఉన్నత చదువుల జ్ఞానం ఉంది. మంత్రిగా ప్రపంచస్థాయి గుర్తింపు ఉంది. ఐటీ పారిశ్రామిక రంగాల్లో కేటీఆర్ సాధించిన విజయాలతో ప్రస్తుత ప్రభుత్వ పనితీరును, వైఫల్యాలను పోల్చి చూసుకుంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇక ఆయా రంగాల్లో కేటీఆర్ ప్రసంగాలను ప్రస్తుత ప్రభుత్వ అధినేతల ప్రసంగాలను పక్కపక్కనే ఉంచి సోషల్ మీడియా ఓ ఆటాడుకుంటున్నది. కేటీఆర్ ఎక్కడికక్కడ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి నిలదీసి ప్రశ్నిస్తున్నందుకు సహించలేక ఎటూ పాలు పోక మాంత్రికుల వేషాలు, మాయోపాయాలు, ఆంక్షలు, అభియోగాలకు తెగిస్తున్నారు. మొన్న ఏసీబీ కార్యాలయం నుంచి తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని మరో కొత్త కేసు పెట్టారు. ఇక ఫార్ములా కేసు వ్యవహారం న్యాయస్థానం దాకా వెళ్లింది. ఏం జరుగుతుందో కాలం నిర్ణయిస్తుంది. కాగా, కేటీఆర్‌ను ఉద్దేశించి ఆ కేరళలో అన్న మాటలు తెలంగాణలో పదేపదే ప్రతిధ్వనిస్తున్నాయి. 'స్టిల్ వియ్ బిలీవ్ ఇన్ యూ సర్'. కేటీఆర్‌కు ఉద్యమ నేపథ్యం ఉంది. ఉన్నత చదువుల జ్ఞానం ఉంది. మంత్రిగా ప్రపంచస్థాయి గుర్తింపు ఉంది. ఐటీ పారిశ్రామిక రంగాల్లో కేటీఆర్ సాధించిన విజయాలతో ప్రస్తుత ప్రభుత్వ పనితీరును, వైఫల్యాలను పోల్చి చూసుకుంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

# డ్రాగన్ ఫ్రూట్ తింటే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా ఇవి తెలిస్తే వెంటనే తింటారు



చూసేందుకు పింక్ రంగులో ఎంతో ఆకర్షణీయంగా మనకు డ్రాగన్ ఫ్రూట్ పండ్లు కనిపిస్తాయి. వీటినే పిటాయా అని కూడా పిలుస్తారు. డ్రాగన్ ఫ్రూట్స్ మనకు ఇప్పుడు ఎక్కడ చూసినా అందుబాటులో ఉంటున్నాయి. కేవలం చైనాకు మాత్రమే పరిమితం అయిన ఈ పండును ప్రస్తుతం మన దేశంలోనూ సాగు చేస్తున్నారు. అందువల్ల మనకు డ్రాగన్ ఫ్రూట్స్ విరివిగా లభిస్తున్నాయి. ఇక సీజన్ కావడంతో ప్రస్తుతం మనకు రహదారుల పక్కన డ్రాగన్ ఫ్రూట్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇవి పైకి పింక్ రంగులో, లోపల తెలుపు రంగులో ఉంటాయి. తింటే రుచి కాస్త చప్పగా, వగరుగా ఉంటుంది. అయితే డ్రాగన్ ఫ్రూట్ పండ్లను నిజంగా మనకు లభించిన వరం అనే చెప్పవచ్చు. ఈ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. డ్రాగన్ ఫ్రూట్‌ను తింటే మనకు అనేక పోషకాలు లభిస్తాయి. దీంతో ఆరోగ్యంగా ఉండవచ్చు.

**ప్రాణాంతక వ్యాధులు రావు..**

డ్రాగన్ ఫ్రూట్‌లో మన శరీరానికి కావల్సిన అనేకే విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు కూడా వీటిల్లో అధికంగానే ఉంటాయి. ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇవన్నీ మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. వ్యాధులు రాకుండా రక్షిస్తాయి. డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల బీటా సయనిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. అలాగే ఈ పండ్లలో ఫ్లేవనాయిడ్స్, విటమిన్ సి కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో వాపులు తగ్గుతాయి. ఈ సమ్మేళనాలు క్యాన్సర్, గుండె జబ్బులు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా మనల్ని రక్షిస్తాయి. అందువల్ల డ్రాగన్ ఫ్రూట్స్‌ను తింటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు.


**అధిక బరువు, షుగర్‌కు చెక్..**

డ్రాగన్ ఫ్రూట్‌లో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు ఎంతగానో సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్‌ను రోజూ తినడం వల్ల బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. అలాగే అధ్యయనాలు చెబుతున్న ప్రకారం డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. ఫలితంగా షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్‌ను తింటే షుగర్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. దీంతో ఇతర అవయవాల ఆరోగ్యం దెబ్బ తినకుండా ఉంటుంది.

**గుండె ఆరోగ్యానికి..**

డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల శరీరం కొల్లాజెన్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మం సాగే గుణాన్ని పెంచుతుంది. దీంతో చర్మంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని అతినీలలోహిత కిరణాలు, కాలుష్యం బారి నుంచి రక్షిస్తాయి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల గుండె పనితీరు మెరుగు పడుతుంది. ఈ పండ్లలో ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను అదుపులో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. అలాగే గ్యాస్, అసిడిటీ, అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కనుక వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి.


# ఊరికో అధికారి మళ్లెందుకు?



పేదల భూములను కాపాడటం కోసం మునుపెన్నడూ లేనివిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ ప్రక్షాళన చేసింది. అందుకోసం 'ధరణి' పోర్టల్‌ను తీసుకువచ్చింది. కానీ, ధరణిలో కొన్ని లోపాలున్నాయని, వాటిని సరిచేసి 'భూ భారతి' పేరిట సరికొత్త పోర్టల్‌ను తీసుకొస్తున్నామని కాంగ్రెస్ పాలకులు నింగికి నిచ్చెనలు వేసే మాటలు చెప్తున్నారు. అధికార పార్టీ నేతలు చెప్తున్నట్టు అన్ని భూ సమస్యలకు పరిష్కారం ఉండే విధంగా టెక్నాలజీని అభివృద్ధి చేస్తే మరి 'ఊరికో అధికారి మళ్లెందుకు?' అన్న ప్రశ్న సామాన్య ప్రజల్లో తలెత్తుతున్నది. ఊరికో అధికారి వల్ల గ్రామాల్లో, మండల కేంద్రాల్లో గతంలో పేద రైతులు తిప్పలు పడేవారు. తమ భూములను తమ పేరు మీదికి మార్చుకోవాలన్నా, వారసత్వ బదిలీ జరగాలన్నా, భూ రికార్డులో తప్పులను సరిచేయాలన్నా గ్రామ పరిధిలో ఉండే రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అవసరమైతే వారిని ప్రసన్నం చేసుకునేందుకు ముడుపులు కూడా ముట్టజెప్పాల్సి వచ్చేది. అట్లయితేనే పనులు పూర్తయ్యే పరిస్థితి నాడు ఉండేది. అందుకే, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేసి, సదరు సిబ్బందిని ఇతర విభాగాల్లో సర్దుబాటు చేసింది. బీఆర్ఎస్ సర్కార్ చేపట్టిన చర్యల కారణంగా భూ సమస్యల పరిష్కారం కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. తద్వారా ఎలాంటి పైరవీలు లేకుండానే మండల కార్యాలయాల్లో సాఫ్‌సీదా పనులు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కానీ, మళ్లీ ఇప్పుడు నాటి పాత రోజులను తలపించేలా అధికార కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపడుతున్నది. ఉన్నపళంగా రాష్ట్రంలో గ్రామానికో రెవెన్యూ అధికారిని మళ్లీ నియమిస్తామని, వారి ద్వారా భూ సమస్యలు పరిష్కారమయ్యేలా చేస్తామని చెప్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ సమస్యల పరిష్కారం దేవుడెరుగు.. మళ్లీ పైరవీల కాలం వస్తే రైతన్నల పరిస్థితి ఏమిటి? గ్రామస్థాయిలో ప్రతేక అధికారులు లేకపోయినా భూముల పట్టాలు, భూ సంబంధిత అంశాలు, రైతుల కార్యక్రమాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించింది. మరి ఇప్పుడు అధికార పార్టీ గ్రామానికో అధికారిని నియమించి ఎవరికి లబ్ధి చేకూర్చాలని ఆశిస్తున్నది? ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేయకుండా ఇలాంటి నిరూపయోగ పనులు చేయడం సబబు కాదు. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక నిర్ణయమే

# సిలబస్ మారొచ్చు.. కానీ చరిత్ర మారదు!

తెలుగు సమాజానికి ఉజ్వలమైన చరిత్ర ఉన్నది. దేశవిముక్తి ఉద్యమాలు.. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటాలు తెలంగాణ నేల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. అయితే, రాజుల కాలం నుంచి నేటి ప్రజాస్వామ్య కాలం వరకు తిరుగుబాట్లపై అణచివేత మాత్రం అలాగే కొనసాగుతోంది. ప్రతి తిరుగుబాటుపైన కాలాన్ని బట్టి, అక్కడున్న వ్యవస్థలను బట్టి రూపం మార్చుకుంటూ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రాజ్యాధికారాన్ని ధిక్కరించి మాట్లాడినవాళ్లంతా ఏదో ఒక రూపంలో దాడులకు గురయ్యారు. నిర్బంధాలను ఎదుర్కొన్నారు. అసువులుబాసారు. వీరతెలంగాణ సాయుధ పోరాటంలో 4 వేల మంది నేలకొరిగారు. స్వాతంత్ర్యానంతరం రాజ్యానికి, నక్సలైట్లకు మధ్య జరిగిన పోరాటంలో వేలమంది పోలీసులు, నక్సలైట్లు చనిపోయారు. ఈ ఉద్యమ ప్రవాహంలో సాహిత్య, సాంస్కృతిక సంస్థలు వెలువరించిన కావ్యాలపై, కవితలపై, పాటలపై, మాటలపై, అడుగులపై, నడకలపై, నడతలపై, కాలిగజ్జెలపై, గొంగళ్లపై, ప్రజాకంఠాలపైన నిషేధాలు విధించారు. నిషేధ సాహిత్యంపై విశ్వవిద్యాలయాలే పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టాలిచ్చాయి. అది శ్రీకాకుళం గిరిజన రైతాంత పోరాటమైనా, నక్సల్‌బరీ వసంత మేఘ గర్జనతో ఉత్తర తెలంగాణ ఎరుపెక్కినా ఆయా కాలాల్లో వచ్చిన సాహిత్యంపై నిషేధాలు విధించారు. ఇది రాజ్యస్వభావం. దీనికి ఆశ్చర్యపోనక్కర్లేదు. నిషేధాలు ఎక్కువగా చేసే ప్రభుత్వాలు నిరంకుశ సర్కార్లుగా చరిత్రలో నిలిచిపోతాయి. అవి ఎమర్జెన్సీ చీకటి రోజులు కావచ్చు.. 1970-1975 వరకు తెలంగాణ జిల్లాల్లో కొనసాగిన అప్రకటిత చీకటి రోజులు కావచ్చు. రాజ్యానికి కోపం వస్తే ఎన్‌కౌంటర్లతోనే పరిమితమైపోదు. అది సాహిత్యాన్ని కూడా నిషేధిస్తుంది. ఆట, పాట, మాటను కూడా నిషేధిస్తుంది. రాజ్యం కన్నెర్రజేస్తే వీరుల స్తూపాలను కూడా నేలరాలుస్తుంది. రాజ్యానికి అవసరం వస్తే అమరుల స్తూపాలకు మొక్కుతుంది. అందుకు పార్టీల పేరును ఉటంకించాల్సిన అవసరం లేదు. అందరికీ తెలిసినవే. 'ఇందిరమ్మ సోషలిజం ఎందాకొచ్చిందిరో, అది ఇంద్రవెల్లిలోన వంద మందిని మింగిందిరో', 'ఇంద్రవెల్లి కదిలింది పోరుబాట సాగింది.. పోరాటం ఆపకుండా ముమ్మందుకు సాగింది' అన్న పాటలు తెలంగాణ నేలకు సుపరిచితాలే. ఎవరి పాలనలో, ఏ రాజ్యం ఏలుబడిలో వీరుల నెత్తురు నేలచింది ఇంద్రవెల్లి స్తూపం అయ్యిందో.. అదే రాజ్యం కొన్ని దశాబ్దాల తర్వాత అదే స్తూపానికి మొక్కి ఆ అమరుల వీరత్వాన్ని చాటి చెప్పడం కూడా తెలంగాణ నేల చూసింది. విప్లవ రచనలపై నిషేధం వాయిదాల పద్ధతిలో నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. అది ఆగేది కాదు. ప్రతిఘటన పోరాటాలపై, ఉద్యమాలపై ప్రభుత్వ దాడులు, ఘర్షణలు సహజం. అది వర్గాల మధ్య వర్గపోరాటంగా కొనసాగుతూ ఉంటుంది. అధికార రాజముద్రల మధ్య కూడా పోరాటం అదే రీతిలో కొనసాగుతూ ఉంటుంది. అది ఒక ప్రభుత్వంపై మరో ప్రభుత్వం దశల్ని బట్టి స్థాయిల్ని బట్టి ఉంటుంది. అది విమర్శల పర్వం కావచ్చు, దాడుల పర్వం కావచ్చు, ఒకరిపై ఒకరు ఆ ఘర్షణల పరంపరను వర్తమాన సంఘర్షణగానూ మార్చవచ్చు. గత ప్రభుత్వం చేసిన పనుల కంటే తాము గద్దెనెక్కినాక చేసే పనులు మరింత గొప్పగా ఉండాలని ప్రభుత్వాలు పాలనలో పోటీ పడటం సహజం. అది ఆరోగ్యకరమైన స్థితికి చిహ్నమే. కానీ, ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్నదేమిటంటే అనారోగ్య రాజకీయ వాతావరణం. అది రాష్ట్రమంతటా భారీ వ్యాధిగా మారిపోయింది. అది ముదిరి ఎక్కడిదాకా వచ్చిందంటే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన తెలంగాణ తల్లి విగ్రహం మార్పు దాకా. ఇప్పుడు తెలంగాణలో విగ్రహాల యుద్ధం నడుస్తోంది. మలిదశ తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ఈ విగ్రహ తల్లుల చర్చ లెగిసింది. అప్పుడు తెలుగు తల్లి, తెలంగాణ తల్లి విగ్రహాల మధ్య భారీగా చర్చ జరిగింది. ఆ మలిదశ తెలంగాణ ఉద్యమం తనకు తానుగా సృష్టించుకున్న తెలంగాణ తల్లి విగ్రహం అది. కవులు, కళాకారులు, శిల్పులతో లోతుగా చర్చించి ఉద్యమ బిడ్డలు తమ ఉద్యమతల్లి రూపాన్ని ప్రతిష్ఠించుకున్నారు. బతుకమ్మలు, బోనాలు, వంటావార్పులు, జేఏసీలు, ధూంధాంలలో ఆ ఉద్యమతల్లి రూపాన్ని స్ఫూర్తిగా తీసుకుని అనేక ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు ముందుకుసాగాయి. రాజకీయ ప్రక్రియతో ఉద్యమించిన ఉద్యమపార్టీ టీఆర్ఎస్ ఆ తెలంగాణ తల్లి విగ్రహాలను వందల, వేల గ్రామాల్లో ఉద్యమకాలంలోనే ప్రతిష్ఠించింది. నాటి వలసాధిపత్య ప్రభుత్వం కూడా ఉద్యమ తల్లి విగ్రహంపై ఆంక్షలు విధించలేకపోయింది. మలిదశ ఉద్యమ గెలుపుతో స్వరాష్ట్రం అవతరించాక అమరుల స్వర్గధామాన్ని తెలంగాణ సచివాలయం ఎదుటే నిర్మించుకున్నాం. ఆ అమరజ్యోతిలో తెలంగాణ తల్లి రూపాన్ని కూడా ప్రతిష్ఠించుకున్నాం. కానీ, 2023 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం తెలంగాణ తల్లి విగ్రహం రూపుమార్చి కొత్త విగ్రహాన్ని సచివాలయంలో ప్రతిష్ఠించింది. తాము రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహమే అధికారిక తెలంగాణ తల్లి అని జీవో కూడా విడుదల చేసింది. ఇప్పటిదాకా పుస్తకాలపై నిషేధాన్నే చూసిన తెలుగు సమాజం ఇక విగ్రహాలపై కూడా నిషేధాన్ని చూస్తోంది. తమ గుర్తులు శాశ్వతంగా నిలిచిపోవాలని కొత్త ప్రభుత్వాలు పనిచేస్తాయి. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను కూడా కొనసాగిస్తాయి. అది ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు కావచ్చు, ఇంకేమైనా ఉండవచ్చు. కానీ, కాంగ్రెస్ సర్కార్ అలా కాదు. గత ప్రభుత్వ గుర్తులను చెరిపేసే లక్ష్యంతో ముందుకుసాగుతున్నది. గత ప్రభుత్వం ముద్రించిన పుస్తకాల్లో తొలి ముఖ్యమంత్రి ముఖచిత్రాలను కూడా చించివేయించడం ఏ సంస్కృతికి చిహ్నమో అర్థం కావడం లేదు. సాహిత్య అకాడమీ, తెలంగాణ సాంస్కృతిక శాఖ తదితర సంస్థలు పాఠ్యపుస్తకాల్లో నాటి ముఖ్యమంత్రి ఫోటోలు లేదా వారి సందేశాలు ఉండటం సహజం. కానీ, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం తొలి తెలంగాణ ముఖ్యమంత్రి ముద్రించిన పుస్తకాల్లోని కేసీఆర్ ముద్రల్ని తొలగించే కార్యాన్ని చేపట్టింది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను వెనక్కు తెప్పించి కేసీఆర్ ముఖచిత్రం లేకుండా తీసివేశారు. ఇప్పుడు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ముద్రించిన గత ముఖ్యమంత్రి సందేశాలు ఉన్న పేజీలను చింపేశారు. ఈ పనిని బహిరంగంగానే ప్రకటించి మరీ చేస్తున్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చూస్తాం, చేస్తాం అని ఒక పక్క ముఖ్యమంత్రి బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఆలోచనల మేరకు ప్రభుత్వ శాఖలు పనిచేయాలి. దాన్నెవ్వరు కాదనరు. కానీ, గత ప్రభుత్వంలో వేసిన చరిత్ర పుస్తకాల నుంచి వెదికి మరీ నాటి ముఖ్యమంత్రి ఆనవాళ్లను



చెరిపేయడానికి ప్రభుత్వ శాఖలే పూనుకొనడం విచారకరం. 42 రోజుల పాటు జరిగిన సకలజనుల సమ్మె చరిత్రను ఎవరూ చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమ ఘట్టాలను చెరిపేయలేరు. ఎవరికనుకూలంగా వారు చరిత్రను సొంత గళంతో రాసుకుంటే రాసుకోవచ్చు. కానీ, అసలైన చరిత్రపై హస్తాలు వేస్తామంటే చరిత్ర ఒప్పుకోదు, చరిత్రకారులు ఒప్పుకోరు. పొరుగు రాష్ట్రం తమిళనాడు సీఎం స్టాలిన్ అంతకుముందు ముఖ్యమంత్రి జయలలిత ముఖచిత్రంతో ఉన్న పిల్లల పుస్తకాల సంచుల్ని చింపివేయలేదు. పుస్తకాల్లో ఉన్న జయలలిత సందేశాలను తొలగించలేదు. అమ్మ క్యాంటీన్ల పేరు మార్చలేదు. రాజులు పోవచ్చు, రాజ్యాలు పోవచ్చు. పాలకులు మారొచ్చు, ప్రభుత్వాలు పోవచ్చు. చరిత్ర మాత్రం మారదు. తల్లులు మారరు. అలాగే సిలబస్‌లు మారొచ్చు.. కానీ, చరిత్ర మారదు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చూస్తాం, చేస్తాం అని ఒక పక్క ముఖ్యమంత్రి బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఆలోచనల మేరకు ప్రభుత్వ శాఖలు పనిచేయాలి. దాన్నెవ్వరు కాదనరు. కానీ, గత ప్రభుత్వంలో వేసిన చరిత్ర పుస్తకాల నుంచి వెదికి మరీ నాటి ముఖ్యమంత్రి ఆనవాళ్లను చెరిపేయడానికి ప్రభుత్వ శాఖలే పూనుకొనడం విచారకరం.

# విమర్శలనే మెట్లుగా మలుచుకున్న మౌనముని



మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఢిల్లీ ఎయిమ్స్‌లో గురువారం పరమపదించారనే వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలుపుతున్నా. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు క్యాబినెట్‌లో ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ దేశ చరిత్రలో తనదైన, చెరగని ముద్రవేశారు. సరళీకృత ఆర్థిక విధానాలతో మౌనంగా, ఎలాంటి ప్రచారాలు, ఆర్భాటాలు లేకుండా దేశ గతిని మార్చారు. ఆరు దశాబ్దాల పాటు దేశానికి అనేక స్థాయుల్లో సేవ చేసిన మన్మోహన్‌సింగ్‌కు ప్రతి భారత పౌరుడు రుణపడి ఉంటాడు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న మన్మోహన్‌సింగ్ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పాఠాలు బోధించి ఎందరినో ఆర్థికవేత్తలుగా తీర్చిదిద్దారు. అంతేకాదు, వాణిజ్య పరిశ్రమల శాఖకు సలహాదారుగా ఉంటూ, ప్రధాన ఆర్థిక సలహాదారుగా కూడా సేవలందించారు. ఆ తర్వాత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్‌గా కూడా ఎనలేని సేవలు చేశారు. దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన ఎన్నడూ పదవుల కోసం వెంపర్లాడలేదు. మన్మోహన్‌సింగ్‌కు ఉన్న పరిజ్ఞానం, అనుభవాలను చూసి పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రి పదవి కూడా ఆ తరహాలో వచ్చిందే. ఏ పార్టీలో వీసమెత్తు సభ్యత్వం కూడా లేని మన్మోహన్‌సింగ్‌కు దేశ ఆర్థికమంత్రి పదవి దక్కడం విశేషం. మన దేశం అనేక ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయం అది. ఆపత్కాలంలో ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మన్మోహన్‌సింగ్.. ప్రమాదపుటంచున ఉన్న దేశ ఆర్థికవ్యవస్థను తన మేధోసంపత్తితో గాడిలో పెట్టారు. తద్వారా ఆర్థిక సంక్షోభం నుంచి దేశం గట్టెక్కింది. లైసెన్స్ రాజ్యానికి తెరదించి సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన ఆయన ఆర్థిక రంగానికి జవసత్వాలు అందించారు. అప్పటి ప్రధాని పీవీ సహకారంతో ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ చేపట్టిన చర్యల కారణంగా విదేశీ పెట్టుబడులు, పరిశ్రమలు వెల్లువలా వచ్చాయి. దాంతో దేశం అతివేగంగా అభివృద్ధి చెందింది. రోజూ 16 గంటల పాటు పనిచేసే మన్మోహన్‌సింగ్‌కు అలుపు, అలసట అనేవే తెలియవు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవ చేసిన ఆయన ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం పొందారు. 2004లో మొదటిసారి ప్రధానమంత్రి పదవిని అలంకరించిన ఆయన 2004-09 మధ్యకాలంలో ప్రజారంజక పాలనను అందించారు. తద్వారా ప్రజామోదం పొంది 2009లో మరోసారి ప్రధాని పీఠాన్ని అధిరోహించారు. పరస్పర విరుద్ధ భావాలు కలిగిన రష్యా, అమెరికాలతో మన దేశ సంబంధాలు ఏ మాత్రం చెక్కుచెదరకుండా కాపాడటం మన్మోహన్‌సింగ్ చతురతకు నిదర్శనం. అలాగే సర్వశిక్షా అభియాన్, పనికి ఆహారం, సమాచార హక్కు లాంటి వినూత్న పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది. మౌనాన్నే తన బలంగా చేసుకొని, ప్రతిపక్షాల విమర్శలను మెట్లుగా మలుచుకొని ఉత్తమ ఆర్థికమంత్రిగా, ప్రధానిగా సేవలందించిన ప్రాతఃస్మరణీయుడు మన్మోహన్‌సింగ్. ఆయన అస్తమయం భారతావనికి తీరని లోటు.

# తెలంగాణను తీర్చిదిద్దిన మహానేత



తెలంగాణ ఆవిర్భావం, ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధిలో కేసీఆర్ పాత్ర చరిత్రాత్మకమైనది. ఉద్యమ నాయకుడిగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు జీవం పోసి, రాష్ట్రాభివృద్ధికి అంకితమై ఆయన పనిచేశారు. గమ్యాన్ని ముద్దాడేవరకు విశ్రమించవద్దని ఉద్యమ సమయంలో కేసీఆర్ పదే పదే చెప్పేవారు. అదే పంథాను ఆయన అభివృద్ధిలో చూపించారు. అభివృద్ధికి అడ్డం పడినవారందరితో పోరాడి పదేండ్లలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారు. 1969లో తొలి దశ తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటికీ అది కాలక్రమేణా కనుమరుగైంది. ఆ తర్వాత తెలంగాణ తన అస్తిత్వాన్ని కోల్పోయింది. చాలామందికి తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ప్రత్యేక రాష్ట్రమనే సంగతి కూడా తెల్వకుండాపోయింది. అలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ మళ్లీ పోరుజెండా ఎత్తుకున్నారు. 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించి ఉద్యమానికి కొత్త జవసత్వాలు ఇచ్చారు. ఉద్యమాన్ని కేసీఆర్ శాస్త్రీయంగా, రాజ్యాంగబద్ధంగా నడిపారు. ఏం చేస్తే స్వరాష్ట్రం సాధించవచ్చో క్షుణ్ణంగా అధ్యయనం చేసి, తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. నిరాహార దీక్షలు, సభలు, ర్యాలీలు, పార్లమెంటు లోపల, వెలుపల నిరంతరంగా పోరాటం చేస్తూ ఉద్యమాన్ని సజీవంగా ఉంచారు. అంతేకాదు, ఢిల్లీ పెద్దలకు ఉద్యమ సెగ తాకేలా చేసేందుకు అనేకసార్లు రాజీనామా చేసి, ప్రజాక్షేత్రంలో తన బలాన్ని నిరూపించుకున్నారు. ఈ క్రమంలో ఒకటి కాదు, రెండు కాదు తెలంగాణ కోసం సామ దాన దండోపాయాలన్నింటినీ వాడారు. 'నో స్టోన్ లెఫ్ట్ అన్ టర్న్' అనే సూక్తి ఇందుకు సరిగ్గా సరిపోతుంది. తెలంగాణ ఏర్పాటుతో ప్రజల ఎదురుచూపులు ఫలించాయి. ఉద్యమ నాయకుడిగా నిరూపించుకున్న కేసీఆర్.. పాలకుడిగానూ నిరూపించుకున్నారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోయింది. అయితే, పసికందు తెలంగాణను తన కాళ్ల మీద తాను నిలబడేలా చేయడమంటే మాటలు కాదు. ఉమ్మడి ఏపీ నుంచి వారసత్వంగా వచ్చిన ఎన్నో కష్టాలు ఒకవైపు వెక్కిరిస్తుండగా.. మరోవైపు తెలంగాణను ఫెయిల్యూర్ రాష్ట్రంగా చేయాలని వ్యతిరేక శక్తులు కుట్రలు మొదలుపెట్టాయి. అందులో మొట్టమొదటిది మనకు రావాల్సిన కరెంటును అడ్డుకోవడం. తెలంగాణను అంధకారంలోకి నెట్టాలని, చీకటి రాష్ట్రంగా చిత్రీకరించాలని వేసిన కుయుక్తులను కేసీఆర్ పటాపంచలు చేశారు. అతితక్కువ కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల కరెంటు సరఫరా చేశారు. కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి తెలంగాణలో మిగులు కరెంటు ఉండేలా ప్రణాళికలు రచించారు. స్వరాష్ట్రంగా ఏర్పడకముందు తెలంగాణ ఒక కరువు ప్రాంతం. ఎర్రటి నేలలతో నిండిన తెలంగాణను పచ్చగా చేయాలంటే మన నీళ్లు మన బీళ్లకు మళ్లాలి. ఉద్యమ నినాదాన్ని నిజం చేసేందుకు వానలు పడాలని ఒకవైపు యజ్ఞాలు చేస్తూనే.. అంతకంటే వేగంగా ప్రాజెక్టుల నిర్మాణాలను కేసీఆర్ చేపట్టారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల విప్లవం జరిగింది. ప్రపంచం అబ్బురపడేలా పాతాళంలో ఉన్న గంగను మోసుకొచ్చే కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వాటికి అనుబంధంగా నీటిని నిల్వ చేయడానికి రిజర్వాయర్లు నిర్మించారు. తెలంగాణ ఏర్పడకముందు తెలంగాణలో రైతుకు ఎవరూ విలువిచ్చేవారు కాదు. 50 ఎకరాల ఆసాములు కూడా అప్పులోళ్లే. ఊర్ల సేటు పెట్టుబడి పెడితేకాని నారు పోయలేని దుస్థితి. ఎంత పండినా కొనేవాడి కొర్రీలకు బలికావాల్సిందే. తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న ఇలాంటి అనేక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కేసీఆర్ ప్రభుత్వం నడుం బిగించింది. మిషన్ కాకతీయ ద్వారా వేల చెరువులను పునరుద్ధరించారు. కాళేశ్వరం నీళ్లతో ఆ చెరువులను నింపారు. తద్వారా రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయి. బావులు, బోర్ల కింది వ్యవసాయం లాభసాటిగా మారింది. అలా అనతికాలంలోనే తెలంగాణ దేశానికి అమ్మయ్యింది. కేవలం సాగునీరే కాదు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చి జల దారిద్ర్యానికి కేసీఆర్ చెక్‌పెట్టారు. రైతుబంధు ద్వారా ఆర్థిక సాయం చేసి పెట్టుబడుల ఇబ్బందులను తీర్చారు. అకాలమరణం చెందిన రైతుల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోకుండా రైతుబీమా ద్వారా ఆదుకున్నారు. రైతులందరికీ 24 గంటల ఉచిత విద్యుత్తు అందించి సాగును బాగు చేశారు. అసలు వ్యవసాయం చేసుడు అవసరమా? అనేకాడి నుంచి రెండెకరాల రైతు కూడా రాజే అనేకాడికి ఎవుసాన్ని కేసీఆర్ వృద్ధి చేశారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని కుదేలు చేయడానికి ఎన్నో కుట్రలు జరిగాయి. ప్రాజెక్టులకు కేంద్రం నిధులివ్వలేదు. అనుమతులను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి. వాటన్నింటిని తట్టుకొని రైతాంగాన్ని కంటికి రెప్పలా కాచుకున్నారు. పెట్టుబడి నుంచి పంట కొనుగోలు చేసేదాక రైతులకు ఇసుమంతైనా కష్టం కలగకుండా కేసీఆర్ చూసుకున్నారు. ఉద్యోగాలు చేసేటోళ్లు కూడా కాడిపట్టే విధంగా వ్యవసాయాన్ని తీర్చిదిద్దిన కేసీఆర్ నిజంగా అభినవ మహర్షి. ఉమ్మడి ఏపీలో సంక్షేమం సంగతి దేవుడెరుగు విద్య, వైద్యం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. అందుకే, కేసీఆర్ అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేశా రు. దళితులు, గిరిజనులు, బీసీలు, ఇతర వర్గాల పిల్లలు చదువుకునేలా ప్రత్యేకంగా గురుకులాలను నెలకొల్పారు. బస్తీ దవాఖానల నుంచి సూపర్ స్పెషాలిటీల వరకు ఏర్పాటుచేసిన కేసీఆర్ వైద్యరంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల సామాజిక భద్రత పెరిగింది. అంతేకాదు, పరిశ్రమల ఉద్యమమే జరిగిందని చెప్పవచ్చు. టీఎస్-ఐపాస్ లాంటి వినూత్న విధానాల వల్ల పెట్టుబడులు వెల్లువలా వచ్చాయి. తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించిన కేసీఆర్ ప్రజానాయకుడిగా పేరొందారు. ఆయన అవలంబించిన విధానాలు రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టా యి. కేసీఆర్ లేకుంటే ఇంత అభివృద్ధి జరిగేది కాదు. అందుకే, కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి, తెలంగాణ అభివృద్ధి యజ్ఞాన్ని పునఃప్రారంభిస్తారని ఆశిస్తున్నా.

# ధ్యానం శరణం గచ్ఛామి



రుషులు నిర్దేశించిన మార్గం ధ్యానం. గౌతమ బుద్ధుడు అనుసరించిన పథం ధ్యానం. విశిష్ట జీవనానికి మన పూర్వికులు ఈ జాతికి అందించిన పరుసవేది ఈ సాధన. మనసును ప్రశాంత స్థితికి తీసుకొచ్చి మన శక్తిని ఉద్దీపనం చేసే అస్త్రమిది. ధ్యానం ప్రధాన లక్ష్యం జీవితం పట్ల అవగాహన పెంచుకోవడమే! మన ఆలోచనలపై అదుపు సాధించడం వల్ల మనసుకు, శరీరానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. శ్వాస మీద ధ్యాస ఒక పద్ధతైతే.. ఆలోచనలను అధిగమించే విధానం మరొకటి. మార్గమేదైనా ధ్యానాన్ని ఆశ్రయిస్తే.. జీవితం ఆరోగ్యంగా సాగిపోవడం ఖాయం. ఆధునిక స్త్రీలు ఇంటి బాధ్యతలతోపాటు ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణిస్తూ కాలంతోపాటే పరుగులు తీస్తున్న వాతావరణం ఇప్పుడు మామూలు విషయమైపోయింది. ఒత్తిళ్లతో కూడిన వాతావరణంలో మహిళలు తమ మానసిక, శారీరక ఆరోగ్యం గురించి శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో నవతరం నారీమణుల మానసిక ఆరోగ్యం కోసం ధ్యానం ఓ మంచి ఉపకరణంగా నిలుస్తుంది. ధ్యానం చేయడంలో అనుసరించాల్సిన విధానాలు వేర్వేరు రకాలుగా ఉంటాయి.

### శ్వాస మీద ధ్యాస

ముక్కు పుటాల గుండా జరిగే శ్వాసక్రియ (ఉచ్ఛ్వాస, నిశ్వాస) క్రమాన్ని అలా గమనిస్తూ ఉండిపోవాలి. లేదంటే శ్వాసిస్తున్న క్రమాన్ని మనసులో లెక్కిస్తూ ఉండాలి. ఇలా చేస్తే మనసు మీద అదుపు వస్తుంది.

### ఎరుకతో ధ్యానం

దీన్ని మైండ్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ అంటారు. ఇందులో గతం, భవిష్యత్తుల గురించిన ఆలోచనలు వదిలిపెట్టి కేవలం వర్తమానంపై దృష్టి సారించాలి. ఆలోచనలు, మానసిక స్పందనలు, పరిసరాల మీద పూర్తి ఎరుకతో ఉండాలి. ఇలా చేయడం జీవితాన్ని యథాతథంగా ఆమోదించి ముందుకు వెళ్లడానికి దోహదపడుతుంది. ఆలోచనలు, భావోద్వేగాల పట్ల ఎరుకతో ఉండటం వల్ల స్త్రీలు తమ గురించి తాము అవగాహన చేసుకుని, జీవితంలో వివిధ సందర్భాల్లో ఎలా స్పందించాలో తెలుసుకోగల్గుతారు.

### మనసు ఖాళీ

మనసులో రోజువారీ జీవితంలో తలెత్తే గందరగోళాన్ని, గజిబిజి ఆలోచనలను ఖాళీ చేసుకోవాలి. మనసును ఆలోచన రహిత స్థితికి తెచ్చుకోవాలి. లేదంటే ఆలోచనలను అలా బయటికి స్వేచ్ఛగా వెళ్లిపోనివ్వాలి.

### వస్తువును చూస్తూ

ఓ చెట్టును కానీ, దీపశిఖను కానీ లేదంటే ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన వస్తువును కానీ అలా చూస్తూ ఉండటం ద్వారా కూడా మనసుపై పట్టు సాధించవచ్చు. అయితే ఇక్కడ మనం చూసే వస్తువు పట్ల ఎరుకతో ఉండాలి. ఆలోచనలను బలవంతంగా తొక్కిపట్టే ప్రయత్నం చేయకూడదు. అలా మనసును స్వేచ్ఛగా వదిలివేయాలి. కాసేపటికి అదే నెమ్మదిస్తుంది.

### సానుభూతిలోజి

మన పట్ల మనం, ఇతరుల పట్ల ప్రేమగా, దయతో మెలగడమూ ధ్యానమే. దీనివల్ల మన మీద మనకే కాకుండా ఎదుటివారి పట్ల సహానుభూతి, సానుభూతి, దయాగుణం అలవడతాయి. ఇది స్త్రీలు తమ మనోస్థితిని సానుకూలంగా మార్చుకుని ఇతరులతో సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు దోహదపడుతుంది.

### మంత్ర ఉచ్చారణ

ఓ మంత్రాన్ని లేదంటే పదాన్ని, పదబంధాన్ని ఉచ్చరించడం కూడా ధ్యానమే. దీనివల్ల మనసుకు ఉపశమనం దొరుకుతుంది. మన గురించి మనకు ఎరుక ఏర్పడుతుంది. నామాన్ని ఉచ్చరించడం వల్ల ఒత్తిడి, ఆందోళన లాంటివి దూరమైపోతాయి. మనసు స్థిమిత పడుతుంది.

### ఎన్నో ప్రయోజనాలు


శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం ధ్యానంతో మానసిక, భావోద్వేగపరమైన, శారీరకపరమైన ఆరోగ్యం చేకూరుతుంది. ఒత్తిడి, నిరాశ, ఆందోళన దూరమైపోతాయి. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మానసికంగా స్పష్టత వస్తుంది. ఏవైనా సవాళ్లు ఎదురైనప్పుడు భావోద్వేగాల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. ఇక శారీరకంగా చూస్తే ధ్యానం వల్ల అధిక రక్తపోటు తగ్గుతుంది. అలా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అయితే, ధ్యానం ఇచ్చే ప్రయోజనాలను పెంచుకోవాలని అనుకుంటే రోజువారీ జీవితంలో ఆరోగ్యకరమైన అలవాట్లకు చోటివ్వాలి. పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా శారీరక, మానసిక వ్యాయామాలు చేయాలి. ఇలా చేస్తే జీవితంలో నాణ్యత కూడా పెరుగుతుంది. ధ్యానం వల్ల నిద్ర కూడా గాఢంగా పడుతుంది. దీంతో మేధో సామర్థ్యం పెరుగుతుంది. ఇవి మాత్రమే కాదు%ిె% ఆహారం తినడాన్నీ ఓ ధ్యానంలాగే పూర్తిచేయాలి. ఆహారం రుచి, రంగు, వాసనను ముద్దముద్దలో ఆస్వాదిస్తూ తినాలి. జీవితం అంటే గమ్యం కాదు ప్రయాణం అని గుర్తుంచుకోవాలి. దీన్ని గుర్తిస్తే చాలు జీవితయాత్ర ఆనందంగా, ఆరోగ్యకరంగా సాగిపోతుంది. ఈ క్రమంలో ధ్యానం, యోగా లాంటివి తమవంతు సాయం చేస్తాయి. ధ్యానం కోసం ఎవరైనా అనుభవజ్ఞుల దగ్గర శిక్షణ తీసుకోవడం మర్చిపోవద్దు. ఎలా చేయాలి? మొదట్లో ఐదు పది నిమిషాలతో మొదలుపెట్టి ధ్యానం చేసే సమయాన్ని పెంచుతూ పోవాలి. ఎవరి అవసరాన్ని బట్టి వారు ఎంత సమయం ధ్యానం చేయాలనేది నిర్ణయించుకోవాలి. ఐదు నిమిషాల నుంచి అరగంటపాటు ఓ నిశ్శబ్ద ప్రదేశంలో బయటి ప్రపంచం ప్రభావం లేకుండా ధ్యానం చేయడం మంచిది. ధ్యానం చేసేటప్పుడు పద్మాసనం లాంటి సంప్రదాయ భంగిమలు మంచివి. లేదంటే మీకు తగినట్టుగా, ఉపశమనం కలిగించే భంగిమ ఏదైనా ఎంచుకోవచ్చు. కుర్చీలో కూర్చొని, పడుకొని కూడా ధ్యానంలోకి

### వెళ్లిపోవచ్చు.

ధ్యానం అనేది మానసిక, శారీరక ఆరోగ్యానికి హామీనిస్తుంది. అయితే అనారోగ్యంగా ఉన్నప్పుడు సంబంధిత వైద్యుణ్ని కలిసి తగిన చికిత్స తీసుకోవాలి. అంతే తప్ప ధ్యానం మాత్రమే రోగాలను తగ్గించదు.

### ఇసుక దిబ్బపై నందనవనం

## అణువణువూ అచ్చెరువొందించేలా




ప్రపంచ పర్యాటక ప్రదేశాల్లో దుబాయ్ ప్రత్యేకమైనది. ఎడారి దేశంలో వెలసిన ఈ అద్భుత నగరి భూతల స్వర్గంగా వినుతికెక్కింది. దుబాయ్‌లో ఉన్న ఆకర్షణీయమైన ప్రదేశాల్లో ఈ మిరాకిల్ గార్డెన్ ఒకటి. ప్రపంచంలో అతిపెద్ద సహజమైన పూల తోటగా రికార్డులకెక్కింది. సృజనాత్మకత మేళవింపుతో రూపుదిద్దుకున్న ఈ నందనవనంలో అణువణువూ అచ్చెరువొందిస్తుంది. బంతిపూలు, గులాబీలు ఇలా పూలజాతులను లెక్కించడం అందరికీ సాధ్యమేయ్యే పనికాదు. ఈ తోటకు ఏ రోజు వెళ్లినా సుమారు 15 కోట్ల విరులు పలకరిస్తాయంటే ఆశ్చర్యం కలగకమానదు. ఈ గార్డెన్ 72వేల చదరపు మీటర్ల వైశాల్యంలో విస్తరించి ఉంది. మర్మయోగి సినిమాలోని ఆరుద్ర పాట 'నవ్వుల నదిలో పువ్వుల పడవ' అన్నట్టే ఉంటుందీ ఉద్యానవనం. ఒక్క పడవే కాదు, పూల కోట, పూల గడియారం, ఎగబాకిన తీగలతో ఏర్పడిన సాఫ్ట్‌టాయ్స్ చూపు తిప్పుకోనివ్వదు. హృదయాకారంలో ఉన్న ఈ పూల వనం దారుల్లో నడుస్తూ ఉంటే 'ఇది మైమరపించే హాయి.. ఇక రానే రాదీ రేయి' అని ఆరుద్ర చెప్పిన అనుభూతే కలుగుతుంది! ప్రఖ్యాతమైన భవనాల నమూనాలను పూలతో నిర్మించిన ఈ గార్డెన్ పేరుకు తగ్గట్టుగానే మిరాకిల్!

### అబ్బో.. ఎన్ని వింతలో!

వంద రకాలకుపైగా పూల జాతులు ఉన్న ఈ ఉద్యానవనంలో సృష్టిలో ఉన్న అన్ని రంగులూ కనువిందు చేస్తాయి. ఈ వన్నెల వనంలో ల్యాండ్ అయినట్లుగా ఉన్న ఎయిర్ బస్ 380 నమూనా కూడా పూల మొక్కలతోనే నిర్మించారు. ఈ సూపర్ జంబో ఎయిర్ క్రాఫ్ట్ కోసం అయిదు లక్షల పూల మొక్కలు ఉపయోగించారట. ఒక రూపం కోసం అత్యధిక పూలు వినియోగించిన నిర్మాణంగా ఇది గిన్నిస్ ప్రపంచ రికార్డుల్లోకి ఎక్కింది. ఇందులోనే ఉన్న బటర్ ఫ్లై పార్క్ మరింతగా అలరిస్తుంది. పూల వర్ణాలకు పోటీగా రంగురంగుల సీతాకోక చిలుకలు విరులపై వాలుతూ, గాల్లో తేలుతూ పర్యాటకులకు ఆనందాన్ని పంచుతాయి. కనువిందు చేసే ఈ దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను మాత్రమే కాదు ఫొటోగ్రఫీలో రాణిస్తున్నవారికీ కేరాఫ్‌గా నిలుస్తున్నది. నవంబర్ నుంచి మే వరకు ఈ నందన వనానికి పర్యాటకులు తాకిడి అధికంగా ఉంటుంది. కాస్త చల్లదనం ఎక్కువగా ఉండే డిసెంబర్‌లో ఇక్కడ విరులు కొల్లలుగా పూసి అలరిస్తాయి. శని, ఆదివారాల్లో మాత్రమే ఈ పార్క్ తెరిచి ఉంటుంది.

## చలి కాలంలో మాత్రమే వేధించే డిప్రెషన్

ఇన్ఫోగ్రాఫిక్



భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు, గజగజా వణుకుతున్న తెలుగు రాష్ట్రాలు, మంచు దుప్పటిలో ఉత్తరాది ఇలాంటి పతాక శీర్షికలు చదివే సమయం వచ్చేసింది. నిజంగానే చలికి కొండలు సైతం వణికిపోతున్నాయి. ఆ చలి నుంచి తప్పించుకోవడం, దాని వల్ల వచ్చే అనారోగ్యాల గురించి వినడం సాధారణం. కానీ, చలి కాలంలో మాత్రమే వేధించే డిప్రెషన్ గురించి విన్నారా! అదే %ూముంశీఝశ్రీ ఖటటవవ్‌ఱజవ ఎఱంశీతీసవతీ. చాలామంది తెలియకుండానే దీనితో బాధపడుతూ ఉంటారు. అది ఓ సమస్య అని తెలియక పోవడం వల్ల తీవ్రమైన కుంగుబాటుకు లోనవుతుంటారు. ఇంతకీ ఏమిటీ

### స్పష్టమైన కారణాలు

చలికాలం పగటివేళలు తగ్గిపోతాయి. దీనివల్ల మన జీవగడియారం మీద ప్రతికూల ప్రభావం పడుతుంది. మన భావోద్వేగాలను నియంత్రించే సెరటోనిన్, మెలటోనిన్ అనే హార్మోన్ల ఉత్పత్తిలో లోటు ఏర్పడుతుంది. ఇక చలికాలం విటమిన్-డి లభ్యత కూడా తక్కువగా ఉంటుంది. ఈ లోటు మన నాడీవ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది. ఈ కారణాలన్నిటితో మనిషిలో స్తబ్ధత ఏర్పడుతుంది. సహజంగానే డిప్రెషన్‌తో బాధపడుతున్నవారినీ, వంశపారంపర్యంగా ఈ సమస్య ఉన్నవారినీ ఈ మరింతగా ఇబ్బంది పెట్టవచ్చు. చలికాలంలో సూర్యకాంతి తగ్గడం వల్ల మాత్రమే కాదు సూర్యుడు ఆకాశంలో ఎంత తక్కువ సమయం ఉంటే ఈ ప్రభావం అంత ఎక్కువగా ఉంటుందని ఓ ముగ్గురు పరిశోధకులు చేసిన అధ్యయనంలో తేలింది.

ఇవీ లక్షణాలు

చాలామంది చలికాలం బద్ధకం సహజమే అనుకుని సరిపెట్టుకుంటారు. కానీ కాస్త జాగ్రత్తగా గమనిస్తే కొన్ని లక్షణాల వల్ల మనం తో ఇబ్బంది పడుతున్నామని తేలికగా గ్రహించవచ్చు. ఎంతసేపు పడుకున్నా బడలిక తీరక నిస్సత్తువగా తోచడం. ఏదో ఒకటి.. మరీ ముఖ్యంగా కార్బోహైడ్రేట్స్ (పిండి పదార్థాలు) ఎక్కువగా ఉండే స్వీట్స్ లాంటివి తినాలి అనిపించడం. ఇది బరువు పెరగడానికి కూడా కారణం అవుతుంది. ఏ పనీ చేయాలని అనిపించకపోవడం, జీవితం మీద ఆశ తగ్గకపోవడం ఆత్మహత్య లాంటి ఆలోచనలు రావడం. ఎందుకూ పనికిరానిమనే ఆత్మనూన్యతా భావం పెరిగిపోవడం, చిన్నచిన్న విషయాలకే అతిగా స్పందించడం. ఒకప్పుడు ఇష్టంగా చేసిన పనుల పట్ల కూడా శ్రద్ధ లేకపోవడం, ఏకాగ్రత లోపించడం. ఇలాంటి లక్షణాలు సుదీర్ఘకాలం పాటు కనిపిస్తే తప్పకుండా వైద్యుడిని సంప్రదించాలి.

### చికిత్స ఉంది

కౌన్సెలింగ్, లైట్ థెరపీ, యాంటి డిప్రెసెంట్స్ లాంటి మార్గాల ద్వారా సమస్యను తేలికగానే ఎదుర్కోవచ్చు. వ్యాయామం చేయడం, ఉదయాన్నే కాసేపు ఎండపట్టున ఉండటం, మంచి పోషకాహారం, నిరాశగా ఉన్నప్పుడు దాన్ని ఇతరులతో పంచుకోవడం, కాస్త కలుపుగోలుగా నలుగురితో కలవడం, నిర్దుష్టమైన లక్ష్యాలు పెట్టుకుని పనిలో నిమగ్నమవడం లాంటి చర్యలతో నుంచి ఉపశమనం పొందవచ్చు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ చలికాలంలో వచ్చే కార్తిక, మార్గశిర మాసాలలో పెద్దలు దీపాలకు ప్రాముఖ్యత ఇవ్వడం వెనుక కూడా ఇదొక కారణం ఉందని అంటారు. నువ్వులనూనె, ఆముదం, ఆవునెయ్యి లాంటివాటితో దీపారాధన చేయమని సూచిస్తూ ఉంటారు. వీటి సాంద్రత ఎక్కువ ఉంటుంది కాబట్టి వాటి నుంచి వచ్చే గాఢమైన వెలుతురు, వెచ్చదనం రెండూ కూడా మనసుకు సాంత్వన ఇస్తాయన్నది నమ్మకం. ఇదీ కబురు. కారణం, లక్షణాలూ, చికిత్సా అన్నీ తెలిశాయి కాబట్టి ఈ చలికాలం కాస్త జాగ్రత్తగా ఉందాం. రాకుంటే మంచిది. వస్తే అవలీలగా అధిగమిద్దాం!

# ధరల నిర్ణయాధికారంతోనే సాగు బాగు



మానవుని జీవన విధానం వ్యవసాయంతో ముడిపడి ఉన్నది. మానవుడి నాగరిక జీవితానికి వ్యవసాయమే మూలాధారం. సింధు లోయ నాగరికత నుంచే మన దేశంలో వ్యవసాయం ప్రధాన జీవన ఆధారంగా ఉండేది. ఆ కాలంలో అన్నదాతలు సిరిసంపదలతో వర్ధిల్లేవారు. ఆధునిక భారతదేశంలో వ్యవసాయ రంగంలో సాంకేతికత అభివృద్ధి వల్ల పెనుమార్పులు సంభవించాయి. వ్యవసాయ రంగం దేశ ప్రగతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడుతున్నది. అందువల్లే వ్యవసాయ రంగాన్ని దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా పరిగణిస్తారు. దేశాన్ని కాపాడుకోవడంలో రైతు కీలక పాత్ర పోషిస్తున్నాడు. అది స్వతంత్ర పోరాటమైనా, కరువుకాటకాలైనా, ఎలాంటి పరిస్థితుల్లోనైనా అన్ని తానై ముందుండి దేశ ప్రజలను రక్షించడంలో రైతుల పాత్ర వెలకట్టలేనిది. నిత్యం శ్రమిస్తూ దేశ ప్రజలకు అన్నం పెట్టడంలో రైతుకు సాటి ఎవ్వరూ లేరు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇంచుమించు 50.82 మిలియన్ టన్నులు ఉండగా.. రైతుల నిరంతర శ్రమ వల్ల 2023-24 నాటికి 332.32 మిలియన్ టన్నులకు చేరుకున్నది. మన దేశంలో సుమారుగా 80.54 కోట్ల మంది ఉచితంగా ఆహార ధాన్యాలను పొందుతున్నారంటే వారి కృషి ఫలితమే. సంవత్సర తలసరి నికర ఆహార ధాన్యాల లభ్యత 1950లో 144.1 కిలోగ్రాములు కాగా.. 2023 నాటికి అది 207.6 కిలోగ్రాములకు చేరింది. అంటే దినసరి తలసరి నికర ఆహార ధాన్యాల లభ్యత 568.8 గ్రాములు. ఈ విధంగా కర్షకులు దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కానీ, వారు మాత్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. పంట విత్తిన సమయం నుంచి కోతకోసి అమ్మే వరకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక హెక్టార్ విస్తీర్ణంలో వరి సాగుకు కౌలు, కుటుంబ శ్రమ కలుపుకొని సుమారు రూ.లక్ష పెట్టుబడి అవుతున్నది. అందులో అధికంగా కూలీలకు (22.1%), ఎరువులకు (20.8%), విత్తనాలకు (11.5%), మందులకు (8.3%) ఖర్చవుతుంది. దేశ వ్యవసాయ కూలీ సగటు రోజువారీ వేతనం రూ.361.52 (2022-23 గణాంకాలు). నమ్మలేని నిజం ఏమిటంటే మన దేశంలో వ్యవసాయ కూలీ ఆదాయం కంటే రైతు ఆదాయం తక్కువ. వ్యవసాయ ఖర్చులు పెరగడం అన్నదాతలకు ప్రధాన సమస్యగా మారింది. ఉదాహరణకు ఒక హెక్టార్ విస్తీర్ణంలో వరి సాగుకు కౌలు, కుటుంబ శ్రమ కలుపుకొని సుమారు రూ.లక్ష ఖర్చు అవుతున్నది. అందులో అధికంగా కూలీలకు (22.1%), ఎరువులకు (20.8%), విత్తనాలకు (11.5%), మందులకు (8.3%) ఖర్చవుతుంది. వ్యవసాయ కూలీ సగటు రోజువారీ వేతనం రూ.361.52 (2022-23 గణాంకాలు). నమ్మలేని నిజం ఏమిటంటే మన దేశంలో వ్యవసాయ కూలీ ఆదాయం కంటే రైతు ఆదాయం తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2019లో వ్యవసాయ కుటుంబ సగటు నెలసరి ఆదాయం రూ.10,218 మాత్రమే. మన దేశంలోని 50.2 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో చిక్కుకున్నాయి. అందులోనూ 82.9 శాతం చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలే కావడం గమనార్హం. దేశంలో రైతుల సగటు అప్పు రూ.7,412. అదేవిధంగా రెండు తెలుగు రాష్ట్రాల వ్యవసాయ కుటుంబాలు దేశంలోనే అత్యధిక శాతం అప్పుల బారినపడ్డాయని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. రైతుల అప్పుల్లో 69.9 శాతం సంస్థాగత రుణాలు కాగా.. మిగతా 30 శాతం రుణాలు వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, భూస్వాములు, చిట్ ఫండ్ కంపెనీలు ఇచ్చినవే. పెట్టుబడికి డబ్బులు లేక, సంస్థాగత రుణాలు సమయానికి అందకపోవడంతో వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకొని అప్పుల పాలవుతున్నారు. అప్పుల భారం తట్టుకోలేక చివరికి ఆత్మహత్య చేసుకుంటున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం.. 2022లో సుమారు 11,290 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దేశ రైతాంగాన్ని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్న తరుణంలో వాటిని అధిగమించి అన్నదాతల ఆదాయం పెంచాలంటే వ్యవసాయ రంగంలో నూతన సంస్కరణలు, సాకేతికత వినియోగం తక్షణావసరం. సాగు ఖర్చులు, పంట కోనుగోలు, గిట్టుబాటు ధర, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థ లాంటి అనేక అంశాల మీద సమగ్ర సంస్కరణలు తీసుకురావాలి. ప్రత్యేకించి, స్థానిక సమస్యలకు అనుగుణంగా వ్యవసాయ సంస్కరణలు ఉండాలి. ముఖ్యంగా పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలి. ఒకవేళ పంటను ప్రైవేట్ వ్యాపారులు, దళారులు కొన్నప్పుడు తప్పనిసరిగా ఆ ధరలు, కనీస మద్దతు ధర కంటే అధికంగా ఉండేటట్టు చట్టాలను తీసుకురావాలి. విత్తనాల కొనుగోలుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ప్రభుత్వ సంస్థల నుంచి రైతులకు సమయానికి, సరిపడా విత్తనాలు లభించడం లేదు. 2023లో 464.14 లక్షల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అవసరం ఉండగా, ప్రభుత్వ సంస్థల నుంచి 133.84 లక్షల క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారుల నుంచి 380.41 లక్షల క్వింటాలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. రైతులకు సరిపడా విత్తనాలను అందించేందుకు ప్రభుత్వ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో మరిన్ని విత్తన ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అదేవిధంగా, నేల సారవంతం చేసేందుకు, చీడపీడల నివారణకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఈ రకమైన ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగా సమగ్ర సస్యరక్షణ, పోషక నిర్వహణ కిట్లను అందజేయడం ద్వారా ఖర్చులను కొంతమేరకు తగ్గించవచ్చు. అంతేకాకుండా, వ్యవసాయ కూలీల ఖర్చును తగ్గించడానికి యంత్రాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. అందుకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ముందుకు రావాలి. తక్కువ ధరలకు యంత్రాలను అందుబాటులోకి తేవాలి. సంప్రదాయ వ్యవసాయంలోని మెలకువలు, నైపుణ్యాలను కొనసాగిస్తూనే.. సాంకేతిక పరిజ్ఞానాన్ని పంటల సాగుకు ఉపయోగించడం వల్ల వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించవచ్చు. ఆధునిక డిజటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి సేద్యంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. వ్యవసాయ డిజిటలీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌తో రానున్న దశాబ్దాల్లో దేశ వ్యవసాయ రంగం నూతన రూపం సంతరించుకోబోతున్నది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లోని అగ్రిస్టాక్ దేశ వ్యవసాయానికి సంబంధించిన బృహత్తర సమాచార నిధిగా మారబోతున్నది. అగ్రిస్టాక్ ద్వారా సేకరించిన సమాచారం డిజిటల్ వ్యసాయానికి పునాది కాబోతున్నది. కృత్రిమమేధ, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్ లాంటి అనేక సాంకేతిక విధానాలను సాగుకు సంబంధించిన నిర్ణయాలను తీసుకోవడానికి, అవరోధాలను పసిగట్టి నివారించడానికి ఉపయోగించవచ్చు. స్మార్ట్ ఫార్మింగ్‌లో భాగంగా వివిధ అప్లికేషన్లను ఉపయోగించి ఉచితంగా విత్తన రకాలను ఎంచుకోవడం, నేలల రకాలకు అనుగుణంగా ఎరువుల వాడకం, తెగుళ్లను, పురుగులను గుర్తించడం, సరైన మందులను పిచికారీ చేయడం, వాతావరణంలోని మార్పులను తెలుసుకోవడం, దిగుబడులను అంచనా వేసి మార్కెట్లోని ధరల హెచ్చుతగ్గులను తెలుసుకోవచ్చు. అందుకు రైతులకు డిజిటల్ పరిజ్ఞానం చాలా అవసరం. కాబట్టి, దేశంలోని అన్నదాతలకు అందుకు అవసరమైన శిక్షణ ఇచ్చి కనీస అవగాహన కల్పించాలి. ఆధునిక భారతదేశం సాంకేతికత పరంగా అభివృద్ధి సాధించినప్పటికీ, రైతాంగం స్థితిగతులను మార్చే విషయంలో అది ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. వ్యవసాయ రంగంలో సాంకేతికతను కొంతవరకు ఉపయోగిస్తున్నప్ప టికీ ఆశించిన ఫలితాలు మాత్రం రావడం లేదు. రైతులు లాభపడాలంటే సాగుకు సాంకేతికత తోడవ్వాలి. అంతేకాదు, కర్షకుల చిరకాల స్వప్నమైన పండించిన పంటకు ధరలు తామే నిర్ణయించుకునే స్థితి వస్తేనే వ్యవసాయం సస్యశామలమై అన్నదాతల ఆదాయం పెరుగుతుంది. దేశం సుభిక్షంగా వర్ధిల్లుతుంది.

# తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ పాత్ర



90వ దశకంలో భారత్ తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణల్లో నాటి ప్రధాని పీవీ నరసింహారావుతో పాటు అప్పటి ఆర్థికశాఖ మంత్రి మన్మోహన్ సింగ్ పాత్ర మరువలేనిది. ఓ వైపు గల్ఫ్ సంక్షోభం, మరోవైపు విదేశీ మారక నిల్వలు తగ్గిపోయి దేశం సంక్లిష్ట పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నప్పుడు కేంద్ర ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మన్మోహన్‌సింగ్%్లా% 'సమయం వచ్చినప్పుడు భారత్‌ను ఎవరూ ఆపలేరు' అని బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. ఆయన అన్నట్టుగానే నాడు భారత ఆర్థికవ్యవస్థ అనతి కాలంలోనే నిలదొక్కుకున్నది. ఆర్థికపరంగా గాడితప్పిన దేశాన్ని అభివృద్ధి పట్టాలు ఎక్కించిన ఆ ర్థిక యోధుడికి భారతీయ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు. ముఖ్యంగా మన తెలంగాణ సమాజం ఆయనను ఎన్నటికీ మరువదు. ఎందుకంటే, 60 ఏండ్ల స్వరాష్ట్రం కల సాకారమవ్వడంలో ఆయన కృషి ఎనలేనిది. 2004లో కాంగ్రెస్‌తో కలిసి పోటీచేసిన తెలంగాణ రాష్ట్ర సమితి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో, కేంద్రంలోని యూపీఏ కూటమి సర్కార్‌లోనూ చేరింది. కూటమికి నాయకత్వం వహించిన కాంగ్రెస్ పార్టీ మన్మోహన్ సింగ్‌ను ప్రధానమంత్రిగా ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనకు కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర సమితి పూర్తి మద్దతునిచ్చింది. మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలో కేసీఆర్‌తో పాటు ఆలె నరేంద్ర చేరారు. ఆ తర్వాత జరిగిన మొదటి మంత్రివర్గ సమావేశంలో తెలంగాణ ఏర్పాటుపై చర్చ జరిగింది. దానికి నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చాలా సానుకూలంగా స్పందించారు. ఆయన అనుకూల వైఖరి వల్లే రాష్ట్రపతి ప్రసంగంలోనూ తెలంగాణ ప్రస్తావన వచ్చిచేరింది. సోనియాగాంధీ నాయకత్వంలో ఉన్న యూపీఏ కూటమి తమ కామన్ మినిమం ప్రోగ్రాం (సీఎంపీ)లో కూడా తెలంగాణ అంశాన్ని చేర్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తాము సుముఖంగా ఉన్నామని యూపీఏ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఐదుగురు ఎంపీలతో తెలంగాణ రాష్ట్ర సమితి మన్మోహన్‌సింగ్‌ను ఎప్పుడు కలిసినా ఆశాభావంతో ఉండాలని ఆయన చెప్పేవారు. తెలంగాణ ఎంపీలు మన్మోహన్‌సింగ్‌ను ఎప్పుడు కలిసినా మన ప్రాంత సమస్యలను అడిగి తెలుసుకునేవారు. వాటి పరిష్కారం పట్ల సానుకూలంగా స్పందించేవారు. అలాగే మొదట కేసీఆర్‌కు నౌకాయాన శాఖ ఇవ్వాలని మన్మోహన్ సింగ్ నిర్ణయించారు. కేసీఆర్ తన కార్యాలయంలో పూజ కూడా పూర్తిచేసుకున్నారు. కానీ, అప్పటి డీఎంకే ఎంపీలు ఆ శాఖ తమ పార్టీకే ఇవ్వాలని మన్మోహన్‌సింగ్‌పై ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై మన్మోహన్‌సింగ్ దగ్గరికి వెళ్లిన కేసీఆర్ ఒక్కటే మాట చెప్పారు. 'మాకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ఏకైక లక్ష్యం. మంత్రి పదవులపై మాకు మక్కువ లేదు. మీరు ఏ శాఖ ఇచ్చినా తీసుకుంటా. కానీ, తెలంగాణ ఇవ్వండి' అని మన్మోహన్‌కు స్పష్టం చేశారు. దాంతో పరిస్థితిని అర్థం చేసుకున్నందుకు కేసీఆర్ భుజం తట్టి అభినందించిన మన్మోహన్%్లా% తెలంగాణ ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకున్నారు. నౌకాయాన శాఖను వదులుకున్న కేసీఆర్.. మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలో సుమా రు 10 నెలల పాటు ఎలాంటి శాఖ లేకుండా పనిచేశారు. ఆ తర్వాత నాటి కేంద్రప్రభుత్వం కేసీఆర్‌కు కార్మిక శాఖను కేటాయించింది. 2019 ఏప్రిల్ 8న ప్రొఫెసర్ సీహెచ్ హనుమంతరావు రచించిన ఓ పుస్తకాన్ని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఢిల్లీలో ఆవిష్కరించారు. ఆ సభలో తెలంగాణ అభివృద్ధి, ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా పథకాలపై ఆయన నాతో చర్చించడమే కాకుండా, ఆ పథకాలను కొనియాడుతూ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అభినందించారు. మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో కార్మిక శాఖ మంత్రిగా రెండేండ్లు పనిచేసిన కేసీఆర్ అనేక సంస్కరణలు చేపట్టారు. అంతేకాదు, తెలంగాణకు అనేక అభివృద్ధి ప్రాజెక్టులు తీసుకువచ్చారు. ముఖ్యంగా కేసీఆర్ కృషి వల్లే హైదరాబాద్-కరీంనగర్ (మనోహరాబాద్-కొత్తపల్లి) రైల్వే లైన్‌కు పునాదులు పడ్డాయి. పెద్దపల్లి-కరీంనగర్-జగిత్యాల -నిజామాబాద్ రైల్వే లైన్ కోసం కేసీఆర్ సహా తెలంగాణ ఎంపీలు పలుసార్లు నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కలిసి వెంటనే భూసేకరణ, సర్వే పూర్తి చేసేలా ఒత్తిడి తీసుకువచ్చారు. అంతేకాదు, గోదావరిపై మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న బాబ్లీ ప్రాజె క్టు, కృష్ణా జలాల పంపకంపై అప్పటి ఏపీ ముఖ్యమంత్రి రోశయ్య నేతృత్వంలో ప్రధాని మన్మోహన్ సింగ్‌ను అఖిలపక్ష నాయకులుగా మేం కలిశాం. కృష్ణా జలాల పంపకంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని లేవనెత్తితే సావదానంగా విన్న మన్మోహన్‌సింగ్ నిష్పక్షపాతంగా జలాల పంపిణీ జరుగుతుందని హామీ ఇచ్చారు. ఇక తెలంగాణ నుంచి గొప్ప ఆర్థికవేత్తగా ఎదిగిన మా మేనమామ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు, మన్మోహన్ సింగ్ కలిసి పనిచేశారు. ఏడో ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్‌గా పనిచేసిన మన్మోహన్‌సింగ్‌తో సీహెచ్ హనుమంతరావు సభ్యులుగా పనిచేశారు. చాలా ఆర్థిక విధానాల్లో ఇరువురు కలిసి మేధోమథనాలు జరిపేవారు. ఆర్థిక సంఘం సభ్యుడిగా పనిచేసిన హనుమంతరావు సమర్థతను మన్మోహన్‌సింగ్ దగ్గరుండి చూశారు. అందుకే మన్మోహన్‌సింగ్ సర్కార్ 2004లో హనుమంతరావును పద్మభూషణ్ పురస్కారంతో సము న్నతంగా సత్కరించింది. తెలంగాణ ప్రకటన నుంచి మొదలుపెడితే పార్లమెంట్‌లో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు బిల్లు వరకు అప్పటి ప్రధానిగా మన్మోహన్ ఎంతో సహకరించారు. ముఖ్యంగా రాజ్యసభలో ఎదురైన అడ్డంకులను చాకచక్యంగా పరిష్కరించారు. రాజ్యసభలో వెంకయ్యనాయుడు విభజన బిల్లులో కొన్ని సవరణలు సూచించారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలని కోరారు. లేకుంటే విభజన బిల్లును అడ్డుకుంటామని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఒకవేళ రాజ్యసభలో ఆ బిల్లు ఆమోదం పొందకపోతే మళ్లీ లోక్‌సభకే తిరిగి వెళ్లేది. తెలంగాణ ప్రజల నోటికాడి బుక్క కింద జారిపడే పరిస్థితి. ఈ అత్యయిక పరిస్థితులను గమనించి కేసీఆర్‌తో పాటు నేను సోనియాగాంధీ, నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ప్రత్యక్షంగా కలిశాం. రాజ్యసభలో విభజన బిల్లు ఆమోదం పొందేలా చూడాలని మన్మోహన్‌సింగ్‌ను కోరాం. మా వినతి మేరకు మరునాడు ఉదయమే ఆయన రాజ్యసభకు చేరుకొని వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీ తదితరుల డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఏపీ విభజన బిల్లుకు మద్దతు ఇవ్వాలని వారిని కోరారు. బిల్లు ఆమోదానికి ముందు ప్రసంగించిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్%్లా% తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రస్తావిస్తూ ఈ దేశం ఎలాంటి క్లిష్ట నిర్ణయాలైనా తీసుకోగలదని పేర్కొన్నారు. కేసీఆర్‌కు మాట ఇచ్చినట్టుగానే మన్మోహన్‌సింగ్ చివరి వరకు రాజ్యసభలోనే ఉండి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లు ఆమోదం పొందేలా చూశారు. తద్వారా తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకార మైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.




## వలసల చిచ్చు ఇమిగ్రేషన్ విధానంపై రెండు వర్గాలుగా చీలిన ట్రంప్ టీమ్

ప్రతిభ ఆధారిత వలస విధానానికి ఎలాన్ మస్క్, శ్రీరామ్ కృష్ణన్, వివేక్ రామస్వామి మద్దతు

### వారి ముగ్గురిపై ట్రంప్ మద్దతుదారుల విమర్శలు

అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శిబిరంలో చిచ్చు రేగింది. వలస విధానాలపై ఆయన అనుచరులు రెండుగా చీలారు. ప్రతిభ ఆధారిత వలస విధానానికి ఒక వర్గం మద్దతు ఇవ్వగా, కఠినమైన వలస విధానాలను అమలు చేయాలని మరో వర్గం వాదిస్తున్నది. కృత్రిమ మేధపై వైట్‌హౌస్ సీనియర్ పాలసీ అడ్వైజర్‌గా భారత సంతతికి చెందిన శ్రీరామ్ కృష్ణన్‌ను నియమించిన నాటి నుంచి ఈ వివాదం మొదలయ్యింది. ఇతర దేశాల నిపుణులకు ఇచ్చే గ్రీన్‌కార్డులపై పరిమితులు తొలగిస్తే బాగుంటుందని శ్రీరామ్ కృష్ణన్ అభిప్రాయపడటం వివాదానికి ఆజ్యం పోసింది.

### వారిని పార్టీ నుంచి తొలగించండి: మస్క్

ట్రంప్‌కు కీలక మద్దతుదారుగా ఉన్న ఎలాన్ మస్క్ సైతం ప్రతిభ గల ఇతర దేశాల నిపుణులకు అమెరికా వీసాలు దక్కాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మస్క్ అభిప్రాయానికి ట్రంప్ శిబిరంలోని భారత సంతతి వ్యక్తి వివేక్ రామస్వామి మద్దతు ఇచ్చారు. వీరిపై పలువురు రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులు విమర్శలు గుప్పించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మస్క్.. ద్వేషపూరిత, జాత్యాంహంకారం కలిగిన మూరు?లను పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# రంగులు మార్చే స్మార్ట్‌ఫోన్




ఏ వస్తువు కొందాం అనుకున్నా సరే.. దాంట్లో ఏంటి స్పెషల్ అనేది నిశితంగా చూస్తాం. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ కొనేటప్పుడు అయితే చెప్పనక్కర్లేదు. మొత్తం జల్లడపట్టేసి ఓ ఫోన్ సెలెక్ట్ చేస్తాం. అందుకే 'రియల్ మీ' సంస్థ '14 ప్రో 5%+%' సిరీస్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఇందులో 14 ప్రో, 14 ప్రో మోడళ్లు ఉన్నాయి. ఫోన్ బ్యాక్ ప్యానల్ రంగులు మారడం వీటిలోని ప్రత్యేకత. ఈ తరహా ఫీచర్‌తో వచ్చిన మొట్టమొదటి ఫోన్ సిరీస్ ఇదే. ఈ ఫోన్ వెనుక భాగం నీటిలో తడిపితే చాలు.. భిన్నమైన వర్ణాలు కనువిందు చేస్తాయి. 69 సర్టిఫికేషన్లతో ఫోన్‌కి సేఫ్టీ కల్పించారు. అందుకే ఫోన్ నీళ్లలో తడిసినా పాడవదు. పైగా రంగులు మారుతూ అలరిస్తుంది. తెలుపు రంగులో తయారైన ఈ ఫోన్ బ్యాక్ కవర్ టెంపరేచర్ 16 డిగ్రీల కన్నా తక్కువ నమోదైనప్పుడు రంగు మారుతుంది. 'రియల్ మీ 14 ప్రో' వెనక భాగంలో మూడు కెమెరా సెన్సార్లు.. మూడు ఎల్ఈడీ ఫ్లాష్‌లు ఉన్నాయి. అంతేకాదు ఇందులోని 'క్వాడ్‌కర్డ్ డిస్ ప్లే' కారణంగా రౌండ్ కార్నర్స్ స్క్రీన్ కొనల వరకూ దృశ్యం కనిపిస్తుంది. ఈ నెలలోనే ఈ సిరీస్ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# తీరు మారేదే..లే ఆగని రూపాయి పతనం




భారతీయ కరెన్సీ రూపాయి.. డాలర్ ముందు తేలిపోతున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో రూపీ మారకపు విలువ రోజుకింత దిగజారుతూ ఆల్‌టైమ్ కనిష్ఠాలకు పతనమవుతున్నది. గురువారం మరో 11 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోల్చితే ఎక్స్ఛేంజ్ రేటు 85.75 వద్దకు క్షీణించింది. దీంతో ఈ ఏడాది రూపాయికి తొలి నష్టం ఎదురైనట్టైంది. ఇంట్రా-డేలోనైతే 85.79కి పడింది. ఇక బుధవారం స్థిరంగా ఎక్కడిదక్కడే ఉన్న విషయం తెలిసిందే. కాగా, దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్, దేశీయ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు ట్రేడర్లు చెప్తున్నారు. కాగా, ఈ 2025లో ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలు తక్కువేనన్న సంకేతాలు, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాబోతుండటంతో పరుగులు పెడుతున్న డాలర్ ఇండెక్స్, అమెరికా పదేండ్ల బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారడం వంటివి భారతీయ కరెన్సీని మరింత ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. రూపాయి పత నం దేశ ఆర్థిక వ్యవస్థకూ ఇబ్బందే. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు, జీడీపీ పతనం వంటి దుష్పరిణామాలకు దారితీస్తుంది.

# హైదరాబాద్‌లో సియారా గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్

GIC | Global Innovation Center

అమెరికాకు చెందిన కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ టెక్నాలజీ సేవల సంస్థ సియారా..హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్(జీఐసీ)ని ప్రారంభించింది. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ జీఐసీ సెంటర్ ప్రపంచంలో అతిపెద్దది కావడం విశేషం. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 100 మంది వరకు ఉద్యోగస్తులు విధులు నిర్వహిస్తుండగా, వచ్చే రెండు నెలలో ఈ సంఖ్యను 200కి పెంచుకోనున్నట్లు కంపెనీ సీఈవో రిషీ రానా తెలిపారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను 500కి పెంచుకునే అవకాశం కూడా ఉందన్నారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు భేష్‌గ్గావున్నాయని, దీంతో అంతర్జాతీ టెక్నాలజీ సంస్థలు ఇక్కడ జీఐసీలను ఏర్పాటు చేయడానికి ముందుకొస్తున్నట్లు ఆయన చెప్పారు. కంపెనీ ఆదాయం వచ్చే రెండేండ్లలో 200 మిలియన్ డాలర్లకు చేరుకుంటున్నదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు.

# ఇండో ఫార్మ్ ఐపీవోకి అపూర్వ స్పందన

INDO FARM

వ్యవసాయ పరికరాల తయారీ సంస్థ ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ పబ్లిక్ ఇష్యూనకు అపూర్వ స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 225.57 రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. రూ.260 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి 84.70 లక్షల షేర్లను విక్రయించడానికి పెట్టగా..దీనికి 192 కోట్ల షేర్లకు బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. అంటే రూ.260 కోట్ల ఐపీవోకి రూ.41,459 కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.78 కోట్లు సేకరించిన సంస్థ. షేరు ధరల శ్రేణిని రూ.204-215గా నిర్ణయించింది. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించిన 86 లక్షల ఈక్విటీ షేర్లలో 35 లక్షల షేర్లు ప్రమోటర్ రణ్‌బీర్ సింగ్‌నకు చెందినవి.

## ఇండోఫామ్ ఐపీఓకు ఇన్వెస్టర్ల స్పందన అదుర్స్ 227.57 రెట్లు సబ్ స్క్రిప్షన్



ట్రాక్టర్లు, క్రేన్లు, ఇతర వ్యవసాయ పరికరాలు తయారు చేసే సంస్థ 'ఇండోఫామ్' రూ.260 కోట్ల నిధుల సేకరణతో ఐపీఓకు వెళ్లింది. గురువారం ఐపీఓ ముగింపు గడువు పూర్తయ్యే సరికి ఇండో ఫామ్ షేర్ 227.57 రెట్లు సబ్ స్క్రైబ్ అయ్యింది. 84.70 లక్షల షేర్లకు 1,92,75,49,292 షేర్ల కోసం ఇన్వెస్టర్లు బిడ్లు దాఖలు చేశారు. ఇందులో నాన్ ఇన్ స్టిట్యూషన్ ఇన్వెస్టర్లు 501.65 రెట్లు సబ్ స్క్రిప్షన్ బిడ్లు వేశారు. క్వాలిఫైడ్ ఇన్ స్టిట్యూషన్ బయ్యర్స్ 242.40 రెట్లు, రిటైల్ ఇండివిడ్యుయల్ ఇన్వెస్టర్లు 101.64 రెట్లు బిడ్లు దాఖలు చేశారు. అంతకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.78 కోట్ల నిధులు సేకరించింది ఇండో ఫామ్. ప్రమోటర్ రణ్ బీర్ సింగ్ ఖాద్వాలియాకు చెందిన 35 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా, 86 లక్షల షేర్లు తాజా ఇష్యూ జారీ ద్వారా ఇండో ఫామ్ ఐపీఓకు వెళ్లింది. ఐపీఓ ద్వారా సేకరించిన నిధులను భవిష్యత్ పెట్టుబడి అవసరాల కోసం ఖర్చు చేస్తామని ఇండో ఫామ్ తెలిపింది. ఐపీఓలో షేర్ల జారీ ధర రూ.204-215గా నిర్ణయించారు. అంటే రూ.260 కోట్ల విలువ గల ఐపీఓకు రూ.41,459 కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి.

# మే(జో)కిన్ ఇండియా!



## దేశంలో తయారీ రంగం కుదేలు
## ఏడాది కనిష్ఠానికి వృద్ధిరేటు డౌన్
## డిసెంబర్‌లో 56.4గానే నమోదు
## కొత్త ఆర్డర్లు లేక పడకేసిన ఉత్పత్తి

'మేకిన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' అంటూ గడిచిన పదేండ్లుగా ఊదరగొడుతున్న కేంద్రంలోని ఎన్డీయే సర్కారు ఆర్భాట ప్రచారమంతా ఉత్తదేనని తేటతెల్లమైంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన తయారీ రంగం గతంలో ఎన్నడూ చూడని గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఉత్పాదక రంగంలో వృద్ధిరేటు ఏకంగా 12 నెలల కనిష్ఠాన్ని చేరుకోవడమే ఇందుకు రుజువు. డిసెంబర్‌లో మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.4కే పరిమితమైంది. కొత్త ఆర్డర్లు లేకపోవడంతో ఉత్పత్తిలో పెరుగుదల కనిపించకుండా పోయిందని హెచ్‌ఎస్‌బీసీ తాజా సర్వే తేల్చిచెప్పింది. దేశ జీడీపీలో 17 శాతం వా టా కలిగిన తయారీ రంగం అంతకంత కూ కుదేలవుతున్నది. కొత్త ఆర్డర్లు లేకపోవడంతో పరిశ్రమల్లో ఉత్పత్తి దారుణంగా పడిపోతున్నది. దేశంలోని పరిశ్రమల్లో ఉత్పత్తి తీరుతెన్నులకు అద్దం పట్టే హెచ్‌ఎస్‌బీసీ-మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) గణాంకాలే ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు తీసుకొంటున్న విధానపరమైన నిర్ణయాల్లో లోపమే ఇందుకు కారణమని పారిశ్రామికవేత్తలు ఆరోపిస్తున్నారు.

**ఆర్డర్లు లేకపోవడంతో..**

తయారీ రంగానికి సంబంధించి పారిశ్రామిక ఉత్పత్తుల్లో వృద్ధిరేటును బేరీజువేసే మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ మరింతగా పతనమైంది. గత నవంబర్‌తో పోలిస్తే మరింతగా తగ్గి డిసెంబర్‌లో 56.4కు పరిమితమైంది. ఇది 12 నెలల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. తయారీ రంగంలో కొత్త అవకాశాలు సన్నగిల్లడంతో ఆర్డర్లు తగ్గి ఉత్పత్తిలో పెరుగుదల మందగించిందని సర్వే అభిప్రాయపడింది. భారతీయ మార్కెట్‌లో నెలకొన్న దుస్థితికి ఇది నిదర్శనంగా తెలుస్తున్నది. అంతకుముందు నెల నవంబర్‌లో 56.5 శాతంగా నమోదైన వృద్ధిరేటు మరింతగా తగ్గడంతో దేశంలో వ్యాపార-పారిశ్రామిక నిర్వహణ పరిస్థితులు ఇంకా దిగజారాయని సర్వే అభిప్రాయపడింది.

**పోటీ, ఒత్తిళ్లు**

తయారీరంగం ఈ స్థాయిలో గడ్డుపరిస్థితులు ఎదుర్కోవడానికి 5 శాతం కంటే ఎక్కువగా కొనసాగుతున్న ద్రవ్యోల్బణం, పోటీ, ఒత్తిళ్లే కారణమని సర్వే అభిప్రాయపడింది. ప్రతీ పది కంపెనీలో కేవలం ఒక్క కంపెనీ మాత్రమే అదనపు కార్మికులను నియమిస్తుండగా, ప్రతీ పదిలో రెండు కంపెనీలు ఉద్యోగులను తీసివేస్తున్నట్టు సర్వే పేర్కొంది.

**భవిష్యత్తులోనూ కష్టమే!**

'భారతీయ తయారీ రంగ కార్యకలాపాలు మందగమనంలో కొనసాగుతున్నాయి. గత ఏడాది వచ్చిన కొత్త ఆర్డర్లలో చెప్పుకోదగ్గ వృద్ధేమీ కనిపించలేదు. దీంతో ఉత్పాదక రంగంలో భవిష్యత్తు వృద్ధి బలహీనమే అని చెప్పవచ్చు'

# 40,000 కోట్ల ఐపీవో!

## ఈ ఏడాది ద్వితీయార్ధంలో జియో పబ్లిక్ ఇష్యూకు వచ్చే అవకాశం సంస్థ విలువ రూ.10 లక్షల కోట్లపైనే

భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ రాబోతున్నది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని దేశీయ టెలికం రంగ దిగ్గజం రిలయన్స్ జియో.. ఏకంగా రూ.35,000-40,000 కోట్ల ఐపీవోకు వస్తున్నట్టు తెలుస్తున్నది. అధినేత అంబానీ ఈ ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. దీంతో ఇప్పటిదాకా హ్యుందాయ్ పేరిట ఉన్న భారీ ఐపీవో (రూ.27,870 కోట్లు) రికార్డు త్వరలోనే కనుమరుగైనట్టే. గత ఏడాది అక్టోబర్‌లో వచ్చిన హ్యుందాయ్ పబ్లిక్ ఇష్యూనే ప్రస్తుతం దేశంలో వచ్చిన ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లలో అతిపెద్దదిగా ఉన్నది.

**ద్వితీయార్ధంలో..**

ఈ ఏడాది జూలై-డిసెంబర్‌లో జియో ఐపీవో రావచ్చన్న అంచనాలున్నాయి. ఇక సంస్థ విలువ రూ.10 లక్షల కోట్లపైనే (120 బిలియన్ డాలర్లు) ఉంటుందని లెక్కిస్తున్నారు. అమ్మకానికి ప్రస్తుత షేర్లు, కొత్త షేర్లు రెండూ పెట్టవచ్చని సమాచారం. ప్రధాన ఇన్వెస్టర్ల కోసం ఇప్పటికే ప్రీ-ఐపీవో ప్లేస్‌మెంట్ కోసం చర్చలు కూడా మొదలయ్యాయి. కాగా, నిరుడు జూలైలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ జెఫ్రీస్.. ఈ ఏడాది 112 బిలియన్ డాలర్ల విలువతో రిలయన్స్ జియో ఐపీవో వస్తుందని చెప్పిన సంగతి విదితమే. ఇదిలావుంటే గడిచిన పదేండ్లలో తొలిసారి గత ఏడాది రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) షేర్లు మదుపరులకు నష్టాలను మిగిల్చాయి. 2024లో ఆర్‌ఐఎల్ షేర్ విలువ దాదాపు 6 శాతం పడిపోయింది. అయినప్పటికీ జియో ఐపీవోకు ముకేశ్ అంబానీ సిద్ధమవుతుండటం ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

**చార్జీల దెబ్బ...**

గత ఏడాది జూలైలో టెలికం సంస్థలు మొబైల్ టారీఫ్ చార్జీలను పెంచాయి. అయితే ఈ నిర్ణయం జియోసహా మిగతా అన్ని సంస్థలనూ దెబ్బతీసింది. జూలై నుంచి అక్టోబర్ వరకు జియో కస్టమర్లు సుమారు 1.65 కోట్లు తగ్గిపోయారు. అయినప్పటికీ దేశీయంగా జియో కస్టమర్లే ఇప్పటికీ ఎక్కువ. వినియోగదారులపరంగా జియో మార్కెట్ వాటా 40 శాతంగా ఉన్నది. ఈ నేపథ్యంలో పోయిన కస్టమర్లను తిరిగి ఆకట్టుకునేందుకు మార్కెట్‌లో ధరల యుద్ధం చోటుచేసుకోవచ్చని, ఇది ఏఆర్‌పీయూ (ఒక్కో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం)ను ప్రభావితం చేయవచ్చని ఇండస్ట్రీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో రాబోయే జియో ఐపీవోపై ఈ పరిస్థితుల ప్రభావం తప్పక ఉంటుందని కూడా వారు విశ్లేషిస్తున్నారు.




# మార్కెట్లోకి హ్యుందాయ్ క్రెటా ఈవీ

**సింగిల్ చార్జింగ్‌తో 473 కిలోమీటర్లు**




దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్..మరో ఈవీని దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. దేశీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన క్రెటాను గురువారం ఈవీ రూపంలో ఆవిష్కరించింది. ఈ నెలలో జరగనున్న వాహన పండుగలో ఈ కారును ప్రదర్శించబోతున్నది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ధర రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల మధ్యలో ఉంటుందని అంచనా. దీంట్లో 51.4 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 473 కిలోమీటర్లు మైలేజీ ఇవ్వనుండగా, 42 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 390 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. దేశీయ మార్కెట్లోకి సంస్థ విడుదల చేసిన మూడో మాడల్ ఇదే కావడం విశేషం. టాటా కర్వ్.ఈవీ, ఎంజీ జెడ్ఎస్ ఈవీ, మారుతి ఈ-విటారా, బీవైడీ ఆటో 3లకు పోటీగా సంస్థ ఈ వాహనాన్ని విడుదల చేస్తున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

**ఎలక్ట్రిక్ కారు ప్రత్యేకతలు**

సింగిల్ చార్జింగ్‌తో 473 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.కేవలం 7.9 సెకండ్లలో 100 కిలోమీటర్లు వేగాన్ని అందుకోనున్నది.

వాయిస్‌తో పానోరామిక్ సన్‌రూఫ్ కంట్రోల్, రెండు 10.25 ఇంచుల డిజిటల్ ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే

ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీల కెమెరా, డిజిటల్ కీ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది.

కేవలం 58 నిమిషాల్లోనే 80 శాతం వరకు బ్యాటరీ చార్జింగ్‌కానున్నది. మొత్తం 4 గంటల్లో పూర్తికానున్నది.

ఈ కారుపై ఎనిమిదేండ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల బ్యాటరీ వ్యారెంటీ కల్పిస్తున్నది సంస్థ

## నాలుగేండ్ల కనిష్టానికి కార్ల విక్రయాలు
# పట్టణ ప్రాంతాల్లో అంతంతే పల్లెలే బెస్ట్



కరోనా తర్వాత కార్ల విక్రయాలు పుంజుకున్నా.. తొలిసారి వెనకబడ్డాయి. 2023తో పోలిస్తే ప్రాథమిక అంచనాల ప్రకారం 2024లో కార్ల విక్రయాలు ఐదు శాతం తగ్గాయి. 2023లో 41.1 లక్షల కార్ల విక్రయాలు నమోదైతే 2024లో 43 లక్షల యూనిట్లకు చేరాయి. 2023తో పోలిస్తే వృద్ధి సాధించినా.. ఎస్‌యూవీ కార్లకు పెరిగిపోయిన పాపులారిటీ వల్లేనని చెబుతున్నారు. 2024 కార్ల విక్రయాల్లో 54 శాతం విక్రయాలు ఎస్‌యూవీ కార్లవే. కార్ల విక్రయాలు తగ్గడానికి పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఒత్తిళ్లేనని తెలుస్తున్నది. 2024లో కార్లకు గిరాకీ తగ్గడంతో పలు కార్ల తయారీ సంస్థలు తమ ఉత్పత్తుల విక్రయాల పెంపు కోసం డిస్కౌంట్లు, ధరల తగ్గింపు వంటి చర్యలు చేపట్టాయి. ఇటీవలి కాలంలో సేఫ్టీ కోసం కర్బన ఉద్గారాల నియంత్రణ కోసం కఠినంగా నిర్ణయం అమలు చేయడం వల్ల కార్ల ధరలు పెరిగాయి. తక్కువ ధరకు కార్ల లభ్యత లేకపోవడంతో పట్టణ ప్రాంతాల్లో సేల్స్ గ్రోత్ తగ్గింది. సవాళ్లతో సతమతం అవుతున్నా 2024లో మారుతి సుజుకి బెస్ట్ సేల్స్ రికార్డు నమోదు చేసింది. గ్రామీణ ప్రాంతాల నుంచి గిరాకీ పెరగడంతో 2024లో 17.4 లక్షల కార్లు విక్రయిస్తే 2024లో 17.9 లక్షల కార్లు విక్రయించింది. ఎస్‌యూవీలకు పరిమితం కాకుండా అన్ని సెగ్మెంట్లలోనూ గ్రోత్ సాధించడం వల్లే గ్రోత్ సాధించామని మారుతి సుజుకి మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ చెప్పారు. హ్యుందాయ్ మోటార్స్ 2023తో పోలిస్తే ఫ్లాట్ గ్రోత్ నమోదు చేసుకుంది. 2023 కంటే ఒక్క శాతం ఎక్కువ సేల్స్ నమోదు చేసుకున్నది. పరిశ్రమలో సమస్యలు ఉన్నా 2024లో స్థిరంగా కార్ల విక్రయం సాగిందని హ్యుందాయ్ మోటార్ ఇండియా డైరెక్టర్ కం సీఓఓ తరుణ్ గార్గ్ చెప్పారు. ఇక దేశీయ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ వరుసగా నాలుగో ఏడు 2024లో 5.6 లక్షలకు పైగా కార్లు విక్రయించింది. ఎస్‌యూవీలు, సీఎన్జీ పవర్డ్ కార్లకు పాపులారిటీ పెరగడం వల్లే కార్ల విక్రయంలో గ్రోత్ సాధ్యమైందని టాటా మోటార్స్ ఎండీ శైలేష్ చంద్ర చెప్పారు.

## త్వరలో భారత్ మార్కెట్లోకి
# రెడ్‌మీ టర్బో 4 ఇవీ స్పెషిఫికేషన్స్



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రెడ్‌మీ తన రెడ్‌మీ టర్బో 4 ఫోన్‌ను గురువారం చైనా మార్కెట్లో ఆవిష్కరించింది. మీడియాటెక్ డైమెన్సిటీ 8400-అల్ట్రా చిప్‌సెట్‌తో వస్తున్న తొలి స్మార్ట్ ఫోన్ ఇది. 90వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6550 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ కలిగి ఉంటుంది. ఆండ్రాయిడ్ 15 బేస్డ్ షియోమీ హైపర్ ఓఎస్ 2.0 స్కిన్ ఆన్ టాప్ వర్షన్ పై పని చేస్తుంది. త్వరలో భారత్‌తోపాటు గ్లోబల్ మార్కెట్లలో ఈ ఫోన్ ఆవిష్కరిస్తారని తెలుస్తున్నది. 1.5కే ఓలెడ్ డిస్ ప్లే, 50-మెగా పిక్సెల్ డ్యుయల్ రేర్ కెమెరా సిస్టమ్‌తో వస్తోందీ ఫోన్. రెడ్‌మీ టర్బో 4 ఫోన్ 12 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ సుమారు రూ.23,500 (1999 చైనా యువాన్లు), 16 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ దాదాపు రూ.25,800 (2199 చైనా యువాన్లు), 12 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ సుమారు రూ.27 వేలు (2299 చైనా యువాన్లు), 16 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ దాదాపు రూ.29,400 (2499 చైనా యువాన్లు) పలుకుతుంది. లక్కీ క్లౌడ్ వైట్, షాడో బ్లాక్, షాలో సీ బ్లూ రంగుల్లో లభిస్తుందీ ఫోన్. రెడ్‌మీ టర్బో 4 ఫోన్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.67 అంగుళాల 1.5 కే (1220ఐ2712 పిక్సెల్స్) ఓలెడ్ డిస్ ప్లే, 1920 హెర్ట్జ్ పీడబ్ల్యూఎం డిమ్మింగ్ రేట్, 2560 హెర్ట్జ్ ఇన్ స్టంట్ టచ్ శాంప్లింగ్ రేట్, గరిష్టంగా 3200 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, డోల్బీ విజన్ మద్దతుతో హెచ్డీఆర్10ం కూడా ఉంటుంది. 4ఎన్ఎం ఒక్టాకోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 8400 %-% అల్ట్రా ఎస్వోసీ ఉంటుంది. రెడ్‌మీ టర్బో 4 ఫోన్ 50-మెగా పిక్సెల్ సోనీ ఎల్వైటీ-600 ప్రైమరీ రేర్ సెన్సర్ కెమెరా, 8-మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ సెన్సర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 20 మెగా పిక్సెల్ ఓవీ20బీ సెన్సర్ కెమెరా ఉంటాయి. 90వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6550 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తోంది. సెక్యూరిటీ కోసం ఇన్ డిస్ ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంటుంది. 5జీ, డ్యుయల్ 4జీ ఓల్ట్, వై-ఫై 6, బ్లూటూత్ 6.0, జీపీఎస్, గెలిలియో, గ్లోనాస్, క్యూజడ్ఎస్ఎస్, నేవిల్ సీ, ఎన్ఎఫ్ సీ, యూఎస్బీ టైప్ సీ పోర్ట్ కనెక్టివిటీ ఉంటుంది.

printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com